లఘుగ్రంథాలు

# ప్రపంచ తెలుగు మహాసభలు

27-29, డిసెంబర్ 2012, తిరుపతి

# తెలుగు చిత్రకారులు


రచన

డా॥ పి. జోగినాయుడు



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

రాష్ట్ర సాంస్కృతిక శాఖ, సాంస్కృతిక మండలి

పొట్టి శ్రీరాములు

తెలుగు విశ్వవిద్యాలయం

Blank Page

లఘు గ్రంథాలు

# తెలుగు చిత్రకారులు

## డా|| పి. జోగినాయుడు

ప్రపంచ తెలుగు మహాసభలు

27-29 డిసెంబర్, 2012, తిరుపతి

**పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం**

మండలి వెంకట కృష్ణారావు అంతర్జాతీయ తెలుగు కేంద్రం

హైదరాబాద్

తెలుగు చిత్రకారులు

Telugu Chitrakarulu

రచయిత : డా॥ పి. జోగినాయుడు

ISBN : **81-86073-342-9**

© పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

ప్రచురణల సంఖ్య: 481

వెల : **రూ. 20/-**

ప్రతుల సంఖ్య : **5000**

ముద్రణ : **డిసెంబరు, 2012**

ప్రతులకు : **సంచాలకులు**
ప్రచురణల విభాగం,
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాద్ - 500 004.

ముద్రణ : **కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్**, విద్యానగర్, హైదరాబాద్.

యన్. కిరణ్ కుమార్ రెడ్డి

హైదరాబాదు

ముఖ్యమంత్రి
ఆంధ్రప్రదేశ్



# నాంది

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని ఒక్క వేదిక పైకి తీసుకు వచ్చేందుకు, తెలుగు ప్రభలను దశదిశలా వ్యాపింపజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2012 డిసెంబర్ 27 నుండి 29 వరకు ఏడుకొండలవాడి ఆవాసమైన తిరుపతి పుణ్య క్షేత్రంలో అత్యున్నత స్థాయిలో తెలుగు మహాసభలను ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోనూ, దేశంలోనూ, ఇతర దేశాల్లోనూ ఉన్న తెలుగు వారందరూ పరస్పరం భావ వినిమయం చేసుకోవడానికీ, తెలుగువారు తమ గత చరిత్రను సంస్మరించుకుంటూ, ఉత్కృష్టమైన భవిష్యత్తును నిర్మించుకోవడానికో ఈ మహా సభలు ఎంతగానో దోహదం చేస్తాయని మేము విశ్వసిస్తున్నాం.

తొలి ప్రపంచ తెలుగు మహాసభలు జరిగి 37 సంవత్సరాలు గడిచాయి. అయితే ఇంతవరకూ ఏ రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ మహాసభలను నిర్వహించడానికి చొరవ చూపలేదు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ ప్రజాజీవితాన్ని ఎలా మెరుగుపరచాలీ, తెలుగు వారి వైభవాన్ని ఎలా పరిరక్షించాలీ అనే దృష్టితో పనులు చేపడుతోంది. తెలుగువారి నిర్వహణ సామర్థ్యాన్ని ఇటీవల జరిగిన జీవ వైవిధ్య సదస్సులో కూడ ప్రభుత్వం నిరూపించింది. ఈ నేపథ్యంలోనే ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించడానికి సమాయత్తమైంది.

ఇటీవల కాలంలో ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో రాజకీయ, సామాజిక, సాంస్కృతిక పరిణామాలు సంభవించాయి. వీటి నేపథ్యంలో బహుభాషా దేశమైన మన భారత దేశంలో తెలుగు భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, కళలు మొదలైన విషయాల్లో జరిగిన కృషి గురించి, జరగవలసిన కృషి గురించి మనం చర్చించవలసింది ఎంతో ఉంది. ప్రపంచీకరణ నేపథ్యంలో మన తెలుగు భాష ఉనికిని కోల్పోకుండా పరిరక్షించేందుకు, తెలుగు ఔన్నత్యాన్ని నలుదిశలా చాటేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. నిత్యం ప్రజల హితం కోరి, ప్రజల అభీష్టాలను నెరవేర్చేందుకు, తెలుగు జాతి దేశ విదేశాల్లో తలెత్తుకు తిరిగేలా చేసేందుకు అవిరళ కృషి చేస్తున్న మా ప్రభుత్వం, తెలుగు తేజం కాంతులు వెదజల్లేలా ఈ మహోజ్వలమైన సభల నిర్వహణకు పూనుకొంది. ఈ సభలలో సదస్సులు, తెలుగు వారి కళా ప్రదర్శనలు, చేతివృత్తుల ప్రదర్శనలు, లలితా కళా వైభవాన్ని చాటే కార్యక్రమాలు, రాష్ట్రేతర, విదేశాంధ్రుల సమావేశాలు, మొదలైన ఎన్నో అంశాలతో పాటు పుస్తక ప్రచురణ కూడ పెద్ద ఎత్తున చేపడుతున్నాం. అందులో భాగంగానే ఈ లఘుగ్రంథాల ప్రచురణ జరుగుతుంది.

ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ మహాసభల సందర్భంగా ప్రచురించే లఘు గ్రంథాలు పాఠకుల ఆదరణ పొందగలవని ఆశిస్తున్నాం.


కిరణ్ రెడ్డి

**(ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి)**

ముఖ్యమంత్రి

**V. VASANT KUMAR,** B.Sc.,(Ag.),M.B.A.
Minister for Tourism & Culture, Archeology & Museums,
Archives & Youth Services & Sports, N.C.C.
Government of Andhra Pradesh

Room No. 501, 5th Floor,
J-Block, A.P. Secretariat,
Hyderabad-500 022.
Phone : 040-23454168, 23450541
Fax : 040-23450899



# ప్రస్తావన

తెలుగువారు తెలుగు నేలపై 37 ఏళ్ళ విరామం తర్వాత చేసుకుంటున్న పండుగ ప్రపంచ తెలుగు మహాసభలు. మన సంస్కృతిని నలుదిశలా వ్యాపింప జేస్తున్న తెలుగు వారందరూ ఒక్కచోట చేరి, తెలుగు దనాన్ని పంచు కునేందుకు, తెలుగు పరిమళాలు వెదజల్లేందుకు ఉద్దేశించిన సన్నివేశం ప్రపంచ తెలుగు మహాసభలు. తెలుగు వారి సంస్కృతి బహుముఖీనమైంది. అందులో భాష. సాహిత్యం, చరిత్ర, లలితకళలు, జానపద, గిరిజన విజ్ఞానం వంటి ఎన్నో అంశాలున్నాయి. వీటన్నిటి గురించి విశ్లేషించుకుని, వాటిని పరిరక్షించడం, పోషించడం, పరివ్యాప్తి చేయడం ప్రభుత్వం తన విద్యుక్త ధర్మంగా భావిస్తున్నది.

ఈ బృహత్తరమైన బాధ్యతని నెరవేర్చే సంకల్పంలో భాగంగానే "ప్రపంచ తెలుగు మహాసభల" నిర్వహణకు ప్రభుత్వం నడుము కట్టింది. అతి తక్కువ వ్యవధిలో అత్యంత సమున్నత స్థాయిలో తలపెట్టిన ఈ మహాసభలకు దేశ విదేశాల నుంచి తెలుగువారు స్వాగతం పలుకుతున్నారు. అత్యధిక సంఖ్యలో ఈ సభల్లో పాల్గొంటున్నారు.

తెలుగు వారందరూ ఒక్కచోట సమకూడి, తమ గురించి చర్చించుకుని, భవిష్యత్తుకు బాటలు వేసుకునే క్రమంలో మన గురించి మనం మరోసారి తెలుసుకునేందుకు, వివిధ రంగాల్లో మనం సాధించిన దాన్ని పునశ్చరణ చేసేందుకు ఈ సభల సందర్భంగా సదస్సులు, లఘుగ్రంథాల ప్రచురణ, ప్రత్యేక సంచికల ముద్రణ,

వివిధ అంశాల్లో ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతున్నది.

తెలుగువారిది ఘనమైన చరిత్ర, అత్యున్నత సంస్కృతి. అయితే కాలంతో పాటు అభివృద్ధి పథంలో నడుస్తున్న తెలుగువారు ఎప్పటి కప్పుడు తమ సంస్కృతిలోకి కొత్త నీరును ఆహ్వానించడం సహజం. ఈ "పాతకొత్తల మేలు కలయికే" ఒక జాతిని నిత్యచైతన్యంతో నింపుతుంది. ఈ విధంగా కొత్త దనాన్ని ఆహ్వానిస్తూనే, మన గతవైభవాన్ని విస్మరించకుండా కాపాడుకోవలసిన బాధ్యత మన మీద ఉంది. ఇవన్నీ ఈ ప్రపంచ తెలుగు మహాసభల్లో చర్చకు రానున్నాయి. అందరం కలిసి, తెలుగుదనాన్ని పరిరక్షించుకునే ప్రయత్నం చేయవలసిన తరుణం ఆసన్నమైంది.

వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకుని తెలుగువారి భాష, సాహిత్యం, సంస్కృతి, పౌరజీవనం తదితర అంశాలపై లఘుగ్రంథాలను నిష్ణాతుల చేత రచింపజేసి ప్రచురించే గురుతర బాధ్యతను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, తెలుగు అకాడమీ, రాష్ట్ర సాంస్కృతిక శాఖ నిర్వర్తిస్తున్నాయి. తెలుగు ప్రజలు కలకాలం ఉపయోగించుకునే విధంగా ఈ పుస్తక ప్రచురణ జరుగుతోంది. వీటిని పాఠకులు, తెలుగు భాషాభిమానులు, పండితులు ఆదరిస్తారని విశ్వ సిస్తున్నాను.

వ. వసంతకుమార్

**(వట్టి వసంతకుమార్)**

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
POTTI SREERAMULU TELUGU UNIVERSITY

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి
ఉపాధ్యక్షులు

లలిత కళాక్షేత్రం,
పబ్లిక్ గార్డెన్స్,
హైదరాబాద్-500 004.

# నివేదన

ఇన్నేళ్ళ తరువాత ప్రపంచ తెలుగు మహాసభలు జరగడం తెలుగు భాషా సాహిత్యాభిమానులకు, సంస్కృత ప్రియులకు, వివిధ రంగాలలో నిష్ణాతులైన మేధావులకు ఆనంద ప్రదమైన అంశం. 1975లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల ఉత్తేజం తోనే 1985లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఆవిర్భవించింది. తెలుగు విశ్వ విద్యాలయం ఈ రాష్ట్రంలోను, భారత దేశంలోను, విదేశాలలోను ఎన్నో సభలు, సమావేశాలు నిర్వహించింది. భాషా సాహిత్య సంస్కృతుల్ని దృష్టిలో ఉంచుకొని అనేక గ్రంథాలను వెలువరించింది. తెలుగు విశ్వ విద్యాలయం అప్పటి సాహిత్య అకాడమీ నిర్వహించిన పాత్రను చాలా వరకు బాధ్యతాయుతంగా నిర్వహిస్తున్నది. విస్తరణ సేవా విభాగాన్ని అకాడమీల విభాగంగా మార్చి దానికి సంబంధించిన కార్యక్రమాలను చేపడుతున్నది. నిధుల కొరత వల్ల కొన్ని కార్యక్రమాలను అనుకున్న స్థాయిలో చేయలేకపోతున్నాం.

ఈ నాలుగవ ప్రపంచ మహాసభల సందర్భంగా తెలుగు విశ్వ విద్యాలయం తన వంతు బాధ్యతను స్వీకరించింది. భారత దేశంలో పదిచోట్ల సన్నాహక సభలు ఇప్పటికే అధిక భాగం నిర్వహించింది. 1975లో మహాసభల సందర్భంగా ప్రచురించిన 30 లఘు గ్రంథాల్ని పునర్ముద్రిస్తున్నది. మరొక 50 గ్రంథాలను ప్రత్యేకమైన అంశాలమీద రాయించి ఈ మహాసభల సందర్భంగా విడుదల చేస్తున్నది. ఆయా రంగాలలో నిష్ణాతులైన వారిచేత ప్రామాణిక గ్రంథాలను రాయించాలన్నది మా విశ్వ విద్యాలయం ఆశయం. నిజంగా ఇంత స్వల్ప సమయంలో గ్రంథ రచన చేసి సహకరించిన రచయితలకు మా ధన్యవాదాలు. ఈ గ్రంథాల ప్రచురణకు ఆర్థిక సహకారం అందించిన ప్రభుత్వానికి ప్రత్యేకంగా ముఖ్యమంత్రి గౌరవనీయులు మాన్యశ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి గారికి, సాంస్కృతిక శాఖామాత్యులు, మాన్యశ్రీ వట్టి వసంతకుమార్ గారికి, సంబంధిత ప్రభుత్వాధికారులకు మా విశ్వవిద్యాలయం పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ పరంపరలో "తెలుగు చిత్రకారులు" అనే అంశం మీద చిరుపొత్తాన్ని సకాలంలో వ్రాసి యిచ్చిన డా।। పి.జోగినాయుడు గారికి ధన్యవాదాలు. గ్రంథముద్రణ కార్యక్రమంలో చేదోడు వాదోడుగా ఉన్న విశ్వవిద్యాలయ రిజిస్టర్ ఆచార్య కె.ఆశీర్వాదం గారికి, ఆచార్య సి.మృణాళినిగారికి మరియు ఆచార్య డి. మునిరత్నం నాయకుడు గారికి అభినందనలు.

(ఎల్లూరి శివారెడ్డి)

## విషయ సూచిక


| | |
|---|---|
| తెలుగు చిత్రకళా సంప్రదాయాలు | 1 |
| తెలుగు వారి ప్రాచీన చిత్రకళ | 3 |
| నవవంగ చిత్రకళ - సంప్రదాయ చిత్రకారులు | 8 |
| చిత్రకళలో తెలుగువారి స్థానం | 10 |
| నవవంగ సంప్రదాయం - తెలుగు చిత్రకారులు | 14 |
| బొంబాయి చిత్రకళ - సంప్రదాయ చిత్రకారులు | 25 |
| మద్రాసు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ - తెలుగు చిత్రకారులు | 37 |
| హైదరాబాద్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ - తెలుగు చిత్రకారులు | 58 |
| ఈతరం ప్రఖ్యాత తెలుగు చిత్రకారులు | 75 |

# చిత్రకళా సంప్రదాయాలు

'ప్రకృతిలో ప్రతి వస్తువూ సౌందర్యాన్నే కలిగి వుంటుంది. పక్షులు మధురమైన ఆలాపనలు చేస్తాయి. అది వాటి సహజగుణం. కవులు గీతాలు పాడుతారు. చిత్రకారులు చిత్తరువులను చిత్రిస్తారు. కానీ వాటిని గ్రహించే సౌందర్య చేతన మనిషిలో వుండాలి. మన హృదయంలో సౌందర్యం మేల్కొననంత వరకూ, బాహ్య ప్రకృతిలోని సౌందర్యం మనకు దర్శనమే ఇవ్వదు. కనుకనే కళాకారుడు అతి సామాన్యమైన వస్తువులో కూడా సౌందర్యాన్ని దర్శించి, దానికి రూపం యిస్తాడు. చిత్రకారుడైతే రేఖల్లో రంగుల్లో, నాట్యకారుడైతే కదలికలో, సంగీతకారుడైతే నాదంతో, కవి అయితే శబ్దాల్లో' డా॥ సంజీవదేవ్ మాటల్లో.

కళలు మానవ సంస్కృతికి నిదర్శనాలు. ఒక దేశపు సంస్కృతికి సాహిత్యం, సంగీతం, నాట్యం, శిల్పం, వాస్తు, చిత్రలేఖనాలు నీరాజనాలు పలుకుతాయి. ఏ దేశపు గౌరవ సంపత్తులైనా, కళల మీదనే ఆధారపడి వుంటాయి. దేశంలో కళలు జీవించాలి అంటే రెండు రకాల వ్యక్తులు అవసరం. కళను సృష్టించే కళాకారుడు, సృష్టించిన కళను అర్ధం చేసుకొని, ఆనందించే సహృదయుడు. ఒక జాతిని మనం పూర్తిగా అర్ధం చేసుకోవాలి అంటే, వారి కళల్ని మనం జాగ్రత్తగా పరిశీలించి, కాపాడుకోవలసిన అవసరం ఎంతైనా వుంది.

చారిత్రక క్రమంలో వివిధ కాలాల్లో వెలసిన ఉత్తమమైన కళలు, సంప్రదాయాల్ని చిత్రకారులు పరిశీలించడం జరుగుతుంది. వాటిని చూచి, రంగుల్లో, రేఖల్లో ఉన్నతమైన భావాలతో చిత్రిస్తారు. ఉదాహరణకు ప్రాచీన వ్యాఖ్యాత యశోధరుడు, వాత్స్యాయన కామసూత్రాలను వ్యాఖ్యానిస్తూ, చిత్రరచనలో పాటించవలసిన ఆరు అంగాలను నిర్వచించాడు.

| | | | |
|---|---|---|---|
| 1) | రూపబేధం | 2) | ప్రమాణం |
| 3) | భావం | 4) | లావణ్యం |
| 5) | సాదృశ్యం | 6) | వర్ణ సంవిధానం |

అందువలన చిత్ర రచనలో ఒక్క 'భావమే' ప్రధానం కాదు. మిగిలిన ఐదు అంగాలకు ప్రాధాన్యం వుంటుంది. వీటిని పూర్వ చిత్రకారులు ఎవ్వరూ విస్మరించలేదు. అందువలనే అజంతా - ఎల్లోరా కుడ్య చిత్రాలను ప్రపంచం అంతా మెచ్చుకుంది. దక్షిణ భారతదేశంలోని 'నటరాజు' పంచలోహ విగ్రహాలు, ఆధ్యాత్మిక, రూపలావణ్యం వలనే ప్రపంచపు గొప్పతనాన్ని ఆపాదించుకున్నాయి. భారతీయ మొఘలు, రాజస్థాన్, దక్కను చిత్రాల్లో ఆడంబరం లేని ఆహ్లాదకరమైన రంగుల మేళవింపు, బంగారు తీగల వంటి రేఖలే ప్రపంచపు ఉత్తమ చిత్రరచనలో స్థానం సంపాదించాయి. ఈ సంప్రదాయాలను అనుసరించే, అనేకమంది భారతీయ చిత్రకారులు వివిధ కాలాల్లో గొప్ప చిత్ర రచనలు చేశారు. చిత్రాలలో భావ ప్రకటనకు సుందర సుకుమార రూపాలకు సమ ప్రాధాన్యత నిచ్చారు. ఆ ప్రక్రియలో తెలుగువారు విశేష ప్రావీణ్యం సంపాదించారు. అజంతా మనది. అమరావతి మనది. 'అంకర్ వాట్' అంగణామణి' మన తెలుగు చిత్రకారులు సృష్టించిందే. మహోన్నతమైన చరిత్ర మన తెలుగు వారిది. వారు గీచిన చిత్రాలు దూర ప్రాచ్య దేశాలకు కూడా వెళ్ళాయి.

సాహిత్యం - సంగీతంలో తెలుగువారు చేసిన కృషికి చక్కని విమర్శలు, గుర్తింపు, విలువలు వచ్చాయి. అపూర్వమైన ఆదరణా, ప్రచారం కూడా జరిగింది. అదేమి పాపమో, తెలుగు చిత్రకారుల కృషి ఒక చోటా వ్రాయబడదు. ప్రశంసలు అంతకన్నా లేవు. తెలుగుదేశంలో 'చిత్రకళ' ఏమున్నదనే స్థితికి ఈనాడు మనం వచ్చాం. చిత్రకళా ప్రపంచంలో మన పూర్వ చిత్రకారులు చేసిన కృషికి సరియైన గుర్తింపు - విలువలు నిర్ణయించుకునే సమయం

ఇప్పుడు వచ్చింది. సుమారు అరవై డెబ్బై సంవత్సరాల పూర్వం ప్రారంభమైన మన తెలుగు – ఆధునిక చిత్రకళా ఉద్యమంలో పూర్వ చిత్రకారుల సంక్షిప్త చిత్రకళా విశేషాలను వివరించే ముందు, మన ప్రాచీనాంధ్ర 'చిత్రకళ'ను గురించి క్లుప్తంగా తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా వుంది.

తెలుగువారు మహా సామ్రాజ్యాలు నిర్మించారు. పరిసర రాజ్యాలపై ఏక చ్ఛత్రాధిపత్యం వహించారు. పూర్వ పశ్చిమ సముద్ర తరంగాల్లో విజయభేరీలు మ్రోగించారు. శాతవాహనులు, ఇక్ష్వాకులు, పల్లవులు, చాళుక్యులు, కాకతీయులు, హంపీ విజయనగర రాజులు, ఒకరి తర్వాత ఒకరు శ్వేతాంధ్ర పతాకాన్ని ఎగుర వేశారు. ఆ సామ్రాజ్యాల కాలాల్లో శిల్ప–చిత్రకళలు మహెూన్నతంగా ఒక వెలుగు వెలిగాయి. శాతవాహన, ఇక్ష్వాకుల కాలంలో బౌద్ధమతం విస్తారంగా వర్ధిల్లింది. అనేక స్థూపాలు, సంఘారామాలు, మహాచైత్య గుహలు నిర్మాణం జరిగాయి. గౌతమ బుద్ధుని జీవితం ఆధారంగా వెలసిన జాతక కథలు, అమరావతి, నాగార్జున కొండ, అజంతాలలో ముఖ్యఘట్టాలుగా రూపు దిద్దుకున్నాయి. బౌద్ధ చిత్రకళ భావనా ప్రకటనకు ఉద్దేశింపబడింది. అజంతా చిత్రాల రంగుల మేళవింపు శోభాయమానంగా వుంటాయి. సాత్త్వికరీతిలో చిత్రకారుడు చిత్రిస్తాడు. చిత్రాలలో రంగుల కోసం ధాతురాగ, కుంకుమ, హరితాళ, నీలిమ వంటి ప్రకృతి సిద్ధమైన రంగులనే వాడారు.

## తెలుగువారి ప్రాచీన చిత్రకళ

ప్రాచీన తెలుగు చిత్రకళ చాలా విస్తృతమైనది. అది ఆంధ్రేతర ప్రాంతాలలో తెలుగువారి చేత చిత్రితమై వుంది. ఆంధ్రేతర చరిత్రకారులచేత తెలుగుదేశంలోనూ చిత్రితమైవుంది. వాస్తవానికి పూర్వం తెలుగు దేశంలో శిల్పకళ వర్ధిల్లినంతగా చిత్రకళ వర్ధిల్లలేదు. అయితే ఆధునిక తెలుగుదేశంలో

చిత్రకళ వర్ధిల్లినంతగా శిల్పకళ వర్ధిల్లలేదు. ప్రాచీనకాలం నాటి శిల్పం శిలా నిర్మితం కనుక అది ఈనాటికీ నిలిచివుంది. ఇక చిత్రకళ విషయం అలా కాదు. వర్ణ ప్రధానమైన చిత్రకళ శాశ్వతమైనది కాదు. అది కాలక్రమేణా నశించిపోతుంది.

ప్రాచీన తెలుగు చిత్రకళ శాతవాహనుల కాలం క్రీ.పూ. 225 - క్రీ.శ. 225 వరకు వికసించింది. అజంతా గుహలలో చిత్రరచన చేసింది తెలుగు చిత్రకారులే. ఉదాహరణకు అజంతా గుహలలోని 10వ గుహను నిర్మించి, చిత్ర రచన చేసింది తెలుగు వారేనని శాసన ఆధారం వుంది. అజంతా గుహల సంఖ్య 29. వాటిలో 9,10 గుహలు ప్రాచీనమైనవి. ఈ గుహలు క్రీ.పూ. ఒకటి రెండు శతాబ్దాలలో ప్రారంభమై క్రీ.శ. 7వ శతాబ్దములో పూర్తి అయ్యాయి. ఆంధ్ర శాతవాహనుల కాలంలో ప్రారంభమై, గుప్తరాజుల కాలంనాటికి పూర్తి అయినవి అన్నమాట.

తరువాత ప్రాచీన పల్లవులు కాలం (క్రీ.శ. 225 - 340) లో ప్రత్యేకించి మొదటి మహేంద్రవర్మ పరిపాలనలో తెలుగు చిత్రకళ పూర్ణంగా వికసించింది. సిత్తన్నవాసల గుహలలోను, పుదుక్కోట సంస్థానంలోనూ, ఆనాటి తెలుగు చిత్రకళ గోచరిస్తుంది. సిత్తన్నవాసల చిత్రకళకూ, అజంతా చిత్రకళకూ ఎంతో సామ్యం కనిపిస్తుంది. అందువలన పూర్వాంధ్ర శిల్పులు, చిత్రకారుల చిత్రలేఖన ప్రతిభ కన్నులారా చూడాలంటే ప్రతి తెలుగువాడు అజంతా, ఎల్లోరా, నాసిక్, కార్లె, కన్హేరి, గుహలు, కోనూరు, కొలనుపాక, వరంగల్, పాలంపేట, విజయవాడ, అల్లూరు, గరికపాడు, ఘంటసాల, చందవరం, అమరావతి, నాగార్జునకొండ, మాచర్ల, చేజెర్ల, చేబ్రోలు, జగ్గయ్యపేట, భట్టిప్రోలు, గోలి, రామిరెడ్డిపాలెం, వేంగి, గుంటుపల్లి, విజయనగరం, సింహాచలం, కాళహస్తి, తిరుపతి, తాడిపత్రి, గుత్తి, హంపీ,పెనుగొండ, లేపాక్షి, కంచి, మహాబలిపురం, పక్షితీర్ధం, మధుర, రామేశ్వరం, తంజావూరు,

తిరుచునాపల్లి మొదలయిన చారిత్రక ప్రదేశాలు సందర్శించవలసిందే.

6వ శతాబ్ద కాలంనాటి చాళుక్యుల చిత్రకళ అజంతా పద్ధతిలోనే రూపుదిద్దుకుంది. అజంతా చిత్రాలను అనుకరించి, శిల్పాలు సృష్టించినట్లు విశదమౌతుంది. తొమ్మిదో శతాబ్దానికి చెందిన ఎల్లోరా కైలాససభలోని దేవకన్యల కుడ్యచిత్రాలు అత్యంత సుందరాలంకరణలతో రూపొందించ బడ్డాయి. తెలుగుదేశంలో చాళుక్యుల కాలం నాటి మెదక్ జిల్లా అల్లా దుర్గ ప్రాంతంలో లభించిన కుడ్య చిత్రాలు అజంతా చిత్రరీతిలోనే చిత్రితమయ్యాయి.

చాళుక్యుల తర్వాత కాకతీయులు తెలుగుదేశాన్ని పాలించారు. (వారి కాలం క్రీ.శ. 1089 - 1323 వరకు) కాకతీయుల నాటి చిత్రలేఖనం ఘనంగా చెప్పుకోదగిన చిత్ర సంపద వెలుగులోకి రాలేదు. కేవలం ఆనాటి సాహిత్యంలో కానవచ్చే ప్రస్తావనల మీదనే ఆధారపడవలసి వుంది. శ్రీనాధుని క్రీడాభిరామం ప్రౌఢకవి మల్లన రచనలు వలన కొంత తెలుస్తున్నది. మల్లన 'గోడలు చెలువారి కృష్ణ లీలలు లిఖియించి' అని వ్రాయడం దీనికి ఉదాహరణ. అందువలన శైలిని గురించి గాని, కళావిషయంగా ఆనాటి చిత్రాల స్థానాన్ని గురించి గాని మనమేమి చెప్పలేం. ఇటీవలనే మాచర్ల, త్రిపురాంతకం, రాచకొండ, పిల్లలమర్రి ఆలయాల్లో కొన్ని అస్పష్ట చిత్రాలు కనిపించాయి. ఇవి పరిమాణంలో చిన్నవిగా వుండి స్పష్టమైన అవగాహనకు వచ్చేందుకు తోడ్పడేవిగా లేవు. కాగితం వాడుకలోకి రాకమునుపు చిత్రాలు ఎక్కువగా గోడలమీద, కొయ్యపలకలమీద, వస్త్రాలమీదా చిత్రించబడేవి. ఇవి కాలక్రమేణా, వాతావరణం ఒడుదుడుకుల వలన నాశనం అయ్యి వుండవచ్చును.

తెలుగుదేశంలో మనకు లభించిన అతి ముఖ్యమైన వర్ణ చిత్రాలు విజయనగరం రాజ్యం కాలంలో (క్రీ.శ. 1336-1575)లో లభించాయి.

అన్ని రంగాలలో అభివృద్ధి గాంచినట్లే చిత్రకళ కూడా వీరి కాలంలో అభివృద్ధి చెందింది. విజయనగర చిత్రాలన్నింటిలోనూ అత్యంత ప్రాచీనమైనవి, 'అనెగొంది' లోని ఉచ్చయప్ప మఠంలోనివి. ఈ చిత్రాలకు తరువాత కాలపు విజయనగర చిత్రాలకు చెప్పుకోదగిన బేధం కానవస్తుంది. ఇది రేఖా రచనలోనూ, రూపనిర్దేశంలోనూ, చిత్ర సమాహారణలోనూ కన్పిస్తుంది. విజయనగర చిత్రాలు అనగానే మనకు వెంటనే గుర్తుకు వచ్చేవి 'లేపాక్షి' చిత్ర సముదాయం, సోమపాలెం, హంపీ విరూపాక్షాలయం లోని చిత్రాలు విశేష ప్రాచుర్యం పొందాయి. ఈ చిత్రాలన్నీ హుందాగా, వాస్తవికంగా జానపద సంప్రదాయపు రీతులలో కన్పిస్తాయి. లేపాక్షి చిత్రాలలో ప్రముఖంగా కన్పించే ప్రత్యేకత 'నేత్రాలు', అర్ధముఖం చిత్రించే సమయాల్లో ఒకటి పూర్తి నేత్రం, రెండవది సగం కనిపిస్తున్నట్లు చిత్రకారుడు చిత్రించాడు. ఈశైలి తర్వాత కాలంలో వచ్చే మొఘలు, బసోలి లఘుచిత్రాలలో కన్పిస్తాయి. విజయనగర సామ్రాజ్య కాలంలో రూపలేఖనం అత్యున్నత స్థాయినందుకుంది. ఈ కాలంలో జేగురు, నలుపు, తెలుపు రంగులను ఎక్కువగా వాడారు.

విజయనగర సామ్రాజ్యం అస్తమయంతో తర్వాత వచ్చిన నాయకరాజుల కాలంలో తంజావూరులో కొంత చిత్రకళ అభివృద్ధి చెందింది. విజయనగర కాలం నాటి వర్ణ చిత్రాలు లేపాక్షి, సోమపాలెం, కోరుకొళ్ళ, తాడిపత్రి, కదిరి, హంపీ విఠలాలయాల్లో కన్పిస్తాయి. అయితే ఈ ప్రదేశాలలోని చిత్రాలు సమగ్ర పరిశీలన అంతగా జరుగలేదు. దేవాలయ వాస్తు, శిల్పకళ మీదనే చరిత్రకారుల దృష్టి మళ్ళింది కానీ, చిత్రకళలో అంత పరిశోధన జరగకపోవడం అత్యంత శోచనీయమైన విషయం.

విజయనగరం పతనం తర్వాత దేశంలో అశాంతి ప్రబలింది. తాత్కాలికంగా కళాభివృద్ధికి అవరోధం ఏర్పడింది. తంజావూరు నాయకరాజుల కాలంలో తెలుగుదేశం నుంచి అనేకమంది చిత్రకారులు, వాస్తు నిపుణులు తంజావూరు వలస వెళ్ళారు. వీరిలో కొంతమంది కర్నూలు ప్రాంతంలో స్థిర పడ్డారు. మరి కొంతకాలానికి ఉత్తరదేశం నుంచి వెల్లువలా వచ్చిన మహమ్మదీయుల సైన్యాల కింద దక్షిణాపథం తన స్వాతంత్ర్యాన్ని కోల్పోయింది. విజేతల అభిరుచులకు అనుగుణంగా కళాసృష్టి సాగింది. ఇందులో ప్రధానపాత్ర వహించిన దక్షిణాత్య చిత్రకారులు మొఘలు కళా సంప్రదాయాలు మేళవించి, ఒక నూతనమైన వరవడిని సృష్టించారు.

ఈ నూతన సంప్రదాయం 'దక్కనుకలం' పేరుతో ప్రసిద్ధి పొందింది. క్రమంగా హిందూ దేవతలు మొఘలు దుస్తులు ధరించారు. మరికొంత కాలానికి రాజపుత్రశైలి, మొఘల్‌శైలి ఈరెండింటినీ ఆధారం చేసుకొని, మార్పులు చేర్పులతో రూపొందించిన లఘుచిత్రాలే 'బసోలి', 'పహాడీ', 'కాంగ్రా' రీతులు చిత్రకళలో చోటుచేసుకున్నాయి. తదుపరి బ్రిటీషు వారి రాకతో పాశ్చాత్య సభ్యతా సంస్కృతులు కూడా భారతదేశంలోకి దిగుమతి అయ్యాయి. దానితో పాశ్చాత్య చిత్రకళా సంప్రదాయాలు ప్రవేశించాయి. పాశ్చాత్య చిత్రకళకు, భారతీయ ప్రాచ్య చిత్రకళకూ విధానంలోనూ, విషయ వస్తువులోనూ ఎంతో తారతమ్యం వుంది. ఈ విస్మృతి సమయంలో కేరళ దేశస్థుడూ, రాజవంశీకుడైన 'రాజా రవివర్మ' భారతీయ పురాణ విషయాలను వస్తువుగా స్వీకరించి, వెలుగనీడల తారతమ్యంతో పాశ్చాత్య పద్ధతిలో అనేక తైలవర్ణ చిత్రాలు రూపొందించి దేశ - విదేశీయులను సమ్మోహితుల్ని చేసిన సంగతి మనందరకూ తెలుసు. తర్వాత 'ఇ.బి. హేవెల్, ఆనంద కుమారస్వామి, అవనీంద్రనాధ టాగూర్ సోదరులు, నందలాల్ బోస్, అసిత్ కుమార్ హల్దార్, వెంకటప్ప, నాగప్ప, దేవీప్రసాదరాయ్ చౌదరి, ఆస్వాల్డ్

కూర్డ్ ప్రమోదకుమార ఛటర్జీ' వంటి మహామహులు నిద్రాణమై వున్న తెలుగు చిత్రకళా వైభవాన్ని తిరిగి మేల్కొలిపారు.

## నవవంగ చిత్రకళ - సంప్రదాయ చిత్రకారులు

భారతదేశ - చిత్రకళా చరిత్రలో తెలుగుదేశానికి అపూర్వ కీర్తి ప్రతిష్టలను ఆపాదించిన చిత్రకారుల ప్రతిభా-రేఖలను గూర్చి, వారి సంప్రదాయాలను, ప్రాచీన చిత్రలేఖనంలోని ప్రధానమైన వివిధ దశల పరిశీలన అనంతరం, మనకు ముఖ్యంగా గోచరించేది వివిధ దశలలో, వివిధ కాలాలలో మనిషి ఉద్దేశ్యాలు, వాటికి అనుగుణంగా భావ ప్రకటనలు, రీతులలో మార్పులు కనపడుతున్నప్పటికీ మన కంటికి కనిపించేంత వరకు 'కళ' అనేది ఎల్లప్పుడూ ఒకే స్థాయిలో వుండటం గమనించతగ్గ విషయం. అందుకే అగ్రశ్రేణి భారతీయ కళా విమర్శకుడు సూర్యదేవర సంజీవదేవ్ మాటలు ఈ సందర్భంలో గుర్తొస్తాయి.

"రంగులూ రూపాలు - రంగుల రూపాలు,

రూపాలు రంగులు, రంగు రూపంగా ఆకృతి పొందుతుంది

ఇది ప్రకృతిలోనూ జరుగుతుంది. మనిషి రూపకల్పన చేసిన ఆకృతిలోనూ జరుగుతుంది. ఈ మానవ పరికల్పిత రంగుల ఆకృతే 'చిత్రకళ' అని పేర్కొన్నాడు". ఈ చిత్రకళ వివిధ కాలాల్లో, వివిధ రీతుల్లో, ప్రాంతీయ సంప్రదాయాలకు అనుగుణంగా మార్పు చెందుతూ వచ్చింది. ఇది తెలుగు చిత్రకళలో మాత్రమే కాదు, యావత్ భారతీయ చిత్రకళలో కూడా గోచరిస్తుంది. బ్రిటీష్ వారి రాకతో, పాశ్చాత్య సభ్యతా సంస్కృతులు కూడా భారతదేశంలోకి దిగుమతి అయ్యాయి. దానితో పాశ్చాత్య చిత్రకళ కూడా ప్రవేశింపసాగింది. 19వ శతాబ్దం మధ్యకాలంలో భారతీయులకు వారి స్వంత 'కళ'లంటూ వున్నాయన్న సంగతి మర్చిపోయిన కాలం అది.

పాశ్చాత్య చిత్రకారుల నుండి, వారి చిత్రాలనుండి తర్ఫీదు పొందితేనే మనకు, వేరొక గత్యంతరం లేదనే సందిగ్ధావస్థ ఏర్పడిన రోజులవి. విదేశాల నుండి చిత్రకారులు మన దేశానికొచ్చి భారతదేశం నలుమూలలా పర్యటించి, పాశ్చాత్య చిత్ర రచనా రీతులను చిత్రాలలో జొప్పించి, భూస్వాముల్ని, జమీందార్లను ఆకర్షించి, వారి చిత్రాలను రాజభవనాల్లో అలంకరించుకునేట్లు చేశారు. ఈ విధంగా పాశ్చాత్య చిత్రకళ భారతదేశంలోకి ప్రవేశించింది. ఇదే సమయంలో రాజా రవివర్మ, పాశ్చాత్య చిత్రకారుడు 'ధియోడు రాజాన్‌సన్ వద్ద శిక్షణ పొంది, రామాయణ, భారత గాధల నుంచి, పాశ్చాత్య పద్ధతిలో చిత్ర రచన చేశాడు. ఆసేతు హిమాచలం అతని చిత్ర రచనా విధానానికి ముగ్ధులైనారు. పాశ్చాత్య చిత్ర రచనా విధానం రవివర్మతోనే భారతదేశంలో ప్రారంభమయ్యింది. తరువాత అవనీంద్రనాధ ఠాగూర్, చార్లెస్ పామర్ వద్ద, ఇటాలియన్ చిత్రకారుడు 'గిలార్డు' వద్ద పాశ్చాత్య చిత్రలేఖనంలో తర్ఫీదు పొందాడు. అయితే మన కళలల పునరుద్ధరణకు అవనీంద్రనాధ్ ఠాగూర్, హావెలు, జేమ్సు కజిన్సు, లార్డ్ జిట్లండ్, 'ఆనంద కుమారస్వామి' మొదలైనవారు, పాశ్చాత్య చిత్రాలకు అనుకరణ ఎంతమాత్రం తగదని, భారతీయ శైలిలోనే, చిత్రరచన సాగించేందుకు నిర్విరామంగా కృషి చేశారు. తత్ఫలితంగా 19వ శతాబ్దం ఉత్తరార్ధంలో భారతీయుల్లో పాశ్చాత్య సంస్కృతి పట్ల వ్యతిరేకభావం, జాతీయ సంస్కృతి పట్ల అభిమానం ఏర్పడింది. ఇది ప్రధానంగా బెంగాల్‌లో ప్రారంభమయ్యింది. సాహిత్యంలో బంకించంద్రుడు, రవీంద్రుడు, చిత్రకళలో అవనీంద్రుడూ, గగనేంద్రనాధ్ టాగూర్ మొదలైనవారు ఈ నవజాగరణకు నాయకులు. ఈ ఉద్యమం ప్రత్యేకించి చిత్రకళపై ఎంతో ప్రభావాన్ని చూపింది. చిత్రకారులు పాశ్చాత్య చిత్రశైలిని వదలి, భారతీయ చిత్రకళా శైలిని అనుసరించసాగారు. అవనీంద్రనాధ్ టాగూర్ కలకత్తా

చిత్రకళాశాలకు ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. రవీంద్రనాథ్ టాగూర్ కలకత్తా దగ్గర భోల్పూరులో 'శాంతినికేతనాన్ని' స్థాపించారు. 1905లో మోడరన్ స్కూల్‌ను స్థాపించినాడు. శాంతినికేతన్‌లో అనేకమంది యువకులు చిత్రకళలో శిక్షణ పొందారు. వీరిలో చెప్పుకోతగ్గవారు నందలాల్ బోస్, అసిత్‌కుమార్ హాల్దారు, దేవీ ప్రసాదరాయ చౌదరి, వెంకటప్ప, ముకుల్ చంద్ దేవ్, క్షితీంద్ర ముజుందారు, శారదా ఉకిల్, బర్మన్, ప్రమోద కుమార ఛటర్జీ, అబ్దుల్ రహమాన్ చుక్తాయి. ఈ చిత్రకారుల్లో చాలామంది అజంతా, ఎల్లోరా, మొఘల్, రాజస్థాన్, దక్కన్, విజయనగర లేపాక్షి, సిత్తన్నవాసల్, పితల్‌కోరా చిత్రకళా రీతులను ఆదర్శంగా తీసుకుని, నూతన భారతీయ చిత్రకళను సృష్టించడం, ఈ శైలి 'న్యూ బెంగాల్ స్కూల్' అనే పేరుతో ప్రసిద్ధి పొందింది. తత్ఫలితంగా దేశంలోని వివిధ ప్రాంతాలలో చిత్రకళాశాలలు ప్రచారంలోకి వచ్చాయి. 'పులిల్ బీహారుదత్తు' బొంబాయిలోనూ, యస్.ఎన్ గుప్త లాహొరులోనూ, 'అసిత్‌కుమార్ హాల్దారు 'లక్నోలోనూ, 'క్షితిన్ మోహన్ ముజుందారు' కలకత్తాలోనూ, 'దేవీప్రసాదరాయ చౌదరి' మద్రాసు లోనూ, 'వెంకటప్ప' మైసూరులోనూ, 'శారదా ఉకిల్' ఢిల్లీలోనూ, 'ముకుల్‌దే' కలకత్తాలోనూ, 'రవిశంకర్ రావల్' గుజరాత్‌లోనూ, 'ప్రమోదకుమార ఛటర్జీ' రమేంద్రనాధ చక్రవర్తి మచిలీపట్నంలోనూ, ఒకరు తర్వాత ఒకరు ఈ చిత్రకళా రంగంలో విశేష కృషి చేసి, భారతీయ చిత్రకళా వికాసానికి తోడ్పడ్డారు.

## చిత్రకళలో తెలుగువారి స్థానం :

భారతదేశ కళా చరిత్రలో తెలుగుదేశానికి సముచితమైన స్థానముంది. హంపీ విజయనగర చిత్ర, శిల్ప సౌభాగ్యం, అజంతా - ఎల్లోరా కళా విన్యాసాలు, తెలుగువారికి వారసత్వంగా నిలిచాయి. బందరులోని ఆంధ్ర జాతీయ కళాశాల తెలుగు చిత్రకారులకు ఒక నూతన

చైతన్యాన్ని కలుగజేసింది. ఇది కాకుండా, తెలుగు చిత్రకారులు వేర్వేరు ప్రాంతాల కళాశాలలకు పోయి వివిధ చిత్రకళా రీతులను, పోకడలను ఆకళింపు చేసుకొన్నారు. కొంతమంది జాతీయతను పరిమితం చేసుకొని తమ తమ వ్యక్తిగత రీతులతో తమ భావాలను వ్యక్తం చేయగా మరికొంతమంది నూతన ప్రక్రియలతో తమ స్థానాలను నిలుపుకొన్నారు.

ఆధునిక తెలుగు చిత్రకళను ప్రధానంగా మూడు భాగాలుగా విభజించవచ్చు. ఒకటి నవవంగ సంప్రదాయం. రెండు బొంబాయి సంప్రదాయం. మూడు దేవీ ప్రసాదరాయ చౌదరీ సంప్రదాయం. దీన్నే 'మద్రాసు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్' అని కూడా అంటారు.

నవవంగ చిత్రకళా సంప్రదాయానికి చెందిన ప్రముఖ తెలుగు చిత్రకారులలో అడివి బాపిరాజు, గుర్రం మల్లయ్య, కౌతా రామ్మోహన శాస్త్రి, కౌతా ఆనందమోహన శాస్త్రి, తేజోమూర్తుల కేశవరావు, మంత్రవాది వెంకట రత్నం, అంకాల వెంకట సుబ్బారావు, వి.ఆర్. చిత్రా, వేలూరి రామ్మూర్తి వంటి ప్రముఖులున్నారు. వీరంతా నవవంగ సంప్రదాయానికి చెందిన చిత్రకారులు. ప్రమోదకుమార ఛటోపాధ్యాయ, రమేంద్రనాథ్ చక్రవర్తిల వద్ద 1924 లో బందరు జాతీయ కళాశాలలో శిక్షణ పొందారు. వీరంతా జాతీయ-సాంస్కృతిక, పునరుజ్జీవన ఉద్యమం కృషిలో భాగంగా చిత్రకళా రంగంలో విశిష్ట కృషి చేశారు. నీటి రంగులతో ఎక్కువగా పౌరాణిక చిత్రాలను, శిల్ప శాస్త్ర సూత్రాలననుసరించి రచించారు. వీరి చిత్రాలలో రూపపుష్టి కంటె, భావదృష్టి ఎక్కువ. సన్నని శరీరాలు, దీర్ఘమైన నిమీలిత నేత్రాలు, లతల వంటి సుకుమారమైన వేళ్ళూ, వీరి చిత్రాలలో ప్రధానంగా కనిపిస్తాయి. ధ్యానమయ, జ్ఞానమయ మూర్తులను చిత్రించటంలో వీరు సిద్ధహస్తులు. వీరికి ప్రమాణం యశోధరుడు రచించిన షడంగములే.

"రూపభేదాః ప్రమాణాని, భావలావణ్య యోజనం,

సాదృశ్యం, వర్ణికాంగ మితి చిత్రషడంగకం"

ఒక రూపానికి, మరో రూపానికి వున్న భేదం ఆకారంలోని కొలతలూ దూరాలూ, దగ్గరలూ, రూపంలో ఇమిడి వున్న భావ ప్రకటనా సౌందర్య సృష్టి పోలికా, రంగుల మేళవింపులతో ఉత్తమ చిత్రకళా ఖండాలను సృష్టించారు. వీరి చిత్రకళా విశేషాలను తెలుసుకునే ముందు చిత్రకళ నిర్మాణ కౌశలానికి కొన్ని మర్మాలు తెలుసుకోవలసిన అవసరముంది. చిత్రాన్ని సమతలం మీద అది వస్త్రం కావచ్చు, చర్మం కావచ్చు, కొయ్యచెక్క కావచ్చు, గోడ కావచ్చు, ఏదైనా సమతల ప్రదేశం కావచ్చు - రంగులలో రూపాలను చిత్రించడం. దేశ ఆచారాలను బట్టి వివిధ కాలాల విశిష్టతలను బట్టి చిత్రాలు రూపు దిద్దుకుంటాయి. సాధారణంగా ప్రాచ్య దేశాల చిత్రాలలో రేఖల ప్రాధాన్యత వుంటుంది. అదే పాశ్చాత్య దేశాల చిత్రాలలో రంగులకు ప్రాధాన్యత ఎక్కువగా వుంటుంది.

భారతీయ చిత్రకారుడు గుండ్రని రేఖలతో ప్రకృతిలోని సౌందర్యాన్ని కళాముఖంగా వ్యక్తం చేస్తాడు. పాశ్చాత్యులు దీర్ఘరేఖలకు ప్రాధాన్యాన్నిస్తూ చిత్ర రచన సాగిస్తారు. గుండ్రని రేఖల కంటే దీర్ఘ రేఖలలో సరియైన బలము కలదని వారి వాదన. గుండ్రని రేఖలే జీవితానికి, సౌందర్యానికి మూలమని అందుచేత శిలాకృతులు గుండ్రని రేఖలతో నిండి వుంటాయని మన శిల్ప సూత్రాలు చెబుతున్నాయి. భారతీయుని చిత్రకారుడి దృష్టిలో ప్రకృతిలోని అన్ని సరళరేఖలే కాకుండా గుండ్రని రేఖలూ వుంటాయి. అందుచేతనే శిల్పులు, చిత్రకారులు, కవులు, ఇతర కళాకారులు తమ తమ ఉపమానాలలో, గుండ్రని ఆకారాలను అధికంగా తీసుకున్నారు. ఒక్కొక్క అవయవానికి సమాన పోలికలు గల ప్రకృతిలోని వస్తువు, ఆకారాన్ని పోల్చి చిత్రించారు. అంతేకాదు గుణాన్ని బట్టి కూడా వాడుకున్నారు.

ముఖాన్ని 'చంద్రబింబం' వలె గుండ్రంగా వర్ణించారు. కనుబొమ్మలను ధనుస్సువలె, నేత్రాలను 'పద్మాల'వలె, చేపల వలె, లేడి కన్నుల వలె, కంఠాన్ని 'శంఖం'లాగా, వేళ్ళను వికసించిన 'చంపకం' లాగా, యింకా ఎన్నో ఉపమానాలను సృష్టించుకొన్నారు. సృష్టిలో ప్రతి ఆకారము యొక్క రేఖలు వృత్తము, చదరం, త్రికోణం వీటి ఆకారాలపైన గాని, లేదా వీటి భిన్న ఆకారాలపైన గాని ఏర్పడి వున్నాయి. ఈ విషయాలే కాకుండా చిత్ర నిర్మాణానికి కొన్ని విధాలైన మాధ్యమాలున్నాయి. వీటిలో ప్రధానమైనవి జలవర్ణాలు, తైలవర్ణాలు, టెంపరా వర్ణాలు, ప్యాస్టల్ వర్ణాలు, ఇంకా రంగు సిరాలు, రంగు పెన్సిళ్ళూ మొదలైనవి. ఒక్కొక్క మాధ్యమానికి ఒక్కొక్క గుణం కనిపిస్తుంది.

**జలవర్ణ** చిత్రాలకు ఒక ప్రత్యేకత వుంటుంది. ప్రకృతి దృశ్యాలను కన్నుల పండువుగా చిత్రించవచ్చు. జలవర్ణ చిత్రాలలో లాలిత్యమూ, సౌకుమార్యము గోచరిస్తాయి. చిత్రాన్ని త్వరగా ముగించవచ్చు.

**తైలవర్ణ** చిత్రాలు చిత్రించేటపుడు కలిపిన రంగులు ఎండకుండా వుండటంతో పెద్ద చిత్రాలను చిత్రించవచ్చు. ఎన్ని మార్పులైనా సులభంగా చేసుకోవచ్చు. చిత్రరచన ఆలస్యంగా పడుతుంది. తైలవర్ణ చిత్రానికి కమనీయమైన కాంతి, స్పర్శనీయతా, తడి తగిలితే చెరగని గుణాలుంటాయి.

**టెంపరా** చిత్ర విధానం జల వర్ణాలకు సంబంధించినదే కాని, ఇది తైల వర్ణ చిత్రం లాగా చేయాల్సుంటుంది. 'ఎగ్ టెంపరా' అనే వర్ణ విధానంలో కోడి గ్రుడ్డు సొన కలిపి చిత్రిస్తారు. ఈ పద్ధతి కొంత కష్టం. జాగ్రత్తగా ముందు ఆలోచించి ఎక్కడ ఏ రంగుని వాడాలో అక్కడ వాడాలి. దీనిలో తప్పులు చేసి, తిరిగి సరిదిద్దడం అంత సులభం కాదు. టెంపరా చిత్రాలు ఉష్ణదేశాల వాతావరణాలకు చెడకుండా చాలాకాలం నిలిచివుంటాయి.

యిక **ప్యాస్టల్** వర్ణాలు పొడి రంగులు. ఈ చిత్రాలు ఉన్ని వలె కన్పిస్తాయి. వీటిని మిగతా రంగుల వలె ఒక రంగుతో ఒకటి కలపటానికి వీలుపడదు. ఇవి చూడ్డానికి అందంగా వుంటాయి. కానీ వీటిని జాగ్రత్తగా కాపాడాలి. ఈ విధంగా ఒక్కొక్క మాధ్యం ఒక్కొక్క విశేషాన్ని కలిగి వుంటుంది.


చిత్రాలను మూడు విధాలుగా చిత్రిస్తారు చిత్రకారులు. కొండల్ని, కోనల్ని, చెట్లను, సెలయేళ్ళను, పచ్చిక బయళ్ళను, మేఘాల్ని, సముద్రాల్ని చిత్రించడం 'ప్రకృతి' చిత్రణ అంటారు. వ్యక్తుల రూపాలను వాస్తవంగా చిత్రించడం, 'రూపచిత్రాల' కోవకు చెందుతాయి. ఒక కథనో, సంఘటననో ఒక ఆదర్శవాదంతో చిత్రించడం 'ఆఖ్యాయికా' చిత్రణ వర్గంలోకి వస్తుంది. వాస్తవ వాదం నుండి విడువడి, సహజ రూపాలలో సౌందర్యాన్ని అన్వేషించి, ఆ సహజ రూపాలకు సృజన నివ్వటం, ప్రకృతి రూపాలను వికృత పరచి, సంప్రదాయ పద్ధతుల్ని ఉల్లంఘించి, 'నైరూప్య చిత్రకళ' గా ఆధునిక చిత్రకళ ఆవిర్భవించింది. ఈనాడు మనం 'యాబ్‌స్ట్రాక్' చిత్రకళగా పిలుస్తున్నాం. ఈ విధంగా యింకా ఎన్నో ప్రక్రియలు ఉన్నాయి. ఈ ప్రక్రియ లన్నింటిలోనూ, వివిధ దశల్లో ఆంధ్ర చిత్రకారులు తమ తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు.

## నవవంగ సంప్రదాయం - తెలుగు చిత్రకారులు

### అడివి బాపిరాజు (1895 - 1952) :

నవవంగ సంప్రదాయ రీతిలో అడివి బాపిరాజు ఎన్నో చిత్రాలను చిత్రించారు. భారతీయ చిత్ర రచనా రీతుల్లో 'రేఖ'కు ప్రాధాన్యత ఎక్కువ.

పాశ్చాత్య రీతుల్లో రంగుకు ప్రాధాన్యత హెచ్చుగా వుంటుంది. ప్రకృతిలోని వస్తువులను యధాతధంగా కన్పించే రీతిలో చిత్రించే 'వాస్తవవాద పద్ధతి' పాశ్చాత్యులది అయితే, వాటిని భావాత్మకంగా చిత్రించే 'ఆదర్శవాదం' భారతీయులది. బాపిరాజు తన చిత్రరచనలో మూడు రచనా రీతులను పాటించారు. రేఖలు లేకుండా, కేవలం రంగులతోను, రేఖలు-రంగులూ రెండూ మిశ్రం చేసి, అనేక చిత్రాలను చిత్రించారు. పౌరాణిక, చారిత్రక ఇతివృత్తాలనే కాకుండా సామాన్య జీవుల స్థితిగతుల దృశ్యాలను కూడా అడివి బాపిరాజు చిత్రించారు. జలవర్ణాలు, తైలవర్ణాలు రెండింటినీ రచించారు. బాపిరాజు చిత్రించిన 'శబ్ధ బ్రహ్మ' అనే చిత్రం డెన్మార్కు ప్రదర్శనశాలలో వుంది. 'భాగవత పురుషుడు', 'ఆనంద తాండవం' వంటి చిత్రాలు తిరువాన్‌కూర్



మ్యూజియంలో వున్నాయి. ఈయన చిత్రించిన 'తిక్కన' చిత్రానికి ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు ప్రథమ బహుమతినిచ్చి సత్కరించారు. ఇవి కాకుండా 'మృత్యుంజయుడు, కిరాతార్జునీయం, ధన్వంతరి, సంధ్యానృత్యం, నాగనృత్యం, అమ్మగారిల్లూ-ధర్మలోగిళ్ళూ, గోధూళి, కృష్ణవేణి, శశికళ, శివలాస్యం, ఊహాసుందరి, భారతి, శ్వేతతార, బృందావనగీతం' మొదలైన చిత్రాలు బహుళ ప్రచారం పొందాయి. బాపిరాజు - విశ్వనాధ వారి 'కోకిలమ్మ పెళ్ళికి', కిన్నెరసానికి, నండూరి వారి ఎంకిపాటలకు చిత్రాలు గీశారు. తన స్వీయ గేయ రచనలకు కూడా స్వయంగా చిత్రాలు వేశారు.

బాపిరాజు కవి, గాయకుడు, నవలా రచయిత, కధనికా శిల్పి, ప్రతిభ గల పాత్రికేయుడుగా బహుముఖ ప్రజ్ఞాశాలి అవటం వల్ల అటు భారతీయరీతిలోనూ, ఇటు పాశ్చాత్య రీతుల్లోనూ చిత్రాలు గీసి ఉత్తమ కళాకారుడుగా ప్రశంసలందుకున్నారు.

పశ్చిమ గోదావరి జిల్లా, శిరిపల్లిలో జన్మించిన అడివి బాపిరాజు, భీమవరం, నరసాపురం, విజయవాడలలో విద్యాభ్యాసం చేసి రాజమండ్రి కళాశాలలో చదివారు. ఆ కళాశాల ప్రిన్సిపాల్ 'ఆస్వాల్డు కూల్డ్రే' నుండి చిత్రకళలో అనేక మెళకువలను తెలుసుకున్నారు. మచిలీపట్నంలోని ఆంధ్ర జాతీయ కళాశాలలో, చిత్రాచార్యులు ప్రమోదకుమార ఛటర్జీ శిక్షణలో భారతీయ పాశ్చాత్య చిత్రకళా రీతులను అభ్యసించారు.

1951లో అప్పటి మద్రాసు ప్రభుత్వం కోరికపై సింహళంలోని సిగిరియా కుడ్య చిత్రాల ప్రతికృతులను చిత్రించారు. తెలుగు చిత్రకళా ప్రపంచానికి కృషి చేసిన బాపిరాజు 1952లో మరణించారు.


## గుర్రం మల్లయ్య :

నవవంగ చిత్రకళా సంప్రదాయంలో విశేష ప్రాముఖ్యం సంతరించుకున్న మరో చిత్రకారుడు గుర్రం మల్లయ్య. 1920లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలోని తెలుగు ప్రాంతం నుండి ముగ్గురు యువకులు ఈ కలకత్తా శాంతినికేతన్‌లో ప్రవేశానికి అర్హత పొందారు. వారు అడివి బాపిరాజు, గుర్రం మల్లయ్య, దామెర్ల రామారావు.

గుర్రం మల్లయ్య చాలా వరకు నీటి రంగుల్లో, పౌరాణిక చిత్రాలను రచించారు. ఈతని చిత్రాల్లో రూపు పుష్టి కన్న భావ దృష్టికే అధిక ప్రాధాన్యత నిచ్చాడు. సాధారణంగా శాంతినికేతన్ చిత్రకళాశైలి సుకుమారమైంది. కోమలమైనదని ప్రతీతి. మల్లయ్యగారు గీచిన రేఖలు శాంతినికేతన్‌లో అప్పటి చిత్రకారులలో కెల్లా లలితమైనవని ఇ.బి. హెూల్ వంటి చిత్రకళా విమర్శకుల ప్రశంసలు పొందారు.

గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చిన ప్రతిభావంతులైన చిత్రకారులు తమ విద్యను పదును పెట్టడానికి శాంతినికేతన్‌కు అంత దూరం వెళ్ళలేరని

భావించి వారిని ఉన్నత స్థాయిలో తీర్చిదిద్దాలనే సంకల్పంతో మల్లయ్య మాచర్లలో నాగార్జున చిత్రకళా సమితిని ఏర్పరచారు. గగనేంద్రనాథ్ టాగూర్, రవీంద్రనాథ్ టాగూర్ లాంటి అగ్రశ్రేణి చిత్రకారులను కలకత్తా నుంచి విజిటింగ్ ప్రొఫెసర్స్‌గా రప్పించి, విద్యార్థులకు చిత్రకళా మెళకువలను నేర్పించేవారు. 1946 నుంచి



ప్రధానాచార్యుడుగా శిల్పకళా పీఠాన్ని నడిపి, వందల సంఖ్యలో యువ చిత్ర కారులను తయారు చేశారు. మల్లయ్య చిత్రకారుడే కాదు. రచయిత, సంఘ సేవకుడు, చేనేత ఉద్యమ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు కూడా. గుర్రం మల్లయ్య చిత్రాలలో 'శ్రీకృష్ణార్జునులు, గృహపరిశ్రమ, పల్నాటి బాల చంద్రుడు, నటరాజు, నీలకంఠుడు, రాధాకృష్ణులు, చదువులమ్మ, గంధర్వులు' మొదలైన పౌరాణిక చారిత్రక ఇతివృత్త చిత్రాలు ప్రముఖమైనవి. మల్లయ్య చిత్రించిన బాలుడు - మాంచాల చిత్రాన్ని కళాలోకం మరువదు. పల్నాటి వీరచరిత్రలో రసవత్తరమైన ఘట్టాన్ని రసాత్మకంగా చిత్రించారు. సంస్కృత కావ్యాల్లోని శ్లోకాలకు అనుగుణంగా చిత్రాలు రచించి తెలుగు సంస్కృతికి అద్దం పట్టారు. మల్లయ్యగారి చిత్రాలు దేశం నలుమూలలా జరిగిన అనేక చిత్రకళాప్రదర్శనలో చోటు చేసు కున్నాయి. బెనారస్ థియోసాఫికల్ సొసైటీలోను, మైసూర్ రాజు



మందిరంలోనూ, లండన్ చిత్రకళా ప్రదర్శనలోనూ, గుర్రం మల్లయ్య చిత్రించిన అమూల్యమైన చిత్రకళా ఖండాలు నేటికీ ఉన్నాయి. నాగార్జునకొండ శిల్పాల ప్రతికృతులను, సాగర్ ఆనకట్ట ప్లాను వేసి పండిట్ నెహ్రూకు పంపారు. పల్నాటి సీమ నుండి నాగార్జున కొండ లోని శిల్పాలను లండన్‌కు తరలించకుండా అవిశ్రాంతమైన పోరాటాన్ని నడిపారు.


1975లో జరిగిన ప్రధమ తెలుగు మహాసభలలో గుర్రం మల్లయ్య కళాసేవకు గుర్తింపుగా కాంస్యపతకంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సన్మానించింది. మల్లయ్య జీవితంలో ఎన్నో సన్మానాలు అందుకున్నారు. పల్నాటి సీమ కళాకారుడుగా ఆధునిక చిత్రకళకు నూతన వెలుగులను ప్రసరింపచేసిన గుర్రం మల్లయ్య 1984లో మరణించారు.

**కౌతా సోదరులు :**

నవవంగ సంప్రదాయ చిత్రకళను అభ్యసించిన, కౌతా రామమోహన శాస్త్రి, కౌతా ఆనందమోహన శాస్త్రి సుప్రసిద్ధ కౌతా శ్రీరామశాస్త్రి గారి కుమారులు. శ్రీరామశాస్త్రి గారు లోగడ శారదా పత్రిక స్థాపించి, సంపాదకులుగా పనిచేసి, తెలుగు సారస్వతానికి సేవ చేసినవారు. కౌతా సోదరులు కృష్ణా జిల్లా మచిలీపట్నంలో జన్మించారు. వీరు ప్రారంభదశలో మచిలీపట్నం జాతీయ కళాశాలలో చిత్రకళలో శిక్షణ పొందారు. పిమ్మట మైసూరులో సుప్రసిద్ధ చిత్రకారుడు కె. వెంకటప్ప తో కలిసి పనిచేశారు. నవవంగ చిత్రకళా సంప్రదాయాన్ని అభ్యసించిన ఈ యిద్దరు సోదరులు 'రూపరేఖ' చిత్రాలను మొఘలు-రాజస్థాన్ లఘు చిత్రాల శైలిలో పెన్సిలుతో చిత్రించుటలో సిద్ధహస్తులు. వీరు రచించిన చిత్రాలన్నీ ఆహ్లాదకరంగా వుంటాయి. వ్యక్తులను ఎదుట ఉంచుకొనే చిత్రించేవారు.

కౌతా రామమోహన శాస్త్రి 1931-1935లో లండన్ రాయల్

కాలేజి ఆఫ్ ఆర్ట్సులో ప్రొఫెసరు మాల్కమ్ అసబర్న, సర్ విలియం రోతన్ స్టెయిన్‌ల వద్ద 'డ్రై పాయింట్ ఎచ్చింగ్'లో ప్రత్యేక పద్ధతిని అభ్యసించారు. కావలిలో జవహర్ భారతి ఆర్టు స్కూలులో ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. డ్రైపాయింట్ ఎచ్చింగ్ పద్ధతిలో సర్వేపల్లి రాధాకృష్ణ, సర్దార్ వల్లభాయ్ పటేల్, గాంధీ, నెహ్రూ, రవీంద్రనాథ్ టాగూర్ వంటి ప్రముఖుల చిత్రాలను అత్యంత సహజంగా చిత్రించి, ప్రశంసలు పొందారు. రామమోహన శాస్త్రి ఆంధ్ర విశ్వవిద్యాలయం లోగోను (ముద్రికను) రూపకల్పన చేశారు. ఈయన చిత్రాలలో 'కేశాలంకరణ, నిరీక్షణ టఫాల్గర్ స్క్వేర్, ఆపిల్ సెల్లర్, సరస్వతి, ఓల్డ్ ట్రీ' వంటి చిత్రాలు ప్రశంసలు పొందాయి. ఈయన 1976లో మరణించారు.



రామమోహన శాస్త్రి గారి సోదరుడు కౌతా ఆనందమోహన శాస్త్రి (1908-1940) 32 సంవత్సరాలే జీవించినా, అనేక భావ చిత్రాలు, ప్రకృతి దృశ్య చిత్రాలను నవవంగ సంప్రదాయ పద్ధతిలో రూపొందించి దేశ విదేశాల చిత్రకళా విమర్శకుల మన్ననలను పొందారు. డాక్టర్ జె. హెచ్. కజిన్సు వీరిని ప్రశంసిస్తూ 'హిందూ దినపత్రికలో వ్రాశారు.

"16 సంవత్సరాల వయస్సులో సుందరమైన అతని ఆత్మ మనోహరమైన చిత్రాలలోనికి పరివర్తనం పొందింది. భారతదేశ చిత్రకళ, ఏవిధంగా పునరుజ్జీవనం పొంది వికసించిందో, ప్రపంచంలో ఉన్నత స్థానం పొందిందో, ఆనంద మోహన తన చిత్రాల ద్వారా తెలియజేశారు" అని కజిన్సు ప్రశంసించారు. ఈయన చిత్రాలు మైసూరు, త్రివేంద్రం ప్రదర్శనశాలల్లో వున్నాయి. త్రివేంద్రం ప్రదర్శనశాలలో వున్న చిత్రం

‘ఏకలవ్యుడు’. ఈ చిత్రాన్ని అత్యంత రమణీయంగా చిత్రించాడు. ప్రతిభాగంలోనూ భారతీయత ఉట్టిపడేలా, ప్రకృతి పరిసరాల మాధుర్యాన్ని అత్యంత సుందరంగా మిళితం చేసి, రూపొందించాడీ చిత్రాన్ని. ఆనాడు ఆ చిత్రాన్ని మెచ్చుకొనే పండితులు భారతదేశంలో లేరు అంటే అతిశయోక్తి కాదు. ఇతర దేశస్థులు మన గొప్పతనాన్ని చెప్పేంత వరకు మనవారు మనల్ని గుర్తించరు. అది ఈనాటికీ చెబుతున్న సత్యమే. అందుచేతనే ఆనంద మోహన శాస్త్రి చిత్రాలు యూరపు, అమెరికా ఖండాలలో ప్రశంసలు పొందాయి. అందుకే ‘నేటి కళాభిజ్ఞులు’ అనే శీర్షికతో ఫ్రెంచి దేశపు పత్రికలో ఈ భారతీయ చిత్రకళాకారుని కళా ప్రౌఢి, కళా విశిష్టతలు గురించి వ్రాశారు”.



1930 లోనే లండన్‌లో ప్రదర్శించిన ‘సామ్రాజ్య చిత్రవస్తు’ ప్రదర్శనలో ఈయన రచించిన రెండు చిత్రాలు చోటు చేసుకున్నాయి. అంటే సామాన్యమైన విషయం కాదు. ఈ ప్రదర్శనాలయంలో భారతీయ చిత్రాలలో ఆరు కంటే ఎక్కువ వుంచుటకు అవకాశం లేదు. అయినా ఆనంద మోహన శాస్త్రి గారి రెండు చిత్రాలకు ఆ అవకాశం దొరకడం గొప్ప విశేషమే మరి.

“అతి పిన్న వయసులో ఇంత పెద్ద పేరు గడించిన శాస్త్రిగారి ఆయుర్దాయం యింకా వున్నట్లయితే, ఎంత గొప్పవాడై తనకు, తన కుటుంబానికే కాక, భారతదేశమంతటికీ ఎంతటి కీర్తి ప్రతిష్టలు తెచ్చియుండెనో ఆలోచింతురుగాక. అంతేకాకుండా ఇతని చిత్రాలన్నింటినీ సేకరించి, ప్రధానమైన ఒక స్థలంలో ఇతని పేరు మీద మ్యూజియం ఏర్పాటు

చేసి, భారతీయులు తమ కృతజ్ఞతలను తెలియజేసుకొందురని" డా॥ కజిన్సు పండితుడు అభిప్రాయపడ్డారు.

Less Artistes D ajourd hui అనే పత్రికలో పాస్కల్ లెవీ గారు ఆనందమోహనుని మెచ్చుకుంటూ ఏవిధంగా వ్రాశాడో చూడండి. 25 సంవత్సరాలు వయస్సులో శాస్త్రిగారు Salou Des Artistes Francais అనే చిత్ర వస్తు ప్రదర్శనకు పంపించిన చిత్రాలు అతడి కళాప్రౌఢిని చిత్రకళలో అతని స్వతంత్ర బుద్ధిని తెలియజేశాయి. ఈ కళాకారుడు భారతీయుడు కనుక, ప్రకృతిని చూచి తన కళానైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవడానికి తన దేశంలోనే అవకాశాలు ఎక్కువగా వున్నాయని, ప్రకృతిని చూచి చిత్రకళా విషయాలను అవగాహన చేసుకోవడంలో యితనికి సహజంగా కలిగిన విషయగ్రహణ శక్తి ఆత్మ సౌందర్యం, విజ్ఞానం, సౌందర్య రస గ్రహణ శక్తి ఇతనికి ఎక్కువగా తోడ్పడ్డాయి. ఇతని చిత్రాలు సజీవమైన చిన్న నాటకాలు. రాగోద్దీపితమైన తన దేశంలో దైనందిన జీవితానికి వాస్తవమైన అనువాదాలు ఈయన రచించిన నీడలు, కత్తి పదును పట్టువాడు అనే చిత్రాలు రచించిన విధానం అతి రమణీయమైనది. ఈ రెండు చిత్రాలలో అతని కళా నైపుణ్యం పరిణతి పొందింది. ఇతనిలో ఇంత గొప్ప నైపుణ్యం ఉండుటచేతనే యితని చిత్రాలకు 1930లో లండన్ నగరమందు సామ్రాజ్య చిత్ర వస్తు ప్రదర్శనాలయంలో ప్రవేశం కల్గిందని పాస్కలెవీ గారు వ్రాశారు.

ఆనంద మోహన్ చిత్రాలలో ఒకటి 1925లో లక్నో నగరంలో జరిగిన చిత్ర వస్తు ప్రదర్శనలో 'రాజా మోతీ చందు పతకాన్ని' బహుమానం పొందింది. ఆ సంవత్సరమే "తన్మయత్వం" అనే చిత్రం డైలీ ఎక్స్‌ప్రెస్ అనే పత్రిక సంవత్సరాది సంచికలో ప్రకటితమయ్యింది. ఈయన చిత్రించిన

జీవాత్మ గోపాలుడైన కృష్ణుడు చిత్రాలను 'ఇలస్ట్రేటెడ్ లండన్ న్యూస్ అనే పత్రికలో 1929లో ప్రచురించారు. కౌతా ఆనంద మోహన శాస్త్రి చిత్రించిన మరికొన్ని చిత్రాలు 'ఊయల, గొల్లపిల్ల, సంతనుంచి అజంతా నర్తకి, తిక్కన సోమయాజి, గ్రామవీధి, వరూధినీ ప్రవరాఖ్యులు, సతీ శివుడు' ముఖ్యమైనవి. ఈయన 1940లో మరణించారు.

**వి. ఆర్. చిత్రా :**

వి.ఆర్. చిత్రా, తేజోమూర్తుల కేశవరావు, కొండపల్లి శేషగిరిరావు వంటివారు కలకత్తా విశ్వభారతి శాంతినికేతన్‌లో నందలాల్ బోస్ నేతృత్వంలో ఉన్నత శ్రేణి కళాకారులుగా రూపొందారు. అజంతా, మొఘలు, రాజపుత్ర చిత్రకళారీతులలో వి.ఆర్. చిత్రా అనేక చిత్రాలను రూపొందించారు. ఈయన రవీంద్రుని కవిత్వం, రవీంద్రుని చిత్రకళలోని మెళకువలను బాగా ఆకళింపు చేసుకున్న చిత్రకారుడు. తన చిత్రాలలో అజంతా మొఘలు, రాజపుత్ర చిత్రకళా సాంప్రదాయాలే కాకుండా, వివిధ జానపదులు కళా విన్యాసాలను కూడా చిత్రించారు. ప్రాచ్య దేశాలైన జపాన్, చైనా వారి చిత్ర సంప్రదాయాలను కూడా నేర్చుకున్నారు.

ప్రకృతి దృశ్య చిత్ర రచనలో కూడా వీరికి అద్వితీయమైన ప్రతిభ వుంది. ఈయన సృష్టించిన హిమాలయ దృశ్యాలు, ఆ మహోన్నత శిఖరాల వైభవాన్ని పట్టి ఇస్తాయి. ప్రకృతి దృశ్య చిత్ర రచనలో అసమాన ప్రజ్ఞావంతుడైన నికోలస్‌రోరిక్ వంటి విశ్వకళావేత్త. 'చిత్రా గారు' రూపొందించిన ఆల్బమ్‌కు (చిత్ర చయనిక) పరిచయ వాక్యాలు వ్రాశారు.

కళలు నిత్యజీవితంలో చక్కగా ఉపయోగపడాలన్నది ఈయన ఉద్దేశ్యం, చిత్రా గారు 'శిల్పి' అనే పత్రికను ఆంగ్ల తెలుగు భాషల్లో నడిపారు. కొంతకాలం చందమామ కథల మాసపత్రికకు బొమ్మలు వేశారు. చిత్రా

గారు పరిశ్రమల శాఖ అధికారిగా అప్పటి మద్రాసు ప్రభుత్వ చిత్ర కళాశాలలో విశేషమైన కృషి చేశారు.

**తేజోమూర్తుల కేశవరావు :**

తేజోమూర్తుల కేశవరావు ఉత్తమ కళాకారుడు. శాంతినికేతన్ విద్యార్థి. నందలాల్ బోస్ ఆధ్వర్యంలో చిత్రకళను అభ్యసించారు. 'దారు' చిత్రాలు తయారుచేయడంలో కూడా వీరు ప్రసిద్ధులు. ఈయన తయారు చేసిన పావురాయి అనే దారు (కర్ర) చిత్రం అత్యుత్తమమైనదని పాశ్చాత్యుల ప్రశంసలు పొందింది.


**మంత్రవాది వెంకటరత్నం :**

తెనాలిలో జన్మించిన మంత్రవాది వెంకటరత్నం చిత్రకారుడుగానే కాకుండా స్వాతంత్ర్య సమరయోధుడు గా ప్రసిద్ధి గాంచారు. ఆంధ్ర జాతీయ కళాశాలలో చిత్రకళలో డిప్లమో పొందారు. కొంతకాలం బొంబాయిలో ఉన్న విక్టోరియా జూబ్లీ ఇన్‌స్టిట్యూట్‌లో చిత్రకళ ఉపాధ్యాయుడుగా పనిచేశారు. గుంటూరు 'శారదా నికేతనం'లో మరికొంతకాలం చిత్రకళను బోధించారు. 1924లో 'వెంబ్లీలో' జరిగిన బ్రిటీషు సామ్రాజ్య చిత్రకళా ప్రదర్శనలో ఈయన రూపొందించిన పరమశివుడు అనే చిత్రం 75 పౌండ్లకు అమ్ముడుపోయింది. ఈనాటి రూపాయిలలో ప్రస్తుతం దాని విలువ ఎంత వుందో ఊహించండి. వెంకటరత్నం గారు 1925 లో అజంతా గుహలలో ఖాన్ బహద్దూర్ సయ్యద్ అహ్మదుకు అజంతా కుడ్య చిత్రాల ప్రతికృతులను తయారు చేయడంలో సహాయకుడుగా పనిచేశారు. ఇవి హైదరాబాదులోని రాష్ట్ర పురావస్తు ప్రదర్శనశాలలో వున్నాయి. 1927లో శాంతినికేతన్ వెళ్ళి, భారతీయ చిత్రకళారీతులను అభ్యసించారు. కలకత్తాలో వున్న 'హిందూస్తాన్ స్కూల్ ఆఫ్ ఓరియంటల్ ఆర్ట్స్' లో కొంతకాలం పనిచేశారు.

మరికొంతకాలం తెలుగుభాషా సమితి చిత్రకళ విభాగంలో పనిచేశారు. వెంకటరత్నం రూపొందించిన చిత్రాలలో 'దృశ్యభారతి, గంగావతరణం, నిత్యవినోదిని, మృత్యువు, శివధ్యానం, ఆదిశంకరుడు' మొదలైన చిత్రాలు ప్రసిద్ధి పొందాయి.

శాసనోల్లంఘన ఉద్యమం కాలంలో తెనాలిలోని ఆయన ఇంటిపై పోలీసులు దాడి ఫలితంగా కొన్ని చిత్రాలు నాశనం అయ్యాయి.

**అంకాల వెంకట సుబ్బారావు (1901-1970) :**



న్యూ బెంగాల్ స్కూల్ సంప్రదాయానికి చెందిన మరొక ప్రముఖ చిత్రకారుడు అంకాల వెంకట సుబ్బారావు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందినవారు. ప్రారంభ దశలో పాశ్చాత్య చిత్రకళారీతులను ఆకళింపు చేసుకున్నారు. దామెర్ల రామారావుతో పరిచయం అయ్యాక, భారతీయ సంప్రదాయ శైలిలో చిత్రాలను రూపొందించడం ప్రారంభించారు. మచిలీపట్నం ఆంధ్ర జాతీయ కళాశాలలో ప్రమోద కుమార ఛటర్జీ వద్ద నవవంగ చిత్రకళా సంప్రదాయాలను అధ్యయనం చేశారు.

ఈయన చిత్రించిన పగటికల అనే చిత్రం వార్సాలో, లెనిన్ గ్రాడ్‌లో జరిగిన చిత్రకళా ప్రదర్శనల్లో చోటుచేసుకుంది. ఆ చిత్రాన్ని సోవియట్ రష్యా ప్రభుత్వం సేకరించి, మాస్కోలోని నేషనల్ ఆర్ట్ మ్యూజియంలో భద్రపరిచింది. వెంకట సుబ్బారావు చిత్రాలలో 'తులసీదాసు, తక్షకుడు, శ్రీమహావిష్ణువు, సోలార్ ఫ్యాంటసీ, పోలో ఫ్యాంటసీ, నాగార్జునుడు, విలేజ్ మైయిడ్సు అప్సర, హెర్‌బాత్' మొదలయిన చిత్రాలు ప్రధానమైనవి. ఈయన గీచిన 'నాగార్జునుడు' చిత్రం అమృతసర్ ఆర్ట్ వాల్యూములో

ప్రచురితమయ్యింది. ఈయన చిత్రాలు మైసూరు రాజమహల్లో తిరువనంతపురం శ్రీచిత్రాలయంలో, తిరువానూర్ సంస్థానంలో, బొంబాయి ఆర్ట్సు సొసైటీలో, ఢిల్లీ నేషనల్ మ్యూజియంలోనూ ప్రదర్శనలో ఉన్నాయి. సుబ్బారావు గారు మద్రాసుజెమినీ చిత్ర సంస్థలలో కొంతకాలం ఛీప్ ఆర్ట్ డైరెక్టరుగా పనిచేశారు. భీమవరంలో అంకాల ఆర్ట్సు అకాడమీ స్థాపించి ఎందరికో చిత్రకళలో శిక్షణ ఇచ్చారు.

1953లో భీమవరం పట్టణ పుర ప్రముఖులు ఇతని చిత్రకళా ప్రతిభకు మెచ్చి, కనకాభిషేకం జరిపి, ఏనుగుపై ఊరేగించి సన్మానించారు. సుబ్బారావుగారి చిత్రాలు అనేకం భారతిలో, ఆంధ్రపత్రికలో ప్రచురితమయ్యాయి. ఆంధ్ర చిత్రకళా ప్రపంచానికి అత్యుత్తమ సేవలు చేసి ఆంధ్రదేశంలో ఎందరికో చిత్రకళలో శిక్షణ ఇచ్చి, పలువురి ప్రశంసలు పొందిన ఈయన 1970లో మరణించారు.

## బొంబాయి చిత్రకళ - తెలుగు సంప్రదాయ చిత్రకారులు

బ్రిటీషువారు భారతదేశంలో తమ ప్రభుత్వాన్ని సుస్థిరం చేసుకున్న తర్వాత చిత్రకళలో అభిరుచి, ఆసక్తి గల విద్యార్థుల కోసం బొంబాయిలో జె.జె. స్కూల్ ఆఫ్ ఆర్ట్సు స్థాపించారు. బొంబాయి చిత్రకళా సాంప్రదాయం కొంత పాశ్చాత్య ధోరణిలో, కొంత భారతీయ సంప్రదాయ పద్ధతిలో రూప పుష్టి ప్రధానంగా వుంటుంది. ఈ చిత్రరచన శైలిలో వాస్తవికత ఎక్కువ. చిత్రాలు సరళంగా కన్పించినా, ఆ రూపమాధురి వెనుక ఎంతో గొప్ప సాధన వుంది. భారతీయ లావణ్యం, పాశ్చాత్య వర్ణసామరస్యం, వర్ణ మిశ్రమంతో సమూహ చిత్రాలు భారతీయ జాతీయతను వ్యక్తీకరిస్తాయి.

పాశ్చాత్య చిత్రాలు వర్ణ ప్రధానంగా ఉంటాయి. రేఖలను పూర్తిగా త్యజించి రంగుల వెలుగు నీడల్లో తమ చిత్రాల్ని రచిస్తారు. వీరు వస్తువును గాని, దృశ్యాన్ని గాని, వ్యక్తిని గాని తమ ముందు ఉంచుకొని చిత్రించడంలో ఎక్కువ శ్రద్ధ కనపరుస్తారు.

ఈ రెండు సంప్రదాయాలను మేళవించి అపూరూపమైన వర్ణ చిత్రాలను తెలుగు దేశానికి అందించిన కళాకారుల్లో ముఖ్యులు:


1) దామెర్ల రామారావు
2) వరదా వెంకటరత్నం
3) చామకూర భాష్యకార్లు రావు
4) చామకూర సత్యన్నారాయణ
5) వరాహగిరి వెంకట భగీరధి
6) దామెర్ల సత్యవాణి
7) దిగుమర్తి బుచ్చి కృష్ణమ్మ
8) చావలి నాగేశ్వరరావు
9) రావు దంపతులు (శ్రీమతి కరుణారావు, శ్రీ బి.వి. నరసింహారావు)

వీరంతా దామెర్ల రామారావుకు సమకాలికులే. రామారావు తర్వాత తెలుగు దేశంలో వీరు తమ కళాసృష్టిని సాగించిన వారే. వీరందరి చిత్రాలలో భావ చిత్రాలు, దృశ్య చిత్రాలు,రూప చిత్రాలు ముఖ్యమైనవి. వ్యక్తుల భంగిమలు, ఆకృతుల నిర్మాణం, వర్ణ సంవిధానం, రేఖా సౌష్టవ సొంపులు, అలంకారాలు, భావ ప్రకటనలూ, పరిసర ప్రదేశ దృశ్యాల్ని కేవలం భారతీయ సంప్రదాయ సిద్ధంగా జాతీయతను వ్యక్తీకరిస్తాయి. వీరంతా సాంప్రదాయిక చిత్రాల కూర్పులో ఒక ప్రత్యేకతను సంతరించుకున్నారు.

**దామెర్ల రామారావు :**

బొంబాయి చిత్రకళా సంప్రదాయానికి చెందిన వీరందరిలో దామెర్ల రామారావు ఆధునిక తెలుగు చిత్రకళలో యుగకర్తగా లబ్ధ ప్రతిష్టుడవడానికి

పలు కారణాలున్నాయి. తెలుగు దేశంలో ఆధునిక చిత్రకళకు ఆయన ఆద్యుడు. ఆస్వాల్డ్ కూల్డ్రే ప్రభావంతో రామారావు సంప్రదాయక ఇతివృత్తాలను పాశ్చాత్య వర్ణ శైలిల్లో చిత్రించడం, 1921లోనే ప్రారంభించారు. తెలుగుదేశంలో చిత్రకళా పునరుజ్జీవనానికి దోహదం చేసి ఆయన తెలుగు చిత్రకారులందరికీ మార్గదర్శకుడయ్యారు.



రామారావు 14 సంవత్సరాల వయస్సులో రాజమండ్రి కళాశాల ప్రిన్సిపాల్ ఆస్వాల్డ్ కూల్డ్రే పరిచయం కలిగింది. 19 సంవత్సరాల వయస్సులో బొంబాయి జె.జె. స్కూలు ఆఫ్ ఆర్ట్సులో ప్రవేశించారు. అక్కడ బెర్నెస్, సాల్మాన్, మొదలైన ప్రసిద్ధ చిత్రకారులతో పరిచయం అయ్యింది. బొంబాయిలో రెండేళ్ళ శిక్షణ పొంది, అజంతా,ఎల్లోరా,ఎలిఫెంటా,కార్లీ మొదలయిన ప్రదేశాలల్లో హిందూ బౌద్ధ శిల్పాలను పరిశీలించారు. ఢిల్లీ ఆగ్రాలను సందర్శించి అక్కడ మొఘులు, రాజపుత్ర చిత్రకళారీతులను, పరిశీలించి, వాటిలోంచి తనకునచ్చిన అంశాలను గ్రహించారు. అంతే కాకుండా గ్రీకు శిల్పంలోని నిర్మలత్వాన్ని, భారతీయ శిల్పంలోని సుకుమారత్వాన్ని ఆకళింపు చేసుకొని, వీటన్నింటిని మేళవించి ఒక నూతన చిత్ర రచనా విధానాన్ని రామారావు నిర్మించుకొన్నారు.

ఆయన చిత్రాలు మొఘులాయి, రాజపుత్ర చిత్ర కళలోని స్ఫూర్తి, పాశ్చాత్య చిత్రరచనలలోని శైలి,మహాకవుల కావ్యాల్లోని మనోజ్ఞమైన కల్పనా చాతుర్యాన్ని మిశ్రమం చేసి, ఒక వాస్తవికతను విపులీకరిస్తాయి. మన మహాకావ్యాలు, పురాణేతి హాసాల్లో వర్ణించబడిన దైవిక, ప్రణయ సంబంధమైన ఇతివృత్తాలను చిత్రించడంలో రామారావుగారిది అగ్రస్థానం. లలిత సౌందర్యంతో అలరారే స్త్రీల చిత్రాలు చిత్రించడంలో ఆయన మేటి.

1922లో రాజమండ్రిలో ఆంధ్ర భారతీయ చిత్రకళా పరిషత్తును స్థాపించి, వివిధ మాధ్యమాల్లో దాదాపు 165 చిత్రాలు, 250 స్కెచ్‌లు, చిత్రించి దేశ విదేశాలలో అనేక బహుమతులందుకున్నారు.


రామారావు చిత్రాల్లో ఎక్కువగా పల్లెదృశ్యాలు, పల్లెపడుచుల భంగిమలు దర్శనమిస్తాయి. బావి నుంచి నీరు తోడుచున్న స్త్రీలు, కార్తీక పూర్ణిమ, పుష్పాలంకరణ, శ్రీరామవనవాసం,సిద్ధార్థ రాగోదయం, మొదలైనవి ఈకోవకు చెందిన చిత్రాలు. ప్రబంధ నాయికల సౌకుమార్యాన్ని, సౌందర్యాన్ని సహజత్వాన్ని, అద్వితీయంగా చిత్రించారు. కొన్ని నగ్న చిత్రాలను కూడా వేశారు.

రామారావు దృశ్య చిత్ర రచనలో పరిసర ప్రదేశాలు, సూర్యోదయం, అస్తమయాలు,పర్వతాలు, రాళ్ళూ రప్పలు, గడ్డిపోచలు, పువ్వులు రమణీయంగా చిత్రించారు. చిత్రాలలో ఎత్తు పల్లాలు, వెలుగు నీడలు, వెన్నెలలు, స్పష్టపరచడంలో ఆయన పాశ్చాత్య శైలి పాటించారు. ప్రకృతి సంబంధమైన చిత్రాల్లో 'పడమటి కనుమల సౌందర్యం', అజంతా గుహల పరిసరాలు, గోదావరి మండలంలోని సమతల పంట ప్రదేశాలు, పాపికొండల దృశ్యాలు, గోదావరీ నది తీర దృశ్యాలను రమ్యంగా సృష్టించారు. ఇవి కాకుండా, న్యూబెంగాలు స్కూలు చిత్ర పద్ధతుల్ని, పాశ్చాత్యశైలిలో భావసౌష్టవ రూప పరిణత పొందిన చిత్రాలను కూడా చిత్రించారు. చిన్న పెద్ద చిత్రాలు భేదం లేకుండా రమణీయమైన కల్పనలతో చిత్ర రచనలు చేశారు.

మోడల్ డ్రాయింగ్ వేయడంలో ఆయన ఒక నూతన పంథాను తొక్కారు. బజారులలో ఎవరైనా స్త్రీగాని, పురుషుడు గాని తనను ఆకర్షించే భంగిమలో చూస్తే చాలు వెంటనే 'స్కెచ్' గీసుకునేవారు. ఆకృతుల్ని చిత్రాల్లో

ఇమిడ్చిరంగులమయం చేసి, ప్రకృతి సౌందర్యానికి విభేదం రాకుండా కావలసిన కళాపుష్టిని చిత్రానికి చేకూర్చేవారు. రామారావు తైలవర్ణ చిత్రాలను వేయడాన్ని కొంత ఆలస్యంగా ప్రారంభించినా అందులో కూడా విజయం సాధించారు.

బొంబాయి జె.జె. స్కూలు విడిచిన తర్వాత గుజరాత్‌లో భావనగరులో 6 నెలలున్నారు. కథియవాడ్ ప్రాంతాన్ని తరచుగా సందర్శించారు. కథియవాడ్ అంటే రామారావుకు అభిమానం. అది భారతదేశం 'ఏథెన్సు' అనేవారు. అక్కడ ఎన్నో దృశ్యాలను చిత్రించారు. 'గొల్ల పడుచులు', 'బావిచెంత' మొదలైనవి. గొల్లపడుచుల చిత్రం కలకత్తాలో ప్రత్యేక గౌరవం పొందింది. దేశంలో, బయటా రామారావుగారి చిత్రాలకు ఎన్నో పురస్కారాలు లభించాయి. 1920లో బొంబాయిలో జరిగిన చిత్రకళా ప్రదర్శనలో పాల్గొని అనేక బహుమతులు పొందారు. 1921 కలకత్తా



చిత్ర ప్రదర్శనలో ఋష్యశృంగ బంధనం చిత్రానికి గవర్నరు జనరల్ బహుమతి పొందారు. గోదావరి లోయ చిత్రాన్ని అప్పటి వైస్రాయ్ లార్డ్ రీడింగ్ కొన్నారు. ప్రస్తుతం ఇవి లండన్ మ్యూజియంలో వున్నాయి. సిద్ధార్థ రాగోదయ చిత్రం ఇంగ్లాండులోని వెంబ్లీ నగర కళాకారుల ప్రశంసలు పొంది, కెనడాలోని టొరంటో నగర ప్రదర్శనశాలలో కూడా పాల్గొని అంతర్జాతీయ పురస్కారాన్ని పొందింది. రామారావు మిగతా చిత్రాల్లో పుష్పాలంకరణ,అజంతా విహారం, శివపార్వతులు, కార్తీక పూర్ణిమ, నందిపూజ, పట్టిసీమ, కృష్ణలీల ప్రసిద్ధమైనవి.

ప్రస్తుతం రాజమండ్రిలో దామెర్ల రామారావు మెమోరియల్ ఆర్టు గ్యాలరీ అండ్ స్కూలులో 200 వర్ణ చిత్రాలు, స్కెచ్‌లు లాంగ్‌షీట్ డ్రాయింగులు జీవం కోల్పోతున్నాయి. వీటిని సమర్ధవంతంగా పరిరక్షించే ఏర్పాటు చేసి, దామెర్ల చిత్ర సంప్రదాయాన్ని మనం కాపాడుకోవలసిన అవసరం ఎంతైనా వుంది. దామెర్ల రామారావు భార్య సత్యవాణి 1938లో రాజమండ్రి ప్రభుత్వ స్త్రీల పాఠశాలలో చిత్రకారిణిగా కూడా పనిచేశారు. సత్యవాణి కూడా రామారావు ఒరవడిలోనే అనేక చిత్రాలు రచించారు. ఈమె చిత్రాలు అనేక పత్రికల్లో ప్రకటించబడ్డాయి. 1897 మార్చి నెల 8వ తేదీన జన్మించిన దామెర్ల రామారావు తల్లిదండ్రులు లక్ష్మీదేవమ్మ, వెంకటరమణ. భార్య దామెర్ల సత్యవాణి. ఈమె కూడా ఈయన సాంప్రదాయ చిత్రకళనే అభ్యసించారు. దామెర్ల రామారావుకి మశూచి వ్యాధి సోకి 28 ఏళ్ళ అతి చిన్న వయసులోనే 1925 ఫిబ్రవరి 6వ తేదీన మరణించారు.

## వరదా వెంకటరత్నం :

దామెర్ల రామారావు తర్వాత బొంబాయి చిత్రకళా సంప్రదాయంలో పేరు ప్రఖ్యాతులు గాంచిన రెండవ చిత్రకారుడు వరదా వెంకటరత్నం.



తెలుగు చిత్రకళను తెలుగుదేశం నలుమూలలా ప్రాచుర్యం కలిగించి ప్రచారం గావించి, వందలాది శిష్యులను తీర్చిదిద్దిన మహెూన్నత చిత్రకళా పోషకుడు కీర్తిశేషులు వరదా వెంకటరత్నం. విశాఖ జిల్లా అలమండ గ్రామంలో 1895 అక్టోబరు 10న జన్మించారు. వీరి తల్లిదండ్రులు వరదా సూర్యనారాయణ, అమ్మడు. చిన్నతనంలోనే వీరి తల్లి మరణించింది. పెదనాన్న తమ్మయ్యగారే వీరిని పెంచి పెద్దచేశారు. తమ్మయ్యగారు అలమండ నుండి కుటుంబ సమేతంగా రాజమండ్రిలో స్థిరపడ్డారు.

వీరేశలింగం స్కూలులో వెంకటరత్నం మెట్రిక్యులేషన్ వరకూ చదివారు. 1914లో అప్పటి రాజమండ్రి మున్సిపల్ ఛైర్మన్ జయరామస్వామి, ఆస్వాల్డ్ కూర్డ్రే గారి ప్రోత్సాహం వలన మునిసిపల్ గరల్స్ స్కూల్లో డ్రాయింగ్ మాస్టర్‌గా పనిచేశారు. అప్పటినుండి దామెర్ల రామారావుతో పరిచయం ఏర్పడింది. మరికొంత కాలానికి ఎ.యస్.రామన్ గారితో పరిచయం అయ్యింది. శ్రీసత్యహెూలు గున్నేశ్వర రావు నాటక కంపెనీకి వెనుక తెరలు పెయింటింగ్సు వేయడానికి మద్రాసునుండి ఎ.యస్. రామన్ గారు ప్రత్యేకించి వచ్చారు. ఎ.యస్.రామన్ గారు ఇలస్ట్రేటెడ్ వీక్లీకి కొంతకాలం ఎడిటర్‌గా పనిచేసి, ఆ పత్రికకు విశేష ప్రాచుర్యాన్ని కల్గించిన చిత్రకారుడు అన్న సంగతి మనందరకూ తెలుసు.

1923లో దామెర్ల రామారావు స్థాపించిన ఆంధ్రా స్కూలు ఆఫ్ ఆర్ట్సులో వరదా వెంకటరత్నం, చామకూర సత్యన్నారాయణ, దామెర్ల సత్యవాణి, దిగుమర్తి బుచ్చికృష్ణమ్మ, అంకాల వెంకటసుబ్బారావు మొదలైన వారు రామారావు వద్ద చిత్రకళను నేర్చుకున్నారు. తన చిరకాల మిత్రుడు

రామారావు పేరు స్థిరస్థాయిగా ఉంచాలనే దృఢసంకల్పంతో రామారావు ఆర్టుగ్యాలరీ పేరుతో చిత్ర ప్రదర్శనశాలను 1925లో ఏర్పాటు చేసి దానికి ప్రిన్సిపాలుగా కొంతకాలం పనిచేసి వందల మంది శిష్యులను తయారు చేశారు. వెంకటరత్నం చిత్రించిన నటరాజు, కైలాసనాధుడు చిత్రాలు లండనులోని వెంబ్లీలో ప్రదర్శించబడి ప్రశంసలు చూరగొన్నాయి. ఇవికాక 'విరహిణి, గంధర్వులు, విలాసిని, సముద్రుడు, గోదావరి ఘాట్, ద్రాక్షా రామ దేవాలయం, దశరధ, క్షీర భంగం, విశ్వామిత్ర తపోభంగం, గంధర్వ శాప విమోచనం, వసంతం, సైరంధ్రి, నిశాగమనం, దమయంతి, కిరాతుడు, గోపీకృష్ణ, దేవదాసు, అజంతా సుందరి' మొదలైన ఈయన చిత్రాలు బహుళ ప్రజాదరణ పొందాయి. ఇవికాక స్కెచ్‌లు, ప్రకృతి దృశ్యాలు చిత్రాలు కూడా చిత్రించారు. సౌత్‌కెన్సింగ్‌టన్‌లో చిత్రకళాఖండాల ప్రదర్శనకై 1937లో బ్రిటీషు ప్రభుత్వం వారు అనేక దేశాల నుండి ఎన్నుకొన్న పన్నెండు చిత్రాలలో వెంకటరత్నం గారి ఒక చిత్రం ప్రదర్శనకు నోచుకోవడం గొప్ప విశేషం. 1962 వరకు వెంకట రత్నం గారికి కేంద్ర ప్రభుత్వం నెలకి 100 చొప్పున భరణంకూడా ఇచ్చింది. నిస్వార్థ పరాయణుడు, నిరాడంబరుడు, నిగర్వి, నిరంతర దీక్షాపరుడైన చిత్రకళా తపస్వి వరదా వెంకటరత్నం.

**ప్రకృతి శిల్పి భగీరథి :**

ఆధునిక తెలుగు చిత్రకారుల్లో అసమాన ప్రజ్ఞా వంతులున్నారు. కానీ వీరిలో కేవలం ప్రకృతి దృశ్యాలకే పరిమితమై అసమాన ప్రజ్ఞను చూపినవారు వరాహగిరి వెంకట భగీరథిగారు మాత్రమే. ఈయన రాజమండ్రి నుండి కన్యాకుమారి వరకూ పర్యటించి అనేక ప్రకృతి చిత్రాలను ప్రత్యేక పంథాలో రచించారు. కొంతకాలం దామెర్ల రామారావు వద్ద

చిత్రకళ మెళకువలను నేర్చుకున్నారు. కొంత ప్రాథమిక సాధనచేశాక, భగీరథి గారు బొంబాయి జె.జె. స్కూలు ఆఫ్ ఆర్ట్స్ కళాశాలలో కొంతకాలం శిల్పసాధన సాగించి అనారోగ్య కారణం వలన ఇంటికి తిరిగి వచ్చి స్వయంకృషితోనే చిత్రసాధన కొనసాగించారు. భగీరథి 1901లో విశాఖ జిల్లా అనకాపల్లి దగ్గర మామిడిపాలెంలో జన్మించారు. ఆయన జన్మస్థలం కొండలతోను, పెద్ద పెద్ద రాతి బండలతోనూ నిండి వున్న ప్రదేశం. ఆ రాతి బండలనూ,కొండలను చిత్రించటంలో భగీరథి అసమాన ప్రతిభ చూపారు.



1932లో ఒరిస్సాలోని జయపురంలో వుండి, కొన్ని ఉత్తమమైన ప్రకృతి దృశ్య చిత్రాలను చిత్రించారు. వీటిని విజయనగరం మహారాణి సంగ్రహించి భగీరథిగారిని గొప్పగా సన్మానించింది. భగీరథి చిత్రకళను ప్రోత్సహించి గౌరవించింది, అంతా రాజులు, రాణులు, గవర్నర్లూ, గవర్నరు సతీమణులు అయినప్పటికీ భగీరథిగారు మాత్రము ధనవంతులు కాలేకపోయారు.

ఈయన ప్రకృతి చిత్రాలు పాశ్చాత్య శైలిని అనుసరించే వుంటాయి. నీటి రంగుల చిత్రాలంటే భగీరథికి మక్కువ. నీటిరంగులతోనే తన చిత్రాలన్నింటిని చిత్రించారు. 1934లో 'సూర్యోదయం' – 'చంద్రోదయం' రెండు తైలవర్ణ చిత్రాలను మాత్రం రూపొందించారు. వీటిని రాజా రాయన్ గారు హైదరాబాదులో కొన్నారు. భగీరథి 1938లో తిరువాన్‌కూర్ పర్యటన సాగించి, అచట ప్రకృతిని సుందర చిత్రాల్లో లిఖించారు. వాటిని తిరువాన్‌కూర్ రాజవంశీయులు కొన్నారు.

భగీరధి రూపొందించిన కొన్ని ముఖ్య చిత్రాలు మొఘల్ రాజపురం హిల్ సైడ్, ది స్పిరిచ్యువల్, పవర్ హవుస్ ఆఫ్ బెజవాడ, మొఘల్ రాజపురం,గిరిదుర్గం, రాక్ ఫ్యామిలి, పాపికొండలు దృశ్యాలు మొదలైన చిత్రాలు ఆయన ప్రతిభకు మచ్చుతునకలు. పైనపేర్కొన్న చిత్రాలే కాక మరికొన్ని చిత్రాలు సుఖమయ ప్రభావతం, సాంధ్యరాగం, మంచులోయ, కొండలు - గుట్టలూ, ఒక మంచుతెర, అవసానం, మిత్రులు, ఆరామపర్వతం, మాడుగుల మార్గంలో సూదికొండ వద్ద అస్తమయికాంతి చిత్రాలు బహుళ ప్రజాదరణ పొందాయి.

భారతదేశపు కొద్దిమంది ప్రకృతి చిత్రకారుల్లో భగీరధి గారు ఒకరైనందుకు తెలుగుదేశం గర్విస్తుంది. చిత్రాలు తెలుగుదేశపు నైసర్గిక దృశ్యాలను మిగతా ప్రపంచానికి చూపటంలో విజయవంతమయ్యాయి అనటంలో సందేహం లేదు. భగీరధిగారి చిత్రాలు మాధుర్యాలు పలుకుతాయి కానీ, ఆయన జీవితం మాత్రం పేదరికంతోనే గడిచింది.

1950లో భార్య రత్నమాణిక్యం పోషకాహార లోపంతో మరణించింది. ఆ సంఘటనకు ఎంతగానో కుమిలిపోయిన భగీరధి, భార్య పోయిన రెండురోజులకే కన్నుమూశారు.

**చామకూర భాష్యకార్లు రావు :**

బొంబాయి సంప్రదాయ చిత్రకళా రంగానికి చెందిన చామకూర భాష్యకార్లు రావు, చామకూర సత్యన్నారాయణ రావులు తెలుగుదేశానికి సుపరిచితులే. సి.బి. రావు అనే పేరుతో ప్రసిద్ధమైన కళాకారుడు భాష్యకార్లు రావు. ఈయన సోదరుడిని ఎస్.ఎన్ చామకూరని కళాకారులు పిలుస్తారు.

మూర్తి చిత్రణలో చామకూర భాష్యకార్లు రావుగారు ఎంతో కృషి చేశారు. 1921లో బెజవాడలో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ కమిటీ



సమావేశాల్లో గాంధీజీని సందర్శించి, ఆయన చిత్రాన్ని గీచి, గాంధీజీ మన్ననలు పొందారు. భాష్యకార్లు రావు చిత్రించిన బాలగంగాధర్ తిలక్ చిత్రం రాజమండ్రిలో వుంది. ఈయన గీచిన కందుకూరి వీరేశలింగం, చిలకమర్తి చిత్రాలు రాజమండ్రి టౌనుహాలు ప్రదర్శనలో వున్నాయి. లండన్ వెంబ్లీ ఇంటర్‌నేషనల్ ప్రదర్శనలో ఈయన రెండు చిత్రాలు ప్రదర్శించబడ్డాయి. చామకూర భాష్యకార్లు రావు 1971లో మరణించారు.

**చామకూర సత్యన్నారాయణ (1901 - 1978) :**

భాష్యకార్లు రావుగారి సోదరుడు ఎస్.ఎన్. చామకూర్‌గా ప్రసిద్ధి పొందిన చామకూర సత్యన్నారాయణ తొలి దశలో దామెర్ల రామారావు వద్ద చిత్రకళలో శిక్షణ పొందారు. ఈయనది కూడా మూర్తి చిత్రణలో అందె వేసిన చేయి. వీరి చిత్రాల్లో జీవకళ ఉట్టిపడుతుంది. ధ్యాన బుద్ధుడు అన్న చిత్రంతో తన ప్రసిద్ధ చిత్రాలకు శ్రీకారం చుట్టిన చామకూర్ 150 మందికి పైగా ప్రసిద్ధులైన వ్యక్తుల రూప చిత్రాలను వేశారు. వీటిలో గాంధీ, రవీంద్రనాథ్ టాగూర్, పండిట్ నెహ్రూ, రాధాకృష్ణ, రాజగోపాలచారి, సి.డి.దేశ్‌ముఖ్, ఇందిరాగాంధీ, ప్రకాశం పంతులు తదితర ప్రముఖులున్నారు. వీరు గీసిన ఇతర చిత్రాలు 'ఏటికాడ, గౌరీకల్యాణం, నాగపూజ, సముద్ర మథనం' మొదలైనచిత్రాలు ప్రజాదరణ పొందాయి. ఎస్.ఎన్. చామకూర్ 1978లో హైదరాబాద్‌లో మరణించారు.



**రావు దంపతులు :**

బొంబాయి చిత్రకళా సంప్రదాయా న్ననుసరించి రావు దంపతులుగా పేరుగాంచిన శ్రీమతి కరుణారావు, బంగారు వరహాలరావు ప్రాచ్య పద్ధతిలోనూ, వాస్తవ రీతులలోనూ, అనేక చిత్రాలను రచించారు. తరువాత నైరూప్య చిత్రకళ పద్ధతిలో మక్కువ చూపడం జరిగింది. బి.వి. రావుది కాకినాడ. శ్రీమతి కరుణారావుది పాలకొల్లు. వీరిద్దరూ పారిస్‌లో చాలాకాలం ఆధునిక చిత్రకళా సాధన చేస్తూనే వుండిపోయారు. కూతురు రజని లండన్‌లో చదువు సాగించింది.

కరుణారావు 1950లో బొంబాయి చిత్రకళాశాలలో చిత్రకళ అభ్యసించింది. భారతీయ చిత్రణ విధానంలో కొన్ని ఉత్తమ చిత్రాలను చిత్రించి 1956లో పారిస్‌లో మూడు సంవత్సరాల పాటు చిత్రసాధన చేసింది. వీరి చిత్రాలు ఇంగ్లాండు, ఇటలీ, బెల్జియం మొదలైన దేశాల్లో ప్రదర్శించబడ్డాయి.

ఈమె చిత్రాల్లో రూపం కంటే భావ గాంభీర్యానికి ప్రాధాన్యమిచ్చేది. రవీంద్రుని రచనలకు ఆమె వేసిన చిత్రాలు రమ్యంగా, గంభీరంగా వుంటాయి. నల్లని ఈజిల్, శయనం, కుంచెలు, పళ్ళూ-పూలూ, టలాడో దృశ్యం, అచల జీవనం, దక్షిణ కెన్సింగ్టన్ దృశ్యం మొదలయిన ఎన్నో చిత్రాలను ఆమె గీశారు. యూరపులోని చిత్ర ప్రదర్శనాలలో చాలా బహుమతులు పొందింది. తైల వర్ణాల్లోనూ, టెంపెరాలోనూ, రెండింటి మిశ్రమ విధానంలో ఆమె చిత్రించింది.

ఆమె భర్త బి.వి. రావు బొంబాయి చిత్రకళాశాలలో శిక్షణ పొంది విశేష కృషి చేశారు. పాశ్చాత్య చిత్రణ పద్ధతిలోనూ, కాంగ్రా లఘుచిత్రాల పద్ధతిలోనూ చిత్రించారు. క్రమేణా ఆయన ఆధునిక చిత్రణలోకి మొగ్గి

పారిస్‌లో స్థిరపడి పూర్తిగా ఆధునిక చిత్రకారుడైనాడు. తన భార్యతో కలిసి యూరపులో చాలా చోట్ల చిత్రాలు ప్రదర్శింపజేశారు. బి.వి. రావు ఇంగ్లీషు గ్రామసీమ, గ్రామ దృశ్యం, ఫ్లారెన్సు దృశ్యం, వర్ణలయ, నార్వే వాని మూర్తి చిత్రణ, ఇలా ఎన్నో చిత్రాలను వేశారు. ఆ చిత్రాలలో ఆకుపచ్చలూ, పసుపుపచ్చలూ, నీలాలు, ధూమ్ర వర్ణాలు నిరంతరం ఒక రాగ మాధుర్యాన్ని పలికిస్తూ వుంటాయని ప్రఖ్యాత చిత్రకారుడు సంజీవ్‌దేవ్ పేర్కొన్నారు.

రావు దంపతులు ఈ విధంగా ఆధునిక చిత్రకళలో కొత్త కాంతులను ప్రసరిస్తూ చిత్రకళకు విశేష ప్రాచుర్యాన్ని కలిగిస్తున్నారు.

## మద్రాసు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ - తెలుగు చిత్రకారులు

ఆధునిక తెలుగు చిత్రకళలో మూడవది దేవీ ప్రసాదరాయ్ చౌదరి సంప్రదాయం అనదగిన 'మద్రాస్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్' తెలుగు చిత్రకళ కొక పూర్ణత్వాన్ని అందజేసింది. భారతీయ సంప్రదాయ చిత్రకళారీతిలోని సూక్ష్మత్వాన్ని, లాలిత్యాన్ని, భావుకతను, పాశ్చాత్య చిత్రకళారీతులలోని స్థూలత్వాన్ని గాంభీర్యాన్ని, రూపపుష్టిని సమన్వయపరచి, దేవీ ప్రసాదరాయ్ చౌదరి చిత్ర రీతులను,ఆకళింపు చేసుకున్న అసంఖ్యాక తెలుగు యువ చిత్రకారులంతా ఈ సంప్రదాయానికే చెందినవారు. మద్రాసులో రాయ్‌చౌదరి వద్ద శిక్షణ పొందిన వీరంతా రంగులకు, రేఖలకు అధిక ప్రాధాన్యానిచ్చి చిత్రాలను రూపొందించడంలో విశ్వవిఖ్యాతి గాంచారు. ఈ సంప్రదాయ చిత్ర రచనలో సిద్ధహస్తులైనవారు :

1 దేవీ ప్రసాద నారాయణరావు

2 హెచ్.వి. రాంగోపాల్

3. సి.యన్.వెంకట్రావ్

4. మొక్కపాటి కృష్ణమూర్తి
5. అంట్యాకుల పైడిరాజు
6. మాధవపెద్ది గోఖలే
7. కోడూరి రామ్మూర్తి
8. పిలకా లక్ష్మీనరసింహమూర్తి
9. ఎస్.వి. రామారావు
10. ఎస్. కృష్ణారెడ్డి
11. సి.యస్.ఎన్. పట్నాయక్
12. కె.శ్రీనివాసులు
13. బదరీనారాయణ
14. రెడ్డపనాయుడు

... మొదలైనవారు.

వీరంతా అసమాన ప్రతిభాశాలులుగా గుర్తింపు పొంది, చిత్రకళా వ్యాసంగాన్ని వివిధ దశల్లో కొనసాగించారు.

“కళాకారుడు తన మనస్సులోని భావాలను బాహ్య ప్రకృతి నుండి లేదా అంతర్జగత్తు నుండి అందుకుంటాడు. ఈరెండిటి సమ్మేళనమే కళ. కళ అంటే కొంత కల్పనా-వాస్తవాల సమ్మేళనం. ఇందులో కల్పనాభాగం ఎంతుండాలి, వాస్తవభాగం ఎంతుండాలి. అన్నది కళాకారుని అభిరుచిమీద ఆధారపడి వుంటుంది. కొందరు వాస్తవంపై ఆధారపడతారు. మరికొందరు కల్పనపై ఆధారపడతారు. ఇంకొంతమంది దీనిని సమభాగంలో వ్యక్తపరుస్తారు. ప్రకృతి మనకు అనేక దృశ్యాలను, రూపాలను ప్రసాదిస్తుంది. కనుక కళాకారుడు ప్రకృతిని ఎన్నడూ విసర్జించడు. కళ అన్నది కేవలం రసానందాన్ని అందించుటయేకాదు, సమాజానికి నైతిక సందేశాన్ని కూడా ఇవ్వాలి. అటువంటిదే ఉత్తమకళగా పరిగణింపబడుతుంది”. తెలుగులో

కళాతత్వ శాస్త్రం మీద సూక్ష్మ వివేచనచేసిన డా॥ సంజీవ్‌దేవ్ పై మాటలు మన ఆధునిక తెలుగు చిత్రకారులకు వర్తిస్తాయి అనటంలో ఎట్టి సందేహం లేదు.

ఈ సంప్రదాయంలో సిద్ధహస్తులైన చిత్రకారుల రచనా విశేషాలను తెలుసుకుందాం.

**దేవీ ప్రసాద నారాయణరావు :**

ఆధునిక తెలుగు చిత్రకళలో ఉత్తమ సంప్రదాయాల్ని సృష్టించిన ఘనత, మాధవపెద్ది దేవీ ప్రసాద నారాయణరావుకు దక్కుతుంది. దేవీ ప్రసాద ని, దేవీ అని పిలిచేవారు. ఇతడు బెంగాలీనా? అన్న సందేహం కులుగతుంది. నారాయణరావు బెంగాలీ, తమిళం, హిందీ చక్కగా మాట్లాడేవారు. అందువలన వీరు ఎవరా? అని అనుమానం వచ్చేది. నిజానికి ఈయన పదహారు అణాల తెలుగువాడు. వీరింటిపేరు 'అనప్పిండివారు'. 1924లో నారాయణరావు, మేనమామ మద్రాస్ స్కూల్ ఆఫ్ ఆర్ట్సులో ఇతని పేరును మాధవపెద్దివారని నమోదు చేయించారు. ఆనాటి నుండి వీరికి మాధవపెద్ది దేవీ ప్రసాద నారాయణరావని వాడుకలోకి వచ్చింది. నారాయణరావు చిత్రకళ, శిల్పం, భరతనాట్యంలో సమాన ప్రజ్ఞాపాటవాలను చూపిన మహెూన్నతమైన కళాకారుడు. వీరి జన్మస్థానం రాజమండ్రి. తాతగారు పాలకొండ సంస్థానంలో దివాన్‌గా పనిచేశారు. నారాయణరావు విద్యాభ్యాసం అంతా విశాఖపట్నంలో జరిగింది. 1924లో మద్రాసు ప్రభుత్వ లలిత కళాశాలలో చిత్రకళ,శిల్పం, నాట్యాలలో సుమారు ఏడు సంవత్సరాలపాటు శిక్షణ పొందారు. చిత్రకళ, శిల్పంలో వీరికి రాయ్‌చౌదరి శిక్షణ ఇచ్చారు. 1934లో చిత్రకళ, శిల్పంలో ప్రధమశ్రేణిలో డిప్లమో సాధించారు. ఆ సంవత్సరమే. ఈయన చిత్రించిన ఒక వర్ణ చిత్రానికి బంగారుపతకం లభించింది.

భారతీయ చిత్రకళ భావ ప్రధానమైనది. పురాణ గ్రంథాల్లో అంతర్లీనమైన శృంగార రసాలను, ప్రధాన వస్తువుగా తీసుకొని, మనోహరమైన చిత్రాలను చిత్రించిన ఈయన. శ్రీకృష్ణ చరిత్ర, బుద్ధ చరిత్రను ఆధారం చేసుకొని చిత్రాలు రచించారు. నారాయణరావు రూపొందించిన చిత్రాలలో 1) అశోకుని బౌద్ధమత ప్రచారం 2) మహాప్రజాపతి గౌతమబుద్ధుడు 3) వసంత లీల చిత్రాలు 1934లో కలకత్తా అకాడమీ చిత్రకళా ప్రదర్శనలో బహుమతులు పొందాయి. ఇవి కాకుండా, పాశ్చాత్య పద్ధతులలో అనేకమైన ప్రకృతి చిత్రాలు కూడా బహుమతులు గెలుచుకున్నాయి.

" 'శిల్పం' పాశ్చాత్య పద్ధతులలో తప్ప, భారతీయ పద్ధతులలో రూపొందించిన వారుఅరుదుగా కనిపిస్తారు. కాని, నారాయణరావు 'అజంతా, అమరావతి కాలాల నాటి శిల్పకళలో భారతీయ సంప్రదాయాన్ని జొప్పించి, పౌరాణిక భావాలతో చిత్తరువులను సృష్టించడంలో ప్రప్రథముడవు నీవే" అని అనేకమార్లు కళాశాల ప్రిన్సిపాల్ రాయచౌదరి చేత ప్రశంసలు అందుకున్నారు. ఇట్టి చిత్తరువుల్లో ముఖ్యంగా పేర్కొనతగినవి. 1) ప్రలోభము 2) రాసలీల 3) రాగ-రాగిణులు. ఈ చిత్తరువులన్నీ ఉత్తమ కళావిశేషాలతో, ఉన్నత భావాలతో విశేషప్రజాదరణ పొందాయి. భారతీయ కళా సంప్రదాయాలను అనుసరించి, స్త్రీ పురుష మూర్తుల చిత్రణలో అతిభంగ, సమభంగ, విధానాలతో, అత్యంత భావపూరితంగా చిత్రించారు. ఇవికాక, శ్రీరామపట్టాభిషేకము, రాసలీల,చిత్తరువులను అమెరికా దేశస్థుడైన జేమ్సు 'రాగ-రాగిణులు' లోహ ప్రతిమ, ఇటలీ విగ్రహ నిర్మాణశాలకు పంపబడింది. వీరి చిత్తరువులు 'యమునా తీరం' రాసలీల, విజయనగరం, మహారాణీ, నాభామహారాజా వారి చిత్ర ప్రదర్శనశాలలో చోటుచేసుకున్నాయి.

భారతదేశంలో శిల్పం రచనలో ప్రఖ్యాతి చెందినవారు దేవీ ప్రసాదరాయ్ చౌదరి, నాగప్ప, మాత్రే, కర్మార్కర్ ముఖ్యులు. మన నారాయణరావుగారు ఆ కోవకు చేర్చతగినవారే. నారాయణరావు రూపొందించిన శిల్పాలు 1) రవీంద్రనాథ్ టాగూర్ 2) కాశీనాథుని నాగేశ్వరరావు 3) అనిబిసెంటు 4) పాల్ఘాట్ దివాన్ కె. కృష్ణన్‌గారి విగ్రహాలను వారి వారి సహజ గుణాలు ఉట్టిపడేటట్లు ఆకర్షణీయంగా రూపొందించారు. దేవీ ప్రసాద నారాయణరావు నృత్యకళలో కార్వేటినగరు సంస్థాన నాట్యాచార్యులైన వెంకటరాయలు వద్ద శిక్షణ పొందారు. వీరి నృత్యం 'శివతాండవం' బహుళ ప్రజాదరణ పొందింది. అనన్య సామాన్య ప్రతిభా సంపత్తులను సంపాదించుకున్న మాధవపెద్ది దేవీప్రసాద నారాయణరావు చిరస్మరణీయుడు. ఆంధ్రజాతి గర్వించదగ్గ కళాకారుడు.

## హెచ్.వి. రాంగోపాల్ :

మద్రాస్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌కు చెందిన ఇంకొక ప్రముఖ చిత్రకారుడు హెచ్.వి. రామగోపాల్. తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురంలో జన్మించాడు. 1943లో మద్రాసు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ డిప్లొమా ప్రథమశ్రేణిలో సంపాదించాడు. దేవీ ప్రసాదరాయ్ చౌదరి వద్ద చిత్రలేఖనంతో పాటు శిల్పం 3 సంవత్సరాలు అభ్యసించాడు. ఖాసా సుబ్బారావుగారి ఆంగ్ల స్వతంత్ర పత్రికలో కొంతకాలం స్టాఫ్ ఆర్టిస్టుగా పనిచేసి, తరువాత 1948లో మద్రాస్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేశారు. హెచ్.వి. రాంగోపాల్ రూపొందించిన చిత్రాలు పలు జాతీయ - అంతర్జాతీయ ప్రదర్శనల్లో చోటు చేసుకున్నాయి. రంగుల విషయంలో ఆయన చూపిన అభినివేశము, సహజ జ్ఞానం, సూక్ష్మమైన గ్రహణశక్తి పలువురి ప్రశంసలు

పొందాయి. ఈయన వాస్తవిక వాది. పెన్సిలు, పెన్ను, బ్రెష్, నీటిరంగులు, ప్యాస్టల్, టెంపెరా, తైలవర్ణాల్లో నిష్ణాతుడు. మంచి రూపచిత్రకారుడు కూడా.

వీరి చిత్రాలు 'కోటప్పకొండ', ఆచార్య నాగార్జునుడు, బకింగ్ హామ్ కెనాల్, రిఫ్లెక్షన్సు, 'సన్‌సెట్ ఇన్ ఎ వ్యాలీ' అత్యంత భావయుక్తంగా వుంటాయి. రాంగోపాల్ రూపొందించిన 'మూర్తి చిత్రాలు' – వినోబా భావే, ప్రకాశం పంతులు, మైసూరు వాసుదేవాచారి, అరయకూడి రామానుజం, మద్రాసు ప్రభుత్వ మ్యూజియంలో వున్నాయి. హెూతా రాంగోపాల్ అనేకమైన ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ఈయన 1976లో మద్రాసులో మరణించారు.

## సి.యన్. వెంకట్రావు :

దేవీ ప్రసాదరాయ చౌదరి మద్రాసు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ చిత్రకళా సంప్రదాయానికి చెందిన మరొక ప్రముఖ చిత్రకారుడు సి.యన్. వెంకట్రావు. రాయలసీమ పెనుగొండ ప్రాంతానికి చెందినవారు. ఈయన చిత్రాలలో పెనుగొండ వాతావరణం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. కొన్ని కొండల చిత్రణ పాశ్చాత్యశైలికి చెంది వుంటుంది.

సి.యన్. వెంకట్రావు తండ్రి నారాయణరావు, తల్లి సత్యభామా మాయి. వీరి విద్యాభ్యాసం అనంతపురం, వేలూరు, నెల్లూర్లలో జరిగింది. చిన్నతనం నుండే చిత్రకళ యందు ఆసక్తి కనపర్చేవాడు. తరచుగా ఆంజనేయస్వామి చిత్రాన్ని గీసేవాడు. మద్రాసులో 3 సంవత్సరాల పాటు రాయచౌదరీ వద్ద చిత్రరచనా పద్ధతులను నేర్చుకున్నాడు. తరువాత అనంతపురం పురపాలకోన్నత పాఠశాలలో చిత్రకళా అధ్యాపకుడుగా



పనిచేసి. ఆ తర్వాత అనంతపురం విడిచి, పెనుగొండ బోర్డు ఉన్నత పాఠశాలలో చిత్రకళాపాధ్యాయుడుగా చేరిరి. పెనుగొండ ప్రకృతి చిత్రాలను రమణీయంగా తైలవర్ణాలతో చిత్రించారు. ఈయన రూపొందించిన మొదటి తైలవర్ణ చిత్రం 'ధ్రువనారాయణ'. ఆ తర్వాత హరి-హరులు, లంకిణీ సంహారం, శ్రీరామపట్టాభిషేకం, కురుక్షేత్రం. అతని ప్రతిభకు, భావనాశక్తికి వర్ణ సమ్మేళనానికి, కళాకౌశలానికి మచ్చుతునకలు. తైలవర్ణాలతో పాటు నీటిరంగుల చిత్రాలను కూడా రచించాడు. కలకత్తా, లాహోరు, బొంబాయి నగరాలు సందర్శించి ఆయా సంప్రదాయాలను అభ్యసించాడు. ఇట్లు విభిన్న కళా సంప్రదాయాలను సమన్వయ పరచుకొని మనోహరమైన వర్ణ సమ్మేళనంతో కొత్త పోకడలను, రీతులను తన చిత్రాలలో జొప్పించారు.

వెంకట్రావు చిత్రించిన చిత్రాలు 'రతీమన్మధులు, అర్ధనారీశ్వరుడు, గౌరీశంకరులు, సుగాలిపడుచు-కాపు పడుసు, తత్పరత, శివకుటుంబ నృత్యం, ద్వైతాద్వైత ప్రేమతత్త్వం, జటాయువు మరణం, కళాజననం, గానజననం. ఈతని కొన్ని చిత్రాలు ఇంగ్లండు, జర్మనీ, జపాన్, అమెరికా వెళ్ళాయి. వెంకట్రావు చిత్రించిన గౌతమీ అవతరణం అనేచిత్రం ఆనాటి రాష్ట్రపతి రాజేంద్రప్రసాదుకు బహూకరించబడింది. వెంకట్రావు సుమారు 400 చిత్రాలను వివిధ మాధ్యమాలలో చిత్రించారు. అతని చిత్రాలలో ఒక విశిష్టత వుంది. దానిని చూడగానే అది అతని చిత్రమని చెప్పవచ్చు.

ఔచిత్యం ఎరిగి, రసభావాలకు అనుగుణంగా, వర్ణాలను మేళవించడంలో ఆయనకు ఆయనే సాటి. తెలుగు జాతీయతను చాటిచెప్పే

అనేక చిత్రాలను రచించారు. చిత్రాలలో స్త్రీ పురుష బాహ్య సౌందర్యం అతినాజూకుగా, సన్నంగా చిత్రించారు. ప్రతి చిత్రం ఉన్నత భావాలు కలిగి వుంటుంది. శైవ-వైష్ణవ గాథలు ఈతనికి ముఖ్య కథావస్తువు. వీటితోపాటు గ్రామీణ జీవితానికి సంబంధించిన చాలా చిత్రాలు కూడా వేశారు. వెంకట్రావు ఆరు భాషలలో అనర్గళంగా మాట్లాడగలరు. హాస్యచతురులు. చిత్రకళతో పాటు ఇందిర రామస్వామి అనే రెండు నాటకాలను రచించారు. పెనుగొండలో విజయనగర చిత్రకళాశాలను స్థాపించి, ఎంతోమంది యువ చిత్రకళాకారులను తయారు చేసిన ఈయన 1940లో మరణించారు.

**మొక్కపాటి కృష్ణమూర్తి (1910-1962) :**

భారతీయ చిత్రకళ నవవంగ సంప్రదాయం మొదలు ఆధునిక



నైరూప్య చిత్రకళా విధానం వరకూ అన్ని విధాలైన చిత్రాలను మొక్కపాటి కృష్ణమూర్తి చిత్రించారు. కవితల్నీ-చిత్రాల్నీ సమాన దక్షతతో నిర్మించగలిగిన కొద్దిమంది రసస్రష్టల్లో మొక్కపాటి ఒకరు. తెలుగు-సంస్కృత కావ్యాలతో పాటు ఆంగ్లభాషలో షెల్లీ, కీట్సు, బ్రౌనింగ్ మొదలైన వారి రచనలను ఆకళింపు చేసుకొన్న సాహిత్య మూర్తి కృష్ణమూర్తి. ఏలూరులో 'సాహిత్యమండలి' అనే సాంస్కృతిక సంస్థను స్థాపించి, చిత్రకళతో పాటు రచనా వ్యాసాంగాన్ని చేపట్టారు. మొక్కపాటి ఉత్సాహంగాను, ఉల్లాసంగాను ఉన్నట్లు కనిపించడానికి నిరంతరం ప్రయత్నిస్తూనే వుండేవాడు. కాని ఆయన జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు, నైరాశ్యం అనుభవించాడు. ఇందుకు ప్రధాన కారణం ఆర్థిక లోపం కాకుండా ఇంకా అనేక ఆదర్శ వాస్తవాల అనైక్యాలు కారణమయ్యాయి. అందుకే

మొక్కపాటి చిత్రరచనల్లో మనకుఎన్నో విధాలైన రేఖలు కన్పిస్తాయి. సరళరేఖలు, వక్రరేఖలు, మిశ్రమరేఖలు, స్థూలరేఖలు, సూక్ష్మరేఖలు, అస్ఫుటరేఖలు, అంతులేని రేఖలు. జీవితపు నైరాశ్యపు భావాలతో ఆయన చిత్రాలు రచించారు. నీటి రంగుల వాష్ విధానం, టెంపరా తైలవర్ణాలు, పేస్టల్స్ వివిధ మాధ్యమాలతో చిత్రాలను రూపొందించిన. విషయ వైవిధ్యం ఈయన చిత్రాల ప్రత్యేకత. పౌరాణిక విషయాలు మొదలుసామాన్య పాఠక జనుల వరకూ చిత్రించి. అనేక లినోకట్ చిత్రాలుకూడా వేశారు. ఇవికాక ఎన్నో స్కెచ్‌లు కనువిందైన వస్తువులు, పక్షులు, పశువులను తన పొదుపైన ఇంద్రజాలం వంటి రేఖలతో చిత్రించి. రేఖా జగత్తులో, రంగుల లోకంలో, జీవితపు అంచులను అనుభవాలను మేళవించి చిత్రాలు రూపొందించారు.

పడవవాళ్ల పాట, రోడ్డుమీద నిద్రాజీవులు, రోడ్డు నిర్మాతలు - మొదలైన దైనందిన జీవితానికి సంబంధించిన చిత్రాలను తైలవర్ణంలో చిత్రించారు. తైలవర్ణ చిత్రణకు సహజమైన స్థూలత,స్పర్శనీయతా, బలము, వేగము అన్నింటినీ అత్యంత రమణీయంగా రూపొందించారు. మొక్కపాటి



తన చిత్రాల్లో సాధ్యమైనన్ని తక్కువ రేఖల్లో రమ్యమైన రూపాలను ఆవిష్కరిస్తారు. ఒక వంక పాశ్చాత్య రచనా పద్ధతులను పరిశీలిస్తూ, మరోవంక భారతీయ సంప్రదాయాల్ని పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు చిత్రరచనలు చేస్తూ వుండేవారు.

దేవీప్రసాదరాయ్ చౌదరి శిక్షణలో మద్రాసు స్కూల్ ఆఫ్ ఆర్ట్సులో కృష్ణమూర్తి చిత్రించిన రాసలీల, వరూధినీ, మదర్ వంటి చిత్రాలు విశేష


ప్రశంసలు పొందాయి. 1941లో మద్రాసులో జరిగిన ఆంధ్రమహాసభ సిల్వర్ జూబ్లీ సందర్భంలో ప్రదర్శించిన ఈయన రాసలీల చిత్రానికి స్వర్ణపతకం లభించింది. వీరి చిత్రాలలో 'దారుకావనంలో భిక్షాటన మూర్తి, మడినీళ్ళు, 'గ్రీన్‌లాండ్, ది లెటర్, ద లోన్లీ హట్', తులసి, సంధ్యార్చన,రతీమన్మథ, హిమవంతుడు, గౌరి' మొదలైన చిత్రాలు బహుళ ప్రచారం పొందాయి.

ఈయన చిత్రించిన మడినీళ్ళు చిత్రంలోని స్త్రీలు బావి నుండి నీళ్లు తీసుకొని వచ్చే దృశ్యం మన పల్లెటూర్లలో ఈనాటికీ కన్పిస్తుంది. ఈ చిత్రంలోని స్త్రీల వివిధ భంగిమలు పల్లెటూరు కమనీయ దృశ్యాన్ని జ్ఞప్తికి తెస్తుంది. ఈ చిత్రానికి 1956లోఆంధ్ర చిత్రకళా పరిషత్ వారు నిర్వహించిన ప్రదర్శనలో గవర్నరు బహుమతిని పొందింది. ఇవి కాకుండ గ్రీన్‌లాండ్ దలోన్లీ హట్ అనేచిత్రాల్లో గ్రామీణ ప్రాంతాల పేదవారి బ్రతుకులను అత్యంత స్ఫూర్తితో చిత్రించిన కృష్ణమూర్తిగారు. 'సత్యం, శివం, సుందరం' అనేదే నా జీవిత లక్ష్యం అని పేర్కొన్నారు.

మొక్కపాటి కృష్ణమూర్తి 1910 ఆగష్టు 17, ఏలూరు వద్ద నున్న 'వసంతవాడ' గ్రామంలో జన్మించారు. చిన్నతనంలోనే సంస్కృతంలో శిక్షణ పొందారు. కాకినాడ పి.ఆర్. కాలేజీలో ఇంటర్మీడియట్ వరకు చదివారు. బాల్యం నుంచీ చిత్రలేఖనంలో ఆసక్తి ఉండేది. 1934లో మద్రాసు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ లో చేరి 1937లో శిక్షణ ముగించి, స్వస్థలం ఏలూరులో స్థిరపడ్డారు. ప్రముఖ చిత్రకారిణి శ్రీమతి పిలకా విజయలక్ష్మి వీరి సోదరే.

మొక్కపాటి కృష్ణమూర్తి 1962లో అస్తమించగా వీరి చిత్రాల ప్రదర్శనను ఆంధ్రప్రదేశ్ లలిత కళా అకాడమీ వారు హైదరాబాదులో 1962లో ఏర్పాటు చేశారు.

**అంట్యాకుల పైడిరాజు (1919-1998) :** ఈయన శిల్పి కూడా. లేపాక్షి, అజంతా, ఎల్లోరాలలోని చిత్రాల శైలి ఆయనకు స్ఫూర్తి నిచ్చింది. పైడిరాజు చిత్రాలలో తెలుగు సంస్కృతీ సంప్రదాయాలు, కట్టూ-బొట్టూ, పండుగలు, పబ్బాలు సర్వం కనిపిస్తాయి. వీరి చిత్రాల్లో భావప్రకటనా, రూపపుష్టితో పాటు తెలుగు జాతీయత ఉట్టిపడుతుంది. ప్రకృతి దృశ్యాలు, రూపచిత్రాలు, సౌందర్యంతో తొణికిస లాడుతాయి. తెలుగువారి జీవితాన్ని జానపద శైలిలో జీవం పోసి ప్రతిష్టించి ప్రత్యేకతను చాటుకున్న చిత్రకారుడు కళా ప్రపూర్ణ అంట్యాకుల పైడిరాజు. విశాఖపట్నం జిల్లాకు చెందిన గ్రామీణ స్త్రీల లౌకిక జీవనం, పండుగలు, కట్టూ-బొట్టూ తీరులను తన చిత్రం 'పల్లెపడుచు'లో ఆహ్లాదకరంగా చిత్రించారు. పైడిరాజు వివిధ మాధ్యమాలలో నీటి వర్ణ చిత్రాలు, తైలవర్ణ చిత్రాలు రూపొందించారు. ఈయన చిత్రించిన నీటిరంగుల చిత్రం



'అరటితోట' ఆహ్లాదకరమైన రంగులతో వాస్తవిక రీతిలో మనోజ్ఞంగా ఉంటుంది. సహజమైన అరటి ఆకుల హరిత వర్ణాలు, అరటి పువ్వుల రక్తవర్ణం రెండింటినీ మేళవించి రూపొందించారు. యింకొక చిత్రం పేరంటం. తెలుగు జానపదశైలికి మచ్చుతునక. సామూహిక సంవిధాన రచనతో ఎరుపు పసుపు రంగులు ఎక్కువగా వాడిన పేరంటం చిత్రం విశేష ప్రశంసలు పొందింది. పైడిరాజు రూపొందించిన యింకొక చిత్రం తల్లీ-బిడ్డా. ఇందులో నిద్రిస్తున్న తల్లి పక్కలో చిన్న పాప వున్న ఈ చిత్రంలో రంగుల మేళవింపు అమోఘంగా వుంటుంది.

అంట్యాకుల పైడిరాజు విజయనగరం జిల్లా బొబ్బిలి నగరంలో 1919లో జన్మించారు. చిన్నతనం నుంచి కళాత్మక సృజనలో అభిరుచి

కనపర్చే ఈయన ధార్మిక భావన, సౌందర్యాభిరుచి సంప్రదాయక కుటుంబం నుండి వచ్చినవారు.



1940లో మద్రాసు స్కూల్ ఆఫ్ ఆర్ట్సులో నాలుగు సంవత్సరాల పాటు దేవీప్రసాదరాయ్ చౌదరి శిక్షణలో చిత్రకళలో నైపుణ్యం సంపాదించారు. విద్యాభ్యాస కాలంలోనే ఆయన వేసినచిత్రాలు, వివిధ ప్రదర్శనలలో చోటుచేసుకున్నాయి. విద్యాభ్యాసం పూర్తి అయిన తరువాత, శాంతినికేతన్ కళాక్షేత్రాన్ని సందర్శించారు. 1944లో తెలుగుదేశపు కరువు-కాటక దృశ్యాలను రేఖాచిత్రాలలో చిత్రించారు. ఈయనచిత్రాలలో రేఖా సంవిధానం, వివిధ రంగుల మేళవింపు, మనోజ్ఞంగా వుంటాయి. పైడిరాజు గృహగమనం అనే చిత్రాన్ని లండన్ రాయల్ అకాడమీ వారు భారతీయ చిత్రకళా విభాగంలో ప్రదర్శించారు.

దేవీ ప్రసాదరాయ్ చౌదరి శిష్యరికంలో శాస్త్రీయ రీతిలో చిత్రకళాభ్యాసం చేసిన పైడిరాజు, జాతీయ – అంతర్జాతీయ కీర్తి శిఖరాలను అధిరోహించారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం చిత్రకళా విభాగం ఆచార్యులుగా వ్యవహరించి శిల్పం, చిత్రలేఖనంలోనే కాక, సాహిత్య సంగీతాలలో ప్రావీణ్యం సంపాదించారు. మలేషియా, రష్యా, యుగోస్లావియా,లండన్, అమెరికా, ఆఫ్ఘనిస్థాన్ వంటి విదేశీ చిత్ర ప్రదర్శనల్లోనూ, హైదరాబాదు రాష్ట్ర పురావస్తు ప్రదర్శనశాల, సాలార్‌జంగ్ మ్యూజియం, న్యూఢిల్లీ,మద్రాసు ఆర్ట్ గ్యాలరీలలోనూ పైడిరాజుచిత్రాలు చోటుచేసుకున్నాయి. ఈయన రాసిన 'అక్షర శిల్పాలు' తెలుగు అకాడమీ

ప్రచురణకు నోచుకుంది. ఈయన చిత్రించిన కొన్ని ప్రముఖ చిత్రాలు 'వడ్లదంపుడు, పల్లెటూరి దృశ్యం, బావివద్దకు, అరటితోట, పేరంటం, తల్లీ-బిడ్డా, అలంకరణ, కష్టజీవి, గృహాగమనం, శ్రమజీవులు, స్నానాంతరం, నవ్యమార్గం చిత్రాలు అంతర్జాతీయ ఖ్యాతినార్జించాయి. స్నానాంతరం, నవ్యమార్గం రెండుచిత్రాలు కాబూల్, కైరోల దేశాల వారు కొన్నారు.

పైడిరాజు శిల్పికూడా. ఈయన రూపొందించిన పంచలోహ రూపచిత్రం విజయనగరం పి.యల్.యన్. రాజుగారిది. అత్యంత సహజంగా ఉంటుంది. 1949నుండి ఈనాటి వరకూ విజయనగరం స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ నడుపుతూ ఇటీవలనే 1998 డిసెంబరు 25న, 80 సంవత్సరాల వయసులో కన్నుమూశారు.

## మాధవపెద్ది గోఖలే (1917-1981) :


మాధవపెద్ది గోఖలే చిత్రకారుడిగానే కాకుండా మాగోఖలే గా సాహిత్యలోకంలో ప్రసిద్ధుడు. స్వాతంత్ర సమర కాలంలో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలుకెళ్ళిన ఉత్తమ దేశభక్తుడు. 1917లో గుంటూరు జిల్లాలోని బ్రాహ్మణ కోడూరులో జన్మించిరి. బందరు జాతీయ కళాశాలలోప్రమోద్ కుమార చటర్జీ వద్ద చిత్రకళకు శ్రీకారం చుట్టారు. 1936లో మద్రాస్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ నుండి చిత్రకళలో డిప్లొమా తీసుకున్న. గోఖలే చిత్రించిన చిత్రాలలో 'యోధుడు, పావురాల జంట, బ్రహ్మనాయుడు, మల్లమదేవి, శ్రమజీవులు, జటాయువు, బహుళ ప్రచారం పొందాయి. ఈయన చిత్రాలలో సహజమైన అనాటమీని కలిగి స్త్రీలు, పురుషులు కూడా బలంగా వుంటారు.

మా గోఖలే గూడవల్లి రామబ్రహ్మంగారి 'రైతుబిడ్డ' చిత్రం

మొదలుకొని షావుకారు, పాతాళభైరవి, శ్రీకృష్ణార్జున యుద్ధం, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఇత్యాది ఎన్నో చలన చిత్రాలకు కళాదర్శకత్వం నిర్వహించారు. ఈ చిత్రాలలో అలంకరణలు, దృశ్యాలు, వేషధారణలు మొదలైన విషయాలలో ఒక నూతన ఒరవడితో సినీ చిత్ర జగత్తులో కళాదర్శకుడిగా మా గోఖలే ప్రసిద్ధి పొంది మా గోఖలే 1981లో అక్టోబరు 4న మద్రాసులో కన్నుమూశారు.



**కోడూరి రామ్మూర్తి 1917-1979 :**



'కోరా' అనే పేరుతో ప్రసిద్ధి పొందిన కోడూరి రామ్మూర్తి మద్రాసు స్కూల్ ఆఫ్ ఆర్ట్సులో రాయ్‌చౌదరీ వద్ద చిత్రకళను అభ్యసించారు. ఈయనకు నీటిరంగులు, తైలవర్ణ చిత్రాలు చిత్రించడంలోనేకాకుండా దారుశిల్ప నిర్మాణంలో కూడా ప్రవేశముంది. ఇవి కాకుండా కలంకారీ చిత్రకళ ఆయన చేతిలో ఎన్నో రీతులుగా రూపుదిద్దుకుంది. కుడ్యచిత్రాల ప్రతికృతులను రూపొందించడంలో చేయి తిరిగిన చిత్రకారుడీయన. అడివి బాపిరాజుతో కలిసి శ్రీలంకలోని సిగిరియ కుడ్యచిత్రాల నకళ్ళు మద్రాసు ప్రభుత్వ మ్యూజియం కొరకు చిత్రించారు. మద్రాసులో కోరా స్కూల్ ఆఫ్ కలంకార్ అండ్ తంజావూరు టెక్నిక్ అనే సంస్థను స్థాపించి, ఆయా కళారీతులలో అనేకమంది చిత్రకారులకు శిక్షణ ఇచ్చారు.




1950-59 మధ్య సంవత్సరాలలో తెలుగు భాషా సమితి ఆధ్వర్యంలో తెలుగు విజ్ఞాన సర్వస్వం గ్రంథానికి పనిచేశారు. 'కోరా' చిత్రించిన కళారూపాలు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయి. వీరి చిత్రాలలో ఆషాఢమేఘాలు, సీమంతినీ, సుప్రభాతం, ఉషఃకాలం వంటివి విశేష ఆదరణ లభించింది కోరా సంప్రదాయ సిద్ధమైన కళారూపాలను చిత్రించడానికే ప్రాధాన్యాన్నిచ్చారు. 1979 ఫిబ్రవరి 13న కోడూరి రామ్మూరి మద్రాసులో అస్తంగతులైనారు.

**పిలకా లక్ష్మీనరసింహమూర్తి :**

పిలకా లక్ష్మీ నరసింహమూర్తి మద్రాసు స్కూల్ ఆఫ్ ఆర్ట్సు రాయ్ చౌదరీ చిత్ర సంప్రదాయానికి చెందిన మరొక ప్రముఖ చిత్రకారుడు.

నవవంగ సంప్రదాయం, పాశ్చాత్య సంప్రదాయపు మేలుకలయికతో వివిధ చిత్రాలను రూపొందించారు. కుడ్యచిత్రాలు వేయడంలో, ప్రాచీనాంధ్ర చిత్రాలకు నకళ్లు రూపొందించడంలో వీరి ప్రత్యేకత కనిపిస్తుంది. విజయనగర సామ్రాజ్య కాలం నాటి లేపాక్షి కుడ్య చిత్రాలు, శ్రీలంకలోని



'సిగిరియా' చిత్రాలు, రామేశ్వరం, చిదంబరం,శ్రీరంగం, కాంచీపురం, తిరుపతి, తిరుచానూరు ఇలా దక్షిణ భారతదేశంలోని అనేక ప్రసిద్ధ దేవాలయాల కుడ్య చిత్రాల ప్రతికృతులనువీరు అత్యంత సహజంగా రూపొందించారు. భగవద్గీతను వస్తువుగా తీసుకొని ఎన్నో చిత్రాలు వేశారు. వాల్మీకిరామాయణం ఆధారంగా వీరు వేసిన సుమారు 150 చిత్రాలు, సుందరకాండపై చిత్రించిన 250 లఘుచిత్రాలు విశేష ప్రాచుర్యం పొందాయి. ఇవి కాకుండా సాంఘిక అంశాలపై కూడా హరిజన నివాస స్థలం, 'తెగిన తీగ' వంటి భావయుక్తమైన చిత్రాలు గీశారు. మద్రాసును కేంద్రంగా చేసుకొని ఈనాటికీ చిత్రరచన సాగిస్తున్న ఇతని భార్య శ్రీమతి పిలకా విజయలక్ష్మి కూడా చేయి తిరిగిన చిత్రకారిణి. ప్రముఖ చిత్రకారుడు మొక్కపాటి కృష్ణమూర్తి ఈమె సోదరుడే. ఈమె భర్తతో కలిసి రామాయణం ఆధారంగా ఎన్నో విశిష్ట చిత్రాలను గీశారు. ఈమెచిత్రించిన రాసలీల, వెన్నదొంగ, బాలాజీ వంటి చిత్రాలు బహుళ ప్రచారం పొందాయి. భార్యా భర్తలిద్దరూ మద్రాసు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అని ఆర్ట్సు సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ప్రస్తుతం చిత్రరచన చేస్తున్నారు.

**నవ్య చిత్రకారుడు ఎస్.వి. రామారావు :**

ఈనాడు ప్రపంచం అంతటా 'ఆధునిక చిత్రకళ' అనే పేరుతో

చాలామంది అర్థంకాని నైరూప్య చిత్రకళ వస్తోంది. ఈ చిత్రకళలోకూడా విశేష కృషి చేసిన తెలుగువారున్నారు. ఎస్.వి. రామారావు, బి.వి. నరసింహారావు, కరుణారావు (రావు దంపతులు), ఎన్. కృష్ణారెడ్డి, సి.యస్.యన్. పట్నాయక్, వై.వి. లక్ష్మయ్య, ఎక్కా యాదగిరి రావు, లక్ష్మాగౌడ్ వంటి చిత్రకారులు ప్రముఖులు.



ఆధునిక చిత్రకళ అనేది వాస్తవ వాదానికి కాకుండా కల్పనా వాదానికే చెందుతుంది. చిత్రకారుడు సహజ రూపాన్ని బద్దలుకొట్టి అందులోని ప్రాథమిక రూపాలను మాత్రమే విశ్లేషణ చేస్తాడు. ఈ సంప్రదాయానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు ఎస్.వి. రామారావు. పాశ్చాత్య దేశాల్లో తనదైన ప్రత్యేక శైలిలో విశిష్ట స్థానాన్ని ఏర్పరచుకొని పికాసో, మిజో, బ్రాక్యూ వంటి పాశ్చాత్య చిత్రకారుల సరసన తన చిత్రాలు చేర్చడానికి ఆహ్వానాలు అందుకున్న గొప్ప చిత్రకళాకారుడు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను, తెలుగు నేల జీవన విధానాన్ని మిళితం చేసి, తనదైనఅద్భుత రంగుల ప్రపంచాన్ని సృష్టించుకున్న ఎస్.వి. రామారావు కృష్ణా జిల్లా గుడివాడలో చేనేత కుటుంబంలో పుట్టారు. హైస్కూలు స్థాయి నుంచి చిత్రలేఖనం పట్ల ఆసక్తి పెంచుకున్న ఈయన 1955 నాటికే బి.ఎ., బి.కాం. డిగ్రీలు పూర్తి చేశారు. మద్రాసులో స్కూల్ ఆఫ్ ఆర్ట్సులో చేరి దేవీ ప్రసాదరాయ్ చౌదరీ, కె.సి.ఎస్. ఫణిక్కర్, ధన్‌పాల్, హెచ్.వి. రాంగోపాల్ వంటి చిత్రకారుల వద్ద శిక్షణ పొందారు. 1962లో ప్రతిష్టాత్మకమైన కామన్‌వెల్త్ ఫెలోషిప్ పొందిన తొలి తెలుగు చిత్రకారుడీయన. 1965 నుంచి1969 వరకుచిత్రకళాధ్యాపకుడిగా లండన్ కౌంటీ కౌన్సిల్‌లో పనిచేశారు. 1969లో

బోస్టన్ యూనివర్సిటీలోను, 1970లో కిన్‌కింటామ్ యూనివర్సిటీలోను ఉద్యోగం చేశారు. అగస్తన్ జాన్ చిత్రించిన చిత్రాలతో ప్రేరణ పొందిన ఎస్.వి. రామారావు తర్వాత లితోగ్రాఫ్ ఆధునిక చిత్రకారుడిగా గుర్తింపు పొందారు.

ప్రస్తుతం అమెరికాలో స్థిరపడి తెలుగువారి పరిసరాలను, భావాలను, అనుభూతులను, పాశ్చాత్య శైలిలో అనేక చిత్రాలు చిత్రించారు. తెలుగువారి చిత్రకళా వైభవాన్ని అనన్య సాధ్యంగా ప్రదర్శించి, అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించి పెట్టిన చిత్రకారుడు రామారావు. నీటిరంగులలో, టెంపరా, తైలవర్ణాల పద్ధతిలో చిత్రిస్తూ ఆయన తన నైరూప్య చిత్రణలో తైలవర్ణాలే వాడుతున్నారు. రామారావు చిత్రాలలో క్యూబిజం, ఇంప్రెషనిజం, ఎక్స్‌ప్రెస్ నిజం సర్రియలిజం మొదలైన ఎన్నో ఆధునిక చిత్రరీతులు కనిపిస్తాయి.

రామారావు చిత్రించిన బిలియర్డ్సు, గుడికి, పెళ్ళి ఊరేగింపు, గాయకుడు, అలంకరణ, దంపతులు మొదలైనవి ఆయన కళాప్రతిభకు చిహ్నాలు.

భారతీయ దృశ్యాలను నైరూప్య రూపాలలో విలక్షణంగా చిత్రించటంలో సిద్ధహస్తుడీయన. ఆ పంథాలో చిత్రించిన వసంత ఋతువు, ఉషోదయం రెండు చిత్రాలు అమెరికాలో విశేష ప్రజాదరణ పొందాయి. రామారావు చిత్రకళ ప్రాక్-పశ్చిమాలకు ఒక సేతువు లాంటిదని పాశ్చాత్య కళావేత్తలు అంటున్నారు.

ప్రస్తుతం ఎస్.వి. రామారావు అమెరికాలో స్థిరపడి నవ్య చిత్రకళకు, భారత్ అమెరికా దేశాలకు వారధిగా ఉంటున్నారనుటలో సందేహం లేదు.

**ఎన్. కృష్ణారెడ్డి :**

విదేశాలలో ప్రశంసనీయమైన కృషి చేసి, పురస్కారాలు, గుర్తింపు

పొందిన మరో తెలుగు నవ్య కళాకారుడు ఎన్. కృష్ణారెడ్డి. వీరి నైరూప్య చిత్రాలు ఆయన సాధించుకున్న పేరుకు తగిన స్థాయిలో తెలుగు వారికి పరిచయ భాగ్యం కాలేదు. పారిస్ మహానగరంలో తెలుగు పతాకాన్ని ఎత్తిన చిత్రకారుడు ఈయన. గ్రాఫిక్స్‌లోని నైపుణ్యం, శిల్పాలలోని పనితనం కృష్ణారెడ్డికి విశ్వవిఖ్యాతిని తెచ్చాయి. రెడ్డిగారు



చిత్రించిన చిత్రాలలో రేఖల లావణ్యం రంగులలో రమణీయత, భావనలో సౌందర్యం, శైలిలో నవ్యత గోచరిస్తాయి.

1925లో జన్మించిన కృష్ణారెడ్డి శాంతినికేతన్‌లో శిక్షణ పొందారు. తరువాత లండన్‌లోని స్లేడ్స్ స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో తర్ఫీదు పొందారు. సుప్రసిద్ధ శిల్పి ఒ.జుడ్కిన్‌తో శిల్పంలో మిలాన్‌లో మెరినో-మెరినోతో, ప్రింట్స్ రూపొందించడంలో కలిసి పనిచేశారు. 1965 నుంచి పారిస్‌లోని అటులియర్ అసోసియేట్‌లో డైరెక్టరుగా, లిస్కాన్‌పిన్ విశ్వవిద్యాలయంలో ఆర్ట్స్ విభాగంలో ప్రొఫెసరుగా పనిచేస్తున్నారు. ఎస్.వి. రామారావు, కృష్ణారెడ్డి తర్వాత నైరూప్య చిత్రకళలో రెడ్డపనాయుడు, సూర్యప్రకాష్, లక్ష్మాగౌడ్, వైకుంఠం నిలద్రొక్కుకోగలిగారు.

## సి.యస్.ఎన్. పట్నాయక్ :

చౌదరీ సత్యన్నారాయణ పట్నాయక్ మిత్రులు అతన్ని సి.యస్.ఎన్. పట్నాయక్ అని వ్యవహరిస్తారు. ఈయన శ్రీకాకుళం జిల్లా, ఒరిస్సా రాష్ట్ర సరిహద్దున బాడాం గ్రామంలో 1925లో జన్మించారు.

భారతదేశం వ్యవసాయ ప్రధాన దేశం. వ్యవసాయానికి సంబంధించిన పనులు ఏడాది పొడుగునా వుంటాయి. గ్రామీణ శ్రామిక



జన సంబంధమైన దృశ్యాలే సి. యస్. ఎన్. పట్నాయక్ చిత్రాలకు ఇతివృత్తాలు.

ఈయన చిత్రించిన చిత్రాలు 'చేనుకు నీరు పారించుట', వరిచేల దృశ్యాలు, తాటాకు గూడులు, బలిష్టులైన రైతులు, గ్రామీణ వాతావరణానికి అద్దం పడతాయి. పట్నాయక్ ఎక్కువగా రూప చిత్రాలనే రూపొందించారు. పత్రికా సంపాదకుడైన నార్ల వెంకటేశ్వరరావు చిత్రాన్ని అత్యంత సహజంగా చిత్రించారు.

1950లో మద్రాసు స్కూల్ ఆఫ్ ఆర్ట్సులో 5 సంవత్సరాల పాటు శిక్షణ పొందారు. ఈయన చిత్ర రచనతో పాటు ఆంగ్లభాషా సారస్వతాలను ప్రాచీన ఆధునిక భారతీయ గ్రంథాలను బాగా చదివారు. తమిళనాడు, మధ్యప్రదేశ్, బీహార్, పశ్చిమబెంగాల్, రాజస్థాన్ రాష్ట్రాలలో విరివిగా పర్యటించి. అనేక ప్రాచీన దేవాలయాలను సందర్శించి అక్కడ శిల్ప రీతులను బాగా పరిశీలించారు. పట్నాయక్ ప్రాథమిక దశలో భారతీయ పాశ్చాత్య చిత్రకళా మెళకువలను నేర్చుకున్నారు. దేవీ ప్రసాదరాయ చౌదరి వద్ద శిల్పకళలో శిక్షణ పొందడం వలన తుదకు శిల్పకళ రచన వైపే మక్కువ చూపారు. 1947 నుంచి 1951 వరకు నీటి రంగులనే ప్రధాన మాధ్యమంగా తన చిత్రాలకు ఎన్నుకున్న. ఈయన రచించిన చిత్రాలు తోటమాలి, ఉమన్ విత్ ఎ-బర్డు, నార్ల ముఖ్యమైనవిగా చెప్పవచ్చును.

1960 నుంచి పట్నాయక్ కర్ర, మన్ను, సుద్ద, మెత్తని రాయి, కంచు ముడిపదార్థంగా వినియోగించి చిత్రాలలో అనేక ప్రయోగాలు చేశారు. ఈయన కంచుతో మలచిన సీతాకోకచిలుక, కూర్చున్న మహిళ ప్రసిద్ధి పొందాయి. అజ్ఞాతాకృతి అనే చిత్రాన్ని కర్రతో తయారు చేసి, ప్రశంసలు పొందారు.

తన జీవితంలో 30 సంవత్సరాల చిత్రకళా కృషిని 20 సంవత్సరాల పాటు శిల్పకళా కృషిని సాగించారు. ఈయన తెలుగు నవ్య చిత్రకళా ప్రపంచానికి ఎనలేని కృషి చేస్తున్నారు. ఇకపై కూడా మరికొన్ని ఉత్తమ కళాఖండాలను ఆయన రూపొందిస్తాడని ఆశిద్దాం.

మద్రాసు స్కూల్ ఆఫ్ ఆర్ట్సులో పైన ఉదహరించిన చిత్రకారులే కాకుండా, ఈ చిత్ర కళాసంప్రదాయ రీతిలో కె. శ్రీనివాసులు, బదరీనారాయణ, రెడ్డపనాయుడు, పి.ఆర్. రాజు వంటి తెలుగు చిత్రకళాకారులు, చిత్రకళలో ఎనలేని సేవచేసి, తెలుగుదేశానికి విశేష ఖ్యాతిని ఆర్జించి పెట్టారు.

**కె. శ్రీనివాసులు :**

1923లో జన్మించిన కె. శ్రీనివాసులు మద్రాసులో శిక్షణ పొంది, జాతీయ అంతర్జాతీయ ఖ్యాతి నార్జించిన ఈయన చిత్రాలు వాషింగ్టన్, సిడ్నీ, సోవియట్ రష్యా, చైనా, జపాన్, తూర్పు యూరప్‌లలో ప్రదర్శనకు నోచుకున్నాయి. భారతదేశం అంతటా ఈయన చిత్రాలు బహుళ ప్రజాదరణ పొందాయి.

**బదరీ నారాయణ :**

1929 జులై 27న సికింద్రాబాదులో జన్మించిన బదరీ నారాయణ చిన్నతనం నుండి సంస్కృతాన్ని అభ్యసించారు. ఈయన ప్రముఖంగా భారతీయ పురాణాలనే ఇతివృత్తంగా తీసుకుని చిత్రాలు రూపొందించారు.

ఈయన చిత్రించిన చిత్రాలు 1961లో పారిస్‌లో ప్రదర్శించబడ్డాయి.

**ఎమ్. రెడ్డపనాయుడు :**

ఎమ్. రెడ్డపనాయుడు 1932లో జన్మించారు. మద్రాసు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ లో శిక్షణ పొందిన ఉత్తమ కళాకారుడు. ఈయన చిత్రాలు దక్షిణ-ఉత్తర భారతదేశం అంతటా ప్రదర్శింపబడ్డాయి. భారతదేశంలోనే కాకుండా ఈయన చిత్రాలు లండన్, నైరోబీ, పారిస్ నగరాలలో ప్రదర్శనకు నోచుకున్నాయి. భారతదేశంలో ఈయన నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడరన్ ఆర్ట్ న్యూఢిల్లీ, నేషనల్ ఆర్ట్ గ్యాలరీ మద్రాసు తరపున అనేక ప్రదర్శనల్లో పాల్గొన్నారు.

## హైదరాబాద్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ - తెలుగు చిత్రకారులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిన తరువాత తెలుగుచిత్రకళా సంపద యింకా విస్తృతమైంది. హైదరాబాద్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ నుండి తయారైన కళాకారుల్లో కొండపల్లి శేషగిరిరావు, కాపురాజయ్య, వడ్లమాని మధుసూదనరావు, పి.టి. రెడ్డి, లక్ష్మాగౌడ్, టి. వైకుంఠం, సూర్యప్రకాశ్, చంద్రశేఖర్, గౌరీశంకర్, ఎక్కా యాదగిరిరావు, వడ్డాది పాపయ్య, దొరైస్వామి, ఉస్మాన్ సిద్ధిక్,సయ్యద్ బిన్ మహమ్మదు, జలాలుద్దీన్, గోవిందస్వామి, కుమారిల స్వామి, రెడ్డపనాయుడు, మనోహర్ దత్తు, పి.ఆర్. రాజు,జి.రంగారెడ్డి, శ్రీనివాసరెడ్డి, బాపు, కవుతాదేవూస్కర్, ఎమ్.డి. పీరా, ఆరా, వాణీకుమారి, నజర్ మహ్మదు మొదలైనవారు ప్రముఖులు. వీరందరూ అటు వాస్తవిక శైలిలోనూ, ఇటు ఆధునిక శైలిలోనూ, అందరినీ ఆకట్టుకోగల చిత్రాలను వివిధ మాధ్యమాలలో చిత్రించారు.

ప్రఖ్యాత చిత్రకళాకారుడు కళాతత్త్వ శాస్త్రం మీద సూక్ష్మ వివేచన చేసిన తెలుగు వాళ్ళలో డా॥ సంజీవ్ దేవ్ ముఖ్యులు. ఈ సందర్భంలో కళ మీద ఆయనచేసిన నిర్వచనం ' కళ అన్నది సృజన. దానిలో అంతర్గతమైన

తృష్ణ వుంది. సృజనాత్మక సంకేతాలతో, అభివ్యక్తమౌతుంది. మనిషి జ్ఞాపకాలను, అనుబంధాలతో జీవిస్తాడు. ఆ జ్ఞాపకాలను అనుబంధాలను ఆవిష్కరించేదే కళ. కళ కేవలం రసానందాన్ని అందిస్తే చాలదు. దానికి తోడుగ నైతిక సందేశాన్ని సమాజానికి అందించాలి. అప్పుడే అది ఉత్తమ కళ అవుతుంది. కళలో కొంత కల్పనా వాస్తవాల సమ్మేళనం వుంటుంది. కల్పనా భాగం ఎంతుండాలి, వాస్తవ భాగం ఎంతుండాలి అన్నది కళాకారుడిపై ఆధారపడి వుంటుంది. కొందరు ఎక్కువగా వాస్తవంపై ఆధారపడితే, మరికొందరు కల్పనపై ఆధారపడతారు. ఇంకొందరు సమభావంలో వ్యక్తపరుస్తారు" అని డా॥ సంజీవ్‌దేవ్ వ్యక్తపరచారు.

**కొండపల్లి శేషగిరిరావు : (1932-2012)**


కొండపల్లి శేషగిరిరావు గారు తన కళా సృజనతో, అగాధాలను కొలవడానికి ప్రయత్నిస్తారు. ఈయన స్వభావ సిద్ధంగా వేదాంతి. కనుకనే ఈయన రచించిన చిత్రాలలో ఆధ్యాత్మిక భావాలు కన్పిస్తాయి. బాల్యంలో తాను అనుభవించిన కష్టాలు, సుఖాలను, ఆయన చిత్రాలు వ్యక్తం చేస్తాయి.



ఆయన చిత్రకళ పౌరాణిక, నైతిక,సామాజిక మనస్తత్వ సంజ్ఞాత్మక రూపాలను పొందుతుంది. శేషగిరిరావు వేసిన ప్రతి ఆధునిక చిత్రమూ, ఆయన ఆంతరంగిక సృజనాత్మక శక్తికి తార్కాణంగా నిలుస్తుంది. ఈయన కొన్ని సామాజిక చిత్రాలల్లో భావంతో పాటు సామాజిక చైతన్యం వెల్లివిరుస్తాయి. ఇందుకు ఉదాహరణ ఆయన చిత్రించిన 'హరిజనోద్యమం' కుడ్యతైల వర్ణ చిత్రం అది ఆయన సృజనాత్మక నైపుణ్యానికి కలికితురాయి. శేషగిరిరావు చిత్రించిన 'కోరికలు, చావు, రాచరికం, చివర కౌగిలి' చిత్రాలలో ఆయన మనోభావాలు

ప్రస్ఫుటమవుతాయి. మనిషి ఆశాజీవి. దానిపైనే జీవిస్తాడు. మరణం అనేది చిట్టచివరి సత్యం. జీవితం పెనుగులాట అనే సందేశాన్ని ఈయన 'చివరి కౌగిలి' అనే చిత్రంలో సందేశాన్ని యిస్తాడు.

ఈయన రూపొందించిన అనేక పౌరాణిక చిత్రాలలోని భావాలు రసాత్మకంగా, మన మనస్సుపై చెరగని ముద్రలు వేస్తాయి. దమయంతి తైలవర్ణ చిత్రంలో భారతీయ దూర ప్రాచ్య, పాశ్చాత్య చిత్రరీతులు కన్పిస్తాయి. 'శకుంతల' చిత్రంలో ప్రకృతి సహజ వాతావరణం ఉట్టి పడుతుంది. ఆయన 'వరూధినీ ప్రవరాఖ్య' చిత్రంలో బెంగాలు సంప్రదాయ ముద్రలు కనిపిస్తాయి. రావుగారి రేఖా చిత్రాలు భారతీయ పాశ్చాత్య చైనా, జపాన్ దేశపు శైలులతో కూడిన అద్భుతమైన వర్ణ సమ్మేళనంతో రాణిస్తాయి. రేఖా చిత్రాలేకాక రంగులతో కార్డులపై కుంచెతో వేసిన రేఖా రూపాలు అనేకం వున్నాయి. ఇవి కాకుండా జంతువులు, పక్షులు, చెట్లు, కొండలు వంటి ప్రకృతి చిత్రాలు వారి భావ ప్రకాశానికి అద్దం పడతాయి. రాయగిరిలో రాళ్ళు అనే చిత్రంలో ప్రకృతి సౌందర్యాన్ని లయను, లాలిత్యాన్ని రాబట్టిన తీరు అద్భుతం.



కొండపల్లి శేషగిరిరావు వివిధ మాధ్యమాలలో నీటిరంగులు, తైలవర్ణాలు, టెంపెరా, వాష్ పద్ధతులలో చిత్రిస్తారు. ఈయన చిత్రాలలో వర్ణ తారతమ్యాలు, చీకటి వెలుగులు, వంపు సొంపులు సమగ్రంగా వుంటాయి. అప్పటి

ప్రపంచ తెలుగు మహాసభలకు రూపొందించిన తెలుగుతల్లి చిత్రం బహుప్రశంసలు పొందింది. ఇవి కాకుండా మోహినీ, పాండవుల అజ్ఞాతవాసం, తెలుగు-వెలుగు, దమయంతి, వరూధినీ ప్రవరాఖ్య చిత్రాలు ఈయనకు మంచి పేరు ప్రతిష్టలు తెచ్చిపెట్టాయి. ఈయన శాంతినికేతన్‌లో చదవడం వలన చిత్రాలలో నవవంగ సంప్రదాయ రీతులు ఎక్కువగా కనిపిస్తాయి.

కొండపల్లి శేషగిరిరావు 1942లో వరంగల్ జిల్లా మెహబూబాబాద్ తాలూకా పెనుగొండలో జన్మించారు. ఈయన చిత్రాలు దేశ విదేశాలలో ప్రదర్శితమై వున్నాయి. హైదరాబాదులో వుంటున్న. ఈయన రూపొందించిన చిత్రాలన్నింటినీ సమగ్రంగా పుస్తక రూపంలో ప్రచురించాలనే ప్రయత్నంలో వుంటూ. ఇటీవలనే 88 సంవత్సరాల వయసులో జూలై 26, 2012 న స్వర్గస్థులైనారు.

**కాపు రాజయ్య : (1925-2012)**

అద్భుత కళాఖండాల నిర్మాణానికి  ఉపకరించే మట్టి ఎంత సాధారణమైన వస్తువో, అంత సాధారణమైన వ్యక్తి కాపు రాజయ్య. ఆయన తన ఆంతరంగిక వేదనలనుండి, ప్రతిఘటనల నుండి, ఆంక్షల నుండి వెలువడిన చిత్రకళా మాధ్యమం ద్వారా ఉన్నత భావాలతో తెలుగు జాతీయత ఉట్టిపడే రీతిలో అనేక చిత్రాలు రచించారు.

పల్లెప్రజల దైనందిన జీవితంలో అతి సన్నిహితమైన సంబంధం గల చిత్రకారుడు రాజయ్య. నాలుగున్నర దశాబ్దాలకు పైబడి తెలుగువాళ్ళ సంస్కృతీ సాంప్రదాయాలు, పండుగలు, జాతరలు, చేతి వృత్తుల వారి పాటలూ, వీధి భాగవతాలు, ఎల్లమ్మజోగి, బోనాలు, జాతర గొర్రెల కాపర్లు, కోయ దంపతులు, పంటకోసే పడుచులు, బతకమ్మ, కోలాట దృశ్యాలు,



వసంతకేళీ, కలాపాలు,గోపిక గోపాల సల్లాపాలు మొదలైన ఇతివృత్తాలకు చెరగని రూపమిచ్చిన జాతీయస్థాయి అగ్రశ్రేణి చిత్రకారుడు కాపు రాజయ్య. ఈయన తన చిత్రాలలో గత కాలపు స్మృతులను వర్తమానపు సజీవ యదార్థ ఘట్టాలను అత్యద్భుతంగా చూపిస్తాడు. తెలంగాణా మాగాణి నేలలో పుట్టిన గ్రామీణ సంస్కృతి ముద్ర ఈయన చిత్రాలన్నింటా కనిపిస్తుంది. పాశ్చాత్య పద్ధతులను, సూత్రాలను అనుసరించకుండా కొన్ని విశ్వాసాలను, విలువలను, ఆదర్శాలను తన కళలో ఇముడ్చుకున్న చిత్రకారుడు కాపు రాజయ్య.

ఈయన చిత్రాలలోని రేఖలు దృఢంగా వుంటాయి. వర్ణ సమ్మేళనం స్పష్టంగా వుంటుంది. కల్పనా పద్ధతి అద్భుతంగా వుంటుంది. చిత్రాలన్నీ చైతన్యవంతంగా సమగ్రంగా వుంటాయి. ఆయన నివసించే సిద్ధిపేటలోని కంసాలి పనివారు, కుమ్మరులు, కమ్మరులు, నకాషీ బొమ్మల పనివారు, వారే రాజయ్యకు గురువులు. నకాషీ చిత్రాలు భావస్ఫూర్తిలోనూ, సాంకేతిక ప్రక్రియలలోనూ అచ్చంగా ప్రాచీన సంప్రదాయానికి చెందినవే అయినా, రాజయ్య సమకాలీన అభిరుచులకు అనుగుణంగా మార్చుకొని, జానపద చిత్రకళకు సమగ్ర రూపాన్నిచ్చారు. నకాషీ చిత్రాలలోని విషయం హృదయసరళి, రాజయ్యకు ఎంతగానో నచ్చాయి.

రాజయ్య రూపొందించిన బోనాలు చిత్రం తెలుగు గడ్డ కమ్మని సువాసనలను వెదజల్లుతుంది. అందుకే ఈ చిత్రం అంతర్జాతీయ ఖ్యాతి గడించింది. 1956లో లండన్ స్టూడియో మేగజిన్‌కు రంగుల ముఖచిత్రంగా ప్రచురించింది. ఆ పత్రిక గతంలో ప్రఖ్యాత బెంగాలు చిత్రకారుడు జైమినీరాయ్ చిత్రించిన చిత్రాన్ని నలుపు-తెలుపులో మాత్రమే అట్టపై ముద్రించింది. ఆధునిక భారతీయ చిత్రకళకు విప్లవకర పరివర్తన

తెచ్చినవారు జైమినీరాయ్. ఆయన చిత్రాలన్నీ జానపద నుడికారంలో వుంటాయి. ఇతరులెవరైనా జానపద చిత్రాలు చిత్రిస్తే అవి జైమినీరాయ్‌కి అపభ్రంశపు అనుకరణలు మాత్రమేనని,చిత్ర విమర్శకులు వ్యాఖ్యానిస్తూ వుంటారు. అంతటి ప్రతిభాశాలి జైమినీరాయ్. ఆ జానపద నుడికారానికి ఏమాత్రం తీసిపోకుండా తెలుగు జానపద సంప్రదాయానికి అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చాడు రాజయ్య.


ఈయన 1965 వరకూ వాష్‌టెక్నిక్ అభిమాన మాధ్యమంగా వుండేది. తరువాత టెంపెరా, ఆ తదుపరి నీటిరంగులు, తైలవర్ణాల్లో చిత్రాలు చిత్రించినారు. రాజయ్య చిత్రాలన్నీ సంప్రదాయకమే అయినా, ఉదాత్త భావాలతో నైరూప్య చిత్రకళలోకూడా ప్రయోగాలు చేసినవే. అందుకు ఉదాహరణగా తిరుపతి వేంకటేశ్వర స్వామిని వస్తువుగా గ్రహించి 27 చిత్రాలను ఈ ప్రక్రియలో వేంకటేశ్వరస్వామిని తలమాన కొలతలతో రాజయ్య చిత్రించాడు. అందులోఅవయవ నిష్పత్తి వుండదు. స్వామికి చెందిన లాంఛనాలు శంఖం, చక్రం, శేషశయ్య, దివ్య పాదాలు, తిరుమణి, తిరుచూర్ణపు పంగనామాలు మొదలైన వాటిని వస్తువుగా స్వీకరించి చిత్రాలు చిత్రించారు. ఇందుకు వైష్ణవ ఆగమాలను, విగ్రహ లక్షణాలను సమగ్రంగా పరిశీలించారు. ఈ బాలాజీ శ్రేణి నైరూప్య చిత్రాలలో తొమ్మిది చిత్రాలనుతిరుపతి దేవస్థానం వారు 1974లో కొన్నారు. ఈ చిత్రాలలో కాంతివంతమైన రంగులనే వాడారు రాజయ్య. భూదేవి, శ్రీదేవిలను ఎర్రని మచ్చల సంకేతాలతో చూపించారు.

ఇవి కాకుండా రాజయ్య చిత్రించిన చిత్రాలలో వడ్డెర స్త్రీలు, ఎల్లమ్మ జోగి, కోలాటం, బోనాలు,వీధి భాగవతం,కృష్ణా గోపికా, వసంతకేళి, బహార్ హార్వెస్టు, కుమ్మరులు, క్యూరియాసిటీ, తెలంగాణా పండగ,గొల్లవారు మొదలైన చిత్రాలు దేశంలోని వివిధ చిత్రశాలల్లో ప్రదర్శితమై వున్నాయి.

రాజయ్య మెదక్ జిల్లా సిద్దిపేటలో 1925లో జన్మించారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచినఅజంతా ఎల్లోరా చిత్రాలకు ప్రతికృతులను చిత్రించిన జలాలుద్దీన్ సయ్యద్ అహ్మదులు వంటి చిత్రాకారుల వద్ద శిక్షణ పొందారు. అప్పటి మద్రాసు ప్రభుత్వ ఫైన్‌ఆర్ట్స్ కళాశాల నుండి, హైదరాబాద్ స్కూల్ ఆఫ్ ఆర్ట్సుల నుండి చిత్రకళలో డిప్లొమాలు సాధించి 1953 నుంచి ప్రారంభించిన తనచిత్రరచనా కృషిని నేటికీ కొనసాగిస్తున్నారు. సిద్దిపేటలో లలిత కళా సమితిని నేటికీ నడుపుచున్నారు. జాతీయ అంతర్జాతీయ చిత్రకళా ప్రదర్శనలలో రాజయ్య బంగారు రజిత పతకాలు పొందారు. ఈయన సేవలనుగుర్తిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పలురీతుల సన్మానించింది. కాపు రాజయ్య 87 సంవత్సరాల వయసులో ఆగష్టు 20, 2012లో అస్తంగతులైనారు.

**వడ్లమాని మధుసూదనరావు :**

హైదరాబాద్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ నుండి యింకొక ప్రముఖ కోనసీమ చిత్రకారుడు వడ్లమాని మధుసూదన రావు. డాంబికం ఎరుగని చిత్రకారుడు. జీవితంలో అనేక వడిదుడుకులను అధిగమించిన చిత్రకారుడు. పుట్టుకతోనే దారిద్ర్యాన్ని అనుభవించాడు. ఆయన కళకూ–జీవితానికి మధ్య సారూప్యం వుంది. మధుసూదనరావు నిజాయితీకి నిరంతర పరిశ్రమకు పేరొందిన వారు. ఈయన చిత్రకళను అర్థం చేసుకోవాలి అంటే అతని మానసిక రీతిని అర్థం చేసుకోవాలి.



మధుసూదనరావు తూర్పుగోదావరి జిల్లా, డెల్టా కోనసీమ 'వానపల్లి' గ్రామంలో 1921లో జన్మించారు. 1936 నుండి 1938 వరకు రేఖా

చిత్ర లేఖనాన్ని పట్టుదలతో కృషి చేసి 1945లో హైదరాబాద్ స్కూల్ ఆఫ్ ఆర్ట్సులో ప్రముఖ చిత్రకారుడు సయ్యద్ అహ్మద్ వద్ద చిత్రరచనలో తర్ఫీదు పొందారు. జీవనభృతి కొరకు కొంతకాలం బొంబాయి మహానగరంలో సినీ స్లయిడులు కూడా చిత్రించిన ఈయన 1955లో హైదరాబాదులో కాలేజీ ఆఫ్ ఆర్ట్సులో లెక్చరరుగా పనిచేశారు. కొంతకాలం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లలితకళా అకాడమీలో సభ్యుడుగా నున్నాడు.

ఈయన దేశీయ ఇతివృత్తాలను వస్తువుగా స్వీకరించి తనదైన శైలిలో చిత్రరచన కొనసాగించారు. చిత్రకళలో అన్ని సంప్రదాయాలను అవగాహన చేసుకున్నా ఏ ఒక్క పద్ధతినీ అనుసరించి ఈయన ప్రాకులాడలేదు. సంప్రదాయ శైలిలో చిత్రాలు వేసినా నైరూప్య పద్ధతిలో చిత్రించినా, ఈయన చిత్రాలు సామాన్యులకు కూడా అర్థం అవుతాయి. రావు చిత్రాలలో ముఖ్యంగా భారతీయత ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. రంగులను వివిధ రీతులలో మేళవించడం అంటే ఈయనకు అమితమైన అభిమానం. కాబట్టి తైల వర్ణాలలోనే ఈయనకు అమితమైన అభిమానం. తైలవర్ణాలలోనే ఎక్కువ చిత్రాలు వేశారు. అప్పుడప్పుడూ లేప వర్ణాలతో చిత్రాలు రచించారు. చిత్రాలలో రంగుల స్వభావాన్ని ప్రాముఖ్యాన్ని, అర్థం చేసుకోగల నిశితదృష్టిని ప్రఖ్యాత చిత్రకారుడు కె.కె. హెబ్బారు నుండి గ్రహించానని మధుసూదనరావు అంటారు.


రావుకు మూర్తి చిత్రణలో కూడా పెద్ద పేరుంది. స్వామీ చిన్మయానంద, వినోభాభావే వంటి ప్రముఖుల రూపచిత్రాలు వీరి ప్రతిభకు తార్కాణాలు. ఈయన చిత్రించిన దుగ్గిరాల గోపాలకృష్ణయ్య–రామదండు, మాతంగి, అన్నపూర్ణేశ్వరి, మధుమతి, శ్రీచక్రాలు వంటి చిత్రాలు బహుళ ప్రజాదరణ పొందాయి. మధుసూదనరావు జానపద చిత్రాలు ప్రకృతి దృశ్య చిత్రాలు చిత్రించడంలో ఆసక్తి కనపర్చలేదు. ఈయన చిత్రించిన తిరుపతి

బాలాజీ చిత్రం ప్రశాంతత ఉట్టిపడే ప్రతీకాత్మక చిత్రం. ఈ చిత్రంలో ఉద్విగ్న భావాలను, రూపకల్పనను వివిధ రంగులలో రూపొందించారు. చిత్రంలోని రేఖలు,రంగుల మేళవింపు, కనులకు విందు గొల్పుతుంది. ఇవి కాకుండా ఈయన రూపొందించిన ఇతర చిత్రాలు 'పెన్సివ్ మూడ్, బిక్షగాళ్ళు , కాళీయ మర్దనం, మారుతి, శివశక్తి' మొదలైనవి. ఈయన చిత్రాలు శ్రీచిత్రాలయం, సాలర్‌జంగ్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ మ్యూజియం లలిత కళా అకాడమీ ప్రదర్శన శాలల్లో ఉన్నాయి. మరికొన్ని చిత్రాలు ఢిల్లీ లోక్‌సభ, కైరో , పశ్చిమ జర్మనీలలో కూడా చోటుచేసుకున్నాయి.

క్రమశిక్షణతో, నిరంతరం పరిశ్రమించి కళకే జీవితాన్ని అంకితం చేసిన ఉత్తమ కళాకారుడు మధుసూదనరావు చిరస్మరణీయుడు.

**పి.టి. రెడ్డి :**

ఆధునిక చిత్రకళా ధోరణులు తెలుగుదేశంలో ముఖ్యంగా హైదరాబాద్‌లో వేళ్ళూనుకోవడానికి బాట వేసిన వారిలో ప్రముఖులు శ్రీ పి.టి. రెడ్డి, బొంబాయిలోని సర్ జె.జె. స్కూల్ ఆఫ్ ఆర్ట్సులో తన సమకాలికుడైన ఫ్రాన్సిస్ సుజా తన గురువని ఆయన పేర్కొన్నారు. చిత్ర, శిల్పకళలే జీవిత సర్వస్వంగా స్వీకరించి, వాటికి సజీవ రూపకల్పన చేయడానికి తన సర్వసత్వం ధారపోసి జీవితాంతం శ్రమించిన చిత్రకారునిగా రెడ్డిగారు పేరుపొందారు.



1915లో జన్మించిన పి. తిరుమలరెడ్డి సుమారు ఐదు దశాబ్దాలు వివిధ మాధ్యమాలలో అనేక కళాఖండాలు చిత్రించారు. తాను రూపొందించిన వేలాది చిత్ర శిల్ప, కళాఖండాలను ప్రదర్శించడానికి తనసొంత ఇంటిలోనే సుధర్మ ఆర్ట్ గ్యాలరీని

రూపొందించారు. హైదరాబాద్ నారాయణగూడలో ఉన్న ఈ ఆర్ట్ గ్యాలరీలో తిరగటం ఒక గొప్ప అనుభవం. చిత్ర శిల్ప కళాకారునిగా పి.టి. రెడ్డి వికాసాన్ని ఈ సుధర్మ ఆర్ట్ గ్యాలరీలో విశదంగా దర్శించవచ్చు. వివిధ సంప్రదాయ కళాశైలులను, దేశంలోనూ, విదేశాల్లోనూ, ఆధునిక కళారంగంలో బయలుదేరిన వివిధ ఉద్యమాలను, ధోరణులను, ఆయన అనుశీలనం చేసిన తీరు అబ్బురం కలిగిస్తుంది. ఇంప్రెసనిస్టు, క్యూబిస్టు, తాంత్రిక్, ఒకటేమిటి వివిధ రీతుల్లో పుంఖానుపుంఖంగా విస్తరిల్లిన ఆయన సృజనాత్మక శక్తిని వీక్షించవలసిందే.

ప్రాచీన తాంత్రిక సంప్రదాయానికి తాంత్రిక కళారీతికి, ఆధునిక చిత్రకళా ధోరణిలో విలక్షణమైన వ్యాఖ్యానం చేసిన పి.టి. రెడ్డి. కొన్ని వందల చిత్రాలు వేశారు.

రెడ్డిగారు పండిట్ నెహ్రూ వ్యక్తిత్వంపై అనేక చిత్రాలు రచించారు. శాంతిదూతగా, అభ్యుదయ పథగామిగా, సమస్యలలో కూరుకుపోయిన పాలకుడిగా రూపొందించిన చిత్రాలు మరువరానికి. అలాగే ఇందిరాగాంధీ వ్యక్తిత్వంపై, ఇతర అనేక సమకాలీన సంఘటనలు ఆధారంగా ఈయన వేసిన చిత్రాలు సృజనాత్మకమైనవి. ఇంకా ఈయన రచించిన చిత్రాలలో త్యాగం, చంద్రుడు, చంద్రముఖీ, మోడ్రన్ హార్బర్ అనేచిత్రాలలో ఒక విశిష్టమైన శైలీ రమ్యత గోచరిస్తుంది. ఇవి కాకుండా నగర దృశ్యాలు, వివాహ దృశ్యాలు, వస్తు సముదాయాలు, నిశ్చల చిత్రాలు, పువ్వులు, సీసాలు వంటివి చిత్రించారు. తన చిత్రాలలో చైతన్యవంతమైన జీవితం, వ్యక్తుల భావ ప్రకటన, ప్రకృతిలోని వర్ణ సంవిధానం, స్త్రీల సౌందర్యాన్ని అలంకరణను వారి వన్నె చిన్నెలనుపరిశీలిస్తూ ఎన్నో చిత్రాలు రచించారు.

గ్రామీణ దృశ్యాలు, పల్లెటూరి బడిపంతులు, గుల్‌మెహర్ చెట్టు

వంటి చిత్రాలు మనోహరంగా చిత్రించారు.

పి.టి. రెడ్డి 1915లో కరీంనగర్ జిల్లా అన్నవరం గ్రామంలో జన్మించారు. హైస్కూల్ చదువు హైదరాబాదులో జరిగింది. బొంబాయి జె.జె. స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ నుండి డిప్లొమా పొందారు. 1942-44 కాలంలో బొంబాయిలో ఫిల్మ్ పరిశ్రమ, ప్రింటింగ్ ప్రెస్‌లో కమర్షియల్ చిత్రకారుడుగా కొంతకాలం పనిచేశారు. ఈయన చిత్రాలు ఆస్ట్రేలియా, ఇంగ్లండు, జర్మనీ, జపాన్ దేశాలకు కూడా వెళ్ళాయి. అనేక పురస్కారాలు పొందారు. దేశంలోనూ, విదేశాల్లోనూ తన ప్రతిభ కారణంగా గంభీర నిశ్చల వ్యక్తిత్వం కారణంగా అందరి మన్నన పొందిన గొప్ప కళాకారుడు కీర్తిశేషులు పి.టి. రెడ్డి.

**లక్ష్మాగౌడ్ :**

అంతర్జాతీయ ఖ్యాతి గడించిన మరొక తెలుగు చిత్రకారుడు లక్ష్మాగౌడ్. 1940లో హైదరాబాదుకు 40 మైళ్ళ దూరంలో వున్న నిజాంపూర్ గ్రామంలో జన్మించారు. హైదరాబాద్ స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో 5 సంవత్సరాల పాటు చిత్రకళలో శిక్షణ పొంది 1963లో ఫ్రెస్కో టెక్నిక్‌లను నేర్చుకున్నారు. కొంతకాలం బరోడాలో సంప్రదాయ చిత్రకళను అభ్యసించారు. ఆయన చ్నితనంలో అనుభవించిన అనేక సంఘటనలు ఆధారంగా ఎన్నో రీతుల చిత్రాలను రూపొందించిన ఈయన హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయంలో సరోజినీ నాయుడు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్‌లో ప్రొఫెసర్‌గా పనిచేసి పదవీ విరమణ చేశారు.



నిజమైన కళ ఎప్పుడూ ప్రజల ఆలోచనలను, భావాలను ప్రతి బింబిస్తుంది. కళాకారుడు తన జీవితంలో అనుభవాలను, అనుభూతులను సూటిగ చెప్పగలుగుతాడు. ఒక చిత్రకారుడు తన చిత్రరచనా పరిశోధనలు సాగించే ముందు తనదైన శైలిలో మంచి సత్తా సంపాదించాలి. సంప్రదాయకత,సమకాలీనత రెండింటినీ ఎప్పటికప్పుడు సమన్వయ పర్చాలి. వేసిన పద్ధతిలోనే బొమ్మలు వేస్తూ కూర్చోకూడదు. తాను చిత్రించిన చిత్రాలలో దృఢనమ్మకం ఉండాలి. అది సాధించాలి అంటే దానికి కొన్ని చిత్రరచనా పద్ధతులు ఉన్నాయి. అవి మనం ఇంప్రెషనిజం, ఎక్స్‌ప్రెషనిజమ్, క్యూబిజమ్, ఫ్యూచరిజం, సర్రియలిజమ్ మొదలైనవి. ఒక్కొక్క ఇజమ్ ద్వారా ఒక కొత్త ఊహని చిత్రకారుడు వ్యక్తపరుస్తాడు.


భారతీయ జీవన విధాన సరళి అంతా గ్రామీణ ప్రాంతం నుంచి వచ్చిందే. గ్రామ ప్రాంతాల్లోని స్త్రీ పురుషుల నిత్యజీవనం, సుఖదుఃఖాలు, కోపతాపాలు, జానపద శృంగార క్రీడలు,జంతువులు, పక్షులను, మనుష్యులను జంతుజాలాన్ని మిళితం చేసి ప్రధాన వస్తువుగా స్వీకరించి, ఆధునిక చిత్రకళలో అంతర్జాతీయ కీర్తి గడించారు శ్రీ లక్ష్మాగౌడ్.

ఎచ్చింగ్స్, డ్రాయింగులు, టెర్రాకోట ప్రతిమలు, గ్రాఫిక్సు అనేకం రూపొందించారు. ఈయన తెలుపు-నలుపు చిత్రాలకే ప్రాధాన్యత నిచ్చారు తెలంగాణా గ్రామీణ ప్రజల జీవన సరళి,పరిసరాల వాతావరణం, నిత్యజీవితంలో కన్పించే దృశ్యాలను ఎక్కువగా చిత్రించారు. ఈయనచిత్రాలలో నీరస శరీరాలు, గ్రామీణ ప్రజల అమాయక భావాలు, సృజనాత్మకంగా వుంటాయి. ఈ చిత్రాలను చూసినప్పుడు గొప్ప అనుభూతి కలుగుతుంది. ఎందుకంటే ప్రతి వస్తువును నిశితంగా పరిశీలించి, దాని సారాంశాన్ని ఇతర వస్తువులతో సరిపోల్చి ఆయన చిత్రిస్తారు. ఈ ప్రక్రియ గౌడ్ ప్రత్యేకత. రేఖావిన్యాసంలో వస్తు స్వీకారంలో చాలామంది చిత్రకారుల

ప్రభావం ఆయనపై పడింది. ముఖ్యంగా పికాసో, పాల్‌క్లీ, జరమ్‌పటేల్, ఎఫ్.ఎన్.సౌజా, ఎం.ఎఫ్. హుస్సేన్, కె.జి. సుబ్రమణ్యం, వీరి చిత్రాలంటే గౌడ్‌కు ఎంతో యిష్టం. ఎందుకంటే వీరంతా సామాజిక దృక్పథంతో ఎన్నో చిత్రాలు రచించారు. వీరందరూ సర్రియ లిజమ్ (అధివాస్తవికత) పద్ధతిలో చిత్రాలు రచించారు. సర్రియలిజమ్ అంటే సహజమైన మానవ ప్రకృతి అంతా, స్వప్నంలో కన్పిస్తుంది. మనిషి మేధస్సుకు కానవచ్చే పొలిమేరలు, అవ్యక్తంగా మనస్సులో తారాడే వింతభావాలకు సూటిగా రూపకల్పన చేయడానికి సర్రియలిస్టు చిత్రకారుడు ప్రయత్నిస్తాడు. అటువంటి ప్రక్రియతో రూపొందించిన లక్ష్మాగౌడ్ చిత్రాలు అంతర్జాతీయ ఖ్యాతిని గడించాయి.

**టి.వైకుంఠం :**

హైదరాబాద్‌కు చెందిన మరొక గొప్పఆధునిక చిత్రకారుడు టి. వైకుంఠం. తనలోని భావవేగానికి, కించిత్తు భంగం కలగనిరీతిలో రేఖాలావణ్యాన్ని రంగుల మేళవింపు చేసి తన కల్పనా ప్రపంచంలో రూపు కట్టే స్వప్నాలను కాన్వాసుపైకి ఎక్కించిన ప్రయోగశీలి. ఈయన చిత్రించిన చిత్రాలలో మూడు నాలుగు రంగుల కన్నా ఎక్కువ వుండవు. ప్రముఖంగా తెలంగాణా గ్రామీణ ప్రాంతపు స్త్రీల సొగసులు, ప్రకృతి దృశ్యాలను, వివిధ కోణాల్లో ఈనాటికీ చిత్రిస్తున్నారు. తెలంగాణా గ్రామీణ స్త్రీల దృఢవ్యక్తిత్వాన్ని, దాని వెనుక దాగివున్న మార్దవత్వాన్ని, సరళ హృదయాన్ని, ఒకేసారి చూపగలగటం వైకుంఠం ప్రత్యేకత. అందుకే ఈయన చిత్రాలు పలువురి ప్రశంసలు పొందాయి. ఈయన గీచిన



చిత్రాలకు దేశ విదేశాలలో చాలా గిరాకీ వుంది.

టి. వైకుంఠం ప్రతిభ, రంగుల కల చలన చిత్రంతో సామాన్య జనానికి కూడా అర్థం అయ్యింది. ఈ సినిమాలో గీచిన చిత్రాలన్నీ ఈయన ప్రతిభకు గీటురాళ్ళే. ప్రస్తుతం హైదరాబాదు కేంద్రంగా చేసుకుని అనేక చిత్రాలను రచిస్తున్నారు.

**సయీద్ బిన్ మహమ్మదు :**

1940 నుండి కళారంగంలో ఆరంభమైన అభ్యుదయ ఉద్యమానికి ఈయన పేరు పర్యాయపదంగా నిలిచింది. ఈయన జన్మస్థలం మహబూబ్‌నగర్. ఆర్కిటెక్నిక్‌లో ఒక నూతన ప్రక్రియను చిత్రకళలో ప్రవేశపెట్టారు. కళకు నూతన శక్తిని, ఉత్తేజాన్ని సమ కూర్చారు. నిర్దుష్టమైన రంగులను ఎన్నుకొని,కాలాన్ని సందర్భాన్ని, కాలాన్ని వ్యక్తులను మేళవించి కాలం లక్ష్యాన్ని రంగులో స్పష్టంగా చిత్రించారు. సయీద్ బిన్ మహమ్మదు జంతువులు–ప్రవక్త, తన సొంత రూప చిత్రం వంటి వర్ణ చిత్రాలలో ఈయన స్వభావం వ్యక్తమౌతుంది. రూప చిత్రాలు సహజంగా వుంటాయి. శ్రామిక వర్గానికి చెందిన స్త్రీపురుషులను వస్తువుగా స్వీకరించారు. ఈయన చిత్రించిన ప్రాచీనంధ్రుల చరిత్ర – ఘట్టాలు, నాటి రాజుల వైభవం,సింహాసనాలు, ఏనుగులు, సైన్యాలు, కోటలు, బురుజులు మొదలైన అంశాలన్నీ విశాలమైన కాన్వస్ మీద హృదయ రంజకంగా వుంటాయి. ఈయన రూపొందించిన గౌతమీపుత్ర శాతకర్ణి చిత్రం పార్లమెంటు భవనంలో వుంది. దీని నిర్మాణానికి 5 సంవత్సరాల



కాలం పట్టింది. ఈ చిత్రంలో ప్రదర్శించిన చరిత్రాంశాలను అమరావతి, నాసిక్, సాంచీ శిల్పాలనుంచి గ్రహించారు.

భారతీయ కళకు బదులు పాశ్చాత్య కళారీతులను అనుసరించేవారిని ఈయన తీవ్రంగా విమర్శిస్తాడు. మానవతా వాదాన్ని చరిత్రను సమగ్రంగా ఎరిగిన చిత్రకారుడు సయీద్.

**సూర్యప్రకాశ్ :**

ఎ. సూర్యప్రకాశ్ హైదరాబాదుకు చెందిన మరో ప్రముఖ చిత్రకారులు. జీవితం అంతా కళ కొరకే అర్పించారు. పాతబడిన ప్రతిరూపాలు, భారతీయ సాంస్కృతిక రీతివైపు మొగ్గు చూపకుండా సమకాలీన ప్రపంచపు పోకడలను, జీవిత సమగ్ర అనుభవాలను, తనచిత్రాలలో చూపించడానికి ప్రయత్నిస్తారు ఈయన. ఈ పద్ధతిలోనే 'శీర్షికలు' లేని అనేక తైల వర్ణ చిత్రాలను రచించారు. సంప్రదాయక చిత్ర కళారీతులకు ఈ ప్రక్రియ సవాలు వంటిది. ఈయన ప్రతి చిత్రం వేయడంలోనూ సంఘర్షణకు గురి అయి వివిధ మౌలిక భావాలను రూపొందిస్తారు. త్రుప్పు పట్టిన కారు డొక్కు, తదితర తుక్కు వస్తువులను మాధ్యమంగా గ్రహించి అనేక చిత్రాలు రచించారు. మూల వస్తువులను విఘటనం చేసి, అంతరాంతరాల చైతన్యవంతమైన భావాలను ఆవిష్కరిస్తారు. ఈయన చిత్రాలు ఒక పట్టున అర్థం కాకున్నా. వాటిలోని వర్ణాధిక్యత, స్వచ్ఛతా, ప్రశాంతత వెంటనే ఆకట్టుకుంటాయి. అంతరంగ భావాలను వ్యంగ్యంగా సూచించడం ఈయన శైలిలో కన్పిస్తుంది. ప్రముఖ ఫ్రెంచ్ చిత్రకారుడు సిజానే వర్ణ సంప్రదాయాన్ని ఈయన అనుసరించారు.


**పి.యస్. చంద్రశేఖర్ :**

ప్రతివస్తువులో సౌందర్యం గోచరిస్తుంది. గులకరాతిలో నూతన

ఆకారం, మేఘాలు పై వర్ణరేఖలు, తుప్పు పట్టిన ఇనుముపై అందమైన దొంతర్లు సుందరంగా కన్పిస్తాయి. అయితే ఆ సౌందర్యం చూసేవారిని బట్టి వుంటుంది. అది కళాకారుని చేతిలో వుంటుంది. ఈ కోవకుచెందిన హైదరాబాదు చిత్రకళాకారుడు శ్రీ చంద్రశేఖర్ అన్ని వస్తువుల్లో అందాన్నే చూశారు. అది జంతువులు కావచ్చు, పక్షులు కావచ్చు. నిజానికి మనుష్యుల్లోనే జంతు లక్షణాలు కన్పిస్తాయి. మనుష్యుల కంటే జంతువులు ఎక్కువ మానవత్వం కలిగి వుంటాయి. ఈ భావనతో చంద్రశేఖర్ చిత్రరచన చేశారు. మనుష్యుల స్వభావాలను రకరకాల మర్కట రూపాల ద్వారా, శృంగారాన్ని ప్రకృతి ద్వారా చిత్రించారు. మనుష్యుల అంతరంగాలను ఆదిమానవుని రూపంలో చిత్రిస్తారు. ఈయన టెంటేషన్ శీర్షికతో రచించిన చిత్రాలలో అనేక జంతువుల, పక్షుల ఆకృతులను సృష్టించి మనిషిలోని భావాలను విపులీకరిస్తారు.

**పెండం గౌరీశంకర్ :**

మరో హైదరాబాద్‌లోని మరో చిత్రకారుడు గౌరీశంకర్. 1936లో ఘటకేస్కర్‌లో జన్మించారు. ఈయన చిత్రలేఖనంలో జె.జె. స్కూల్ ఆఫ్ ఆర్ట్స్, హైదరాబాద్ ఫైన్ ఆర్ట్స్ కాలేజిల నుండి చిత్రకళలో డిప్లొమాలు సాధించారు.



బరోడాలో గ్రాఫిక్సులో తర్ఫీదు పొందారు. హైదరాబాదు జె.ఎన్.టి.యు. లో చిత్రకళ ఉపాధ్యాయుడుగా పనిచేశారు. ఈనాటికీ చిత్రరచన చేస్తున్నారు. గౌరీశంకర్ తాను రచించిన చిత్రాలకు హైదరాబాదు ప్రాంతమే స్ఫూర్తి నిచ్చింది అంటారు. ఇక్కడి నేల గరువునేల, ఎండకు ఎండి, బీటలు వారి నారింజ-ఎరుపు రంగులో వుంటుంది.

అందుకే ఈయన చిత్రాలలో ఆ సౌందర్యం కనిపిస్తుంది. తెలుగుదేశంలోని సంప్రదాయక కళలోని అందమైన అలంకారిక వస్తువులను,విశేషాలను తన రచనలో చూపిస్తారు.

ఈయన రూపొందించిన చిత్రాలు సాధారణమైన మనుష్యులవి. శ్రామికుల జీవన సరళిని చూపిస్తారు. మోటుదేరిన తలలు, బిగిసిన కండరాలు, శ్రమశక్తిని ధారపోసే జీవాలు ఈయన చిత్రాల ఇతివృత్తాలు.

గౌరీశంకర్‌కి ఏవాదం మీద విపరీత పట్టుదల లేదు. కాన్వాసు మీద స్వయం వ్యక్తిత్వంలో చిత్రాలు సృష్టించే ఉత్తమ కళాకారుడు. ఆయన చిత్రించిన చతురస్రాలు, గ్రాఫిక్కులు, తైలవర్ణ చిత్రాలు విమర్శకుల ప్రశంసలు పొందాయి. నేటికీ చిత్రరచన సాగిస్తున్నారు గౌరీశంకర్.

**పి.ఆర్. రాజు :**

రాయ్ చౌదరి వద్ద చిత్రకళలో తర్ఫీదు పొంది, విశేష పేరు ప్రతిష్టలు పొందిన కళాకారులు శ్రీ పి.ఆర్. రాజు. ఈయన స్వస్థలం చిత్తూరు జిల్లా. ప్రస్తుతం హైదరాబాదును కేంద్రంగా చేసుకొని చిత్ర రచన కొనసాగిస్తున్నారు.

ప్రాధమిక దశలో రాజుగారు గ్రామీణ వాతావరణాన్ని పల్లెపడుచు కోరకలను, పొలాలను, బీడులను చిత్రించారు. అటు తర్వాత ప్రతీక వాదానికి ప్రాధాన్యాన్నిస్తూ, కరవు కాటకాలను వస్తువుగా తీసుకొని మరికొన్ని చిత్రాలు వేశారు. ఈయన గీచిన అనేక చిత్రాలలో 'ఆకలి, పెనుగులాట, పతనం, సంక్రాంతి, దేవాలయానికి,ఏక్‌తార, విశ్రమిస్తున్న స్త్రీ, సముద్రంపై తుఫాన్ రానున్న శిశిరం మనోవేదన, సంఘర్షణ' ఈ చిత్రాలు మంచి భావపుష్టికి ఉదాహరణలు.

గత 45 సంవత్సరాలుగా చిత్రరచన చేస్తూ ప్రస్తుతం

హైదరాబాదులో ఆర్టు స్టడీ సర్కిల్ ఏర్పాటు చేశారు. అనేక మంది యువతీ యువకులకు చిత్రకళలో శిక్షణ ఇస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నృత్య నాటక లలిత కళా సంస్థల చిహ్నాలను ఈయనే రూపొందించారు. కొన్నాళ్ళ 'కళ' అనే జర్నల్ ను కూడా నడిపారు. ఈయన రచించిన చిత్రాలు వివిధ మ్యూజియంలలో ప్రదర్శితమై వున్నాయి.

## ఈతరం ప్రఖ్యాత తెలుగు చిత్రకారులు

### ఎక్కా యాదగిరి రావు:

ఆచార్య ఎక్కా యాదగిరిరావు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు పొందిన శిల్పకళా నిపుణులు. తెలుగునాట 'ఆధునిక శిల్పకళకు చిరునామా. 2001లో ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వం, సాంస్కృతిక వ్యవహారాల శాఖ, హంస బహుమతితో సత్కరించింది.



శిలలు, లోహపు ముక్కలను అతికించి, భారీ పరిమాణంలో శిల్పాలు రూపొందించడమే కాక, లోహపు మూర్తి విగ్రహాలకు యాదగిరిరావు పెట్టింది పేరు.

మూడు దశాబ్దాల పాటు హైదరాబాదు లోని జె.ఎన్.టి.యు. ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో శిల్పశాస్త్ర ఆచార్యునిగా పనిచేసి 2000 సంవత్సరంలో పదవీ విరమణ చేసిన రావుగారు ప్రస్తుతం శిల్పకళలో నూతన ప్రయోగాలు చేస్తున్నారు. యాదగిరిరావు రూపుదిద్దిన శిల్పాలు తెలుగునాట అనేక ప్రాంతాల కూడళ్ళలో ఉన్నాయి. 57 ఏళ్ళ క్రితం హైదరాబాదు నగరపాలక సంస్థ కోసం ఆయన రూపుదిద్దిన నెహ్రూ కంచు విగ్రహం పాతనగరంలోని లాల్ దర్వాజా కూడలిలో ప్రతిష్టించారు. తర్వాత అసెంబ్లీ ఎదురుగా గన్‌పార్క్‌లోని 25 అడుగుల తెలంగాణా

అమరవీరుల స్మారక స్థూపం మనం ఎరిగిందే. ఎన్టీఆర్ హయాంలో టాంక్‌బండ్‌పై తెలుగు వెలుగుల శిల్పాలలో 9 అడుగుల ఎత్తులో ప్రముఖ రచయిత సంపాదకుడు సురవరం ప్రతాపరెడ్డి కంచు విగ్రహం ఆయన రూపొందించిందే. అదే విధంగా కరీంనగర్ జిల్లా మెట్‌పల్లిలో 12 అడుగుల బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం, హైదరాబాద్ నగరంలో శాస్త్రవేత్తలు డాక్టర్ విక్రమ్-సారాబాయి, డాక్టర్ బ్రహ్మప్రకాశ్‌ల కంచు విగ్రహాలను కూడా ఆయనే రూపొందించారు. 1999లో విశాఖ నగరపాలక సంస్థ కోసం 9 అడుగుల ఎత్తయిన డా॥ దుర్గాభాయ్‌దేశ్‌ముఖ్ విగ్రహాన్ని రూపొందించారు.

భారతీయ, విదేశీ శిల్పకారులు సృష్టించిన కళాఖండాల నుంచి ముఖ్యమైన అంశాలెన్నో నేర్చుకున్నాను అని పలు సందర్భాలలో యాదగిరిరావు పేర్కొన్నారు.

1938లో హైదరాబాద్ పాతనగరంలోని అలియాబాద్‌లో యాదగిరిరావు జన్మించారు. రంగు రంగుల ముగ్గులతో రోజూ వాకిలిని అలంకరించే తల్లి నాగమ్మ, బంకమట్టితో బొమ్మలు, భారీ వినాయక విగ్రహాలు చేసే పినతండ్రి నుంచి యాదగిరిరావు మొదట ప్రేరణ పొందారు. తర్వాత ప్రముఖ శిల్పకారులు డి.ఎ. పాటల్,ఉస్మాన్ సిద్ధిఖీల నుంచి శిల్పకళలో మూల సూత్రాలు నేర్చుకున్నారు. గణితంలో బి.ఎ. శిల్పకళలో డిప్లమో చేశారు. జె.యన్.టి.యు.లో శిల్పకళాచార్యునిగా పదవీవిరమణ చేసిన యాదగిరిరావు జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో అనేక పతాకాలు గెలుచుకున్నారు. ఆయన రూపొందించిన మానవుడు శిల్పం 1975లో మూడో ట్రినిటీ - అంతర్జాతీయ ప్రదర్శనకు ఎంపిక అయ్యింది. 1986లో సార్క్ దేశాల సమావేశ కాలంలో, ప్రపంచ తెలుగు మహాసభల్లో ఆయన ప్రదర్శనలు ఏర్పాటు చేసి అనేక గౌరవాలు, సన్మానాలు పొందారు. ఈనాటికీ శిల్పాలు సృష్టిస్తూనే వున్నారు.

## సూరపనేని జనార్ధన్ (జెన్నీ):

సూరపునేని జనార్ధన్ ప్రకృతి దృశ్యాల చిత్రలేఖనాన్ని ఉద్యమంలా చేపట్టారు. చిన్న చిన్న మొక్కలు, నిటారున లేచిన చిత్రాలు, గుబురులాంటి చెట్లు, పొదలు, అప్పుడే పూసిన పూల మొగ్గలు, విప్పారిన చేమంతులు, పూబంతులు, అనేక రంగుల్లో శోభాయమానంగా సూరపునేని జనార్ధన్ చిత్రించారు. జెన్నీ చిత్రించిన పువ్వులు నవ్వులు వెదజల్లుతాయి. ప్రకృతిని ఆరాధిస్తాయి. ఈయన చిత్రించిన చిత్రాలలో గామీణ సౌందర్యం, ఆనందం, ప్రేమ, ఆమాయకత్వాలకు అద్భుతమైన రంగుల సమ్మేళనంతో రూపకల్పన చేశారు. ఈయన గీచిన గీతలు ముగ్ధమనోహరంగా ఉంటాయి.

సూరపనేని జనార్ధన్ 1935లో కృష్ణాజిల్లా ఎలుకపాడు గ్రామంలో జన్మించారు. సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన ఈయన అన్న సూరపనేని కళాధర్ సినీరంగంలో కళాదర్శకులుగా గొప్ప పేరు గడించారు. జెన్నీ డ్రాయింగ్‌లో లోయర్, హయ్యర్ పూర్తి చేశారు. హైదరాబాద్‌లోని ఫైన్ ఆర్ట్స్ కళాశాల నుంచి చిత్రలేఖనంలో డిప్లమో పొందారు. ఈయన తన స్వగృహంలో సొంత చిత్రశాలను నెలకొల్పి అనేక యువ చిత్రకారులకు శిక్షణ ఇస్తున్నారు.

## లక్ష్మణ్ ఏలే :

గ్రామీణ వాతావరణం అంటే ఈ ఆధునిక చిత్రకారునికి ఎంత అభిమానమో, ఈయన చిత్రాలను చూస్తే తెలుస్తుంది. చిత్రాలలో తెలంగాణా గ్రామీణ ప్రజల ప్రేమ, అమాయకత్వాలు, విషాదపు ఛాయలు, తెలంగాణా మట్టి ప్రజల సువాసనలు భావగర్భితంగా వుంటాయి. ఈయన చిత్రాల్లో డ్రాయింగ్ నేర్పరితనం, రంగుల మేళవింపు పరిపక్వ దశలో వుంటాయి. చూపరులను ఒక్కసారిగా గ్రామీణ ప్రజల జీవన సరళిని

ఆలోచింపజేస్తాయి. కొన్ని చిత్రాలలో చిన్న చిన్న నుదుర్లు, పెద్దకళ్ళు, దళసరి పెదాలు, మోటైన బ్రష్ పనితనం ప్రస్ఫుటంగా కన్పిస్తాయి. ఈయన చిత్రించిన చెట్టెక్కే పేదగీత పనివారు, ఆరుబయట పసువులు మేత దృశ్యాలు, తెలంగాణా ప్రాంత వీధుల్లో నడిచే స్త్రీ–పురుషులు, గ్రామ చావడిలో తీరికగా కూర్చునే స్త్రీలు, బావుల వద్ద నిల్చున్న స్త్రీలు, చిత్రకారుని చిన్నతనం జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకొని, భావగర్భితంగా ఏలే లక్ష్మణ చిత్రించారు. తెలంగాణా గ్రామీణ వాతావరణంలో పెరిగే స్త్రీ, పురుషుల సాదాసీదా వేషధారణ, ఒంపులు తిరిగిన సన్నని నడుములు, చేతులు పైకి ఎత్తే స్త్రీల దృశ్యాలు అద్భుతంగా చిత్రించారు. గ్రామీణ వాతావరణంలోని సహజ అందాలను భావగర్భితంగా ఆలోచనాత్మకంగా చిత్రించిన శైలి అపురూపంగా వుంటుంది.

లక్ష్మణ్ ఏలే హైదరాబాద్‌లో జె.యన్.టి.యు. ఫైన్ ఆర్ట్స్ కళాశాల నుంచి బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ చిత్రకళ పట్టా పొందారు. కామర్సులో డిగ్రీ పట్టా పొందారు. నల్గొండ జిల్లా కదిరేని గూడెంలో 1961 సం.లు పద్మశాలి కుటుంబంలో జన్మించి అతిపేదరికం అనుభవించారు. అందుకే ఈయన చిత్రాలను సూక్ష్మంగా పరిశీలించినట్లయితే పేదరికపు ఛాయలు ప్రస్ఫుటంగా కన్పిస్తాయి.

లక్ష్మణ్ ఏలే అనేక చిత్రకళా ప్రదర్శనల నిర్వహణ సంస్థల నుంచి బహుమతులు స్వీకరించారు. కోనసీమ చిత్రకళా పరిషత్తు అమలాపురం వారు పోటీ చిత్రలేఖనంలో బంగారు పతకం సాధించారు. 1995 అమెరికాలోని ఛికాగోలో తానావారు నిర్వహించిన ప్రదర్శనలో పాల్గొన్నారు. హైదరాబాద్ ఆర్ట్స్ సొసైటీ నుంచి సౌత్ జోన్ కల్చరల్ సెంటర్ (నాగపూరు) చిత్రకళా నిపుణుడుగా పాల్గొన్నారు.

లక్ష్మణ్ ఏలే పేపరు మీద అనేక యాక్రిలిక్స్ చిత్రాలు చిత్రించారు. వాటిలో కొన్ని ముఖ్య చిత్రాలు.

ది వైట్ ఇన్ బ్లాక్స్, ఉమెన్ ఎట్ బతకమ్మ, ఉట్టి, రిథమ్, మార్నింగ్ స్ట్రీట్, చంద్రయ్య, డోర్సు, ది సిల్ హట్స్ ఆఫ్ ఎయిటింగ్, వింటర్ నైట్స్, బ్యాక్ హెూం, కంపేనియన్స్, ది స్ట్రీట్స్‌లైవ్స్, వంటి చిత్రాలు ఈయన ప్రతిభకు పట్టంకట్టాయి.

ఇంతవరకూ పేర్కొన్న చిత్రకారులే కాకుండా, హైదరాబాదు స్కూలు అందించిన గొప్ప చిత్రకారులు చాలా మంది వున్నారు. అటువంటి చిత్రకారుల్లో ప్రముఖంగా దొరైస్వామి, ఉస్మాన్ సిద్ధిక్, బదరీనారాయణ, రెడ్డప్పనాయుడు, కుమారిలస్వామి, గోవిందస్వామి, ఆరా, వడ్డాది పాపయ్య, బాపు, శ్రీమతి వాణీకుమారి, జిల్లెల రంగారెడ్డి, కరీం శ్రీనివాసరెడ్డి, మనోహర్ దత్తు, పీరా, ఉదయగిరి, వంటివారు వీరంతా వివిధ మాధ్యమాలలో వివిధ ప్రక్రియలలో తెలుగు చిత్రకళా రంగానికి సేవలందించారు.

ఆధునిక తెలుగు చిత్రకళా పరిణామ క్రమాన్ని వెనక్కి తిరిగి చూచినపుడు ఆచంట జానకిరాం, రాంభట్ల కృష్ణమూర్తి, బాపు, అబ్బూరి గోపాలకృష్ణ, సంజీవ్‌దేవ్,పల్లెటూరి పూర్ణానందశర్మ, కొండపర్తి శేషగిరిరావు,తెలకిచర్ల వెంకటరత్నం, వడ్డాది పాపయ్య, గోపాలకృష్ణమూర్తి, ఆమంచర్ల శేషగిరిరావు, మడిపగడ బలరామాచార్య వంటి ప్రసిద్ధ రచయితలు కన్పిస్తారు. వీరిలో ఎక్కువ మంది చిత్రకళను ఎవరి దగ్గరా అభ్యసించకపోయినా తమ సొంత ఫక్కీని పెంపొందించుకొని చిత్రరచన చేశారు.

ఆధునిక తెలుగుచిత్రకళ ప్రాదుర్భావ కాలంలో భారతి, కిన్నెర, త్రివేణి, ఆంధ్రపత్రిక, ఆంధ్రజ్యోతి, యువ, చందమామ, వంటి పత్రికలు

చిత్రకారుల చిత్రాలను ప్రచురించి ఆంధ్ర చిత్రకళారంగానికి ఎంతో మేలు చేశాయి.

తెలుగు చిత్రకారుల ప్రతిభా రేఖలను సద్విమర్శలు చేసి, అనేక వ్యాసాలను వ్రాసిన విమర్శకుల్లో ఏ.యస్.రామన్, శ్రీపాదగోపాల కృష్ణమూర్తి, ఆచంట జానకీరాం, సూర్యదేవర సంజీవ్‌దేవ్, చలసాని ప్రసాదరావు, వేలూరి రాధాకృష్ణ, అంట్యాకుల పైడిరాజు, మొక్కపాటి కృష్ణమూర్తి మొదలైన వారిని చెప్పుకోవాల్సిన అవసరం వుంది.


ఈనాడు పత్రికా రంగంలో వ్యంగ్య చిత్రాలకు, కథలకు వేసే రేఖాచిత్రాలకు విపరీతమైన ఆదరణవుంది. నేడు ప్రాచుర్యంలో వున్న శైలికి ఒరవడి పెట్టిన బాపు గారంటే తెలియనివారు లేరు. ఆయన రేఖల వంపు, సొంపులను తెలుగతనానికి నిర్వచనంగా భావించడం కద్దు.

నేటి పత్రికారంగంలో వ్యంగ్య చిత్రకారులుగా చంద్ర, గంగాధర్, బాలి, శ్రీధర్, వంటి వారలు గొప్ప పేరు సంపాదించుకున్నారు.

ఈ విధంగా ఎందరో ప్రఖ్యాతి గాంచిన చిత్రకారులే కాకుండా, నేటితరం తెలుగు చిత్రకారులు అసంఖ్యాకంగా తెలుగుదేశంలో తమ చిత్రసేవనందిస్తున్నారు. వారిలో ఏసాల బాలయ్య, శీలా వీర్రాజు, బి.ఎ. రెడ్డి, అంజనీరెడ్డి, అంట్యాకుల రాజేశ్వరరావు, గేదెల అప్పారావు, దివిలి అప్పారావు, కలిశెట్టి అప్పారావు, చివుకుల భరద్వాజశాస్త్రి, క్రొవ్విడి దుర్గాంబ, మర్రి గోపాలరెడ్డి, కవితా దేవూస్కర్, రావూరి సుభాస్ బాబు, చిప్పా సుధాకర్, బి. శ్రీనివాస రెడ్డి, జిల్లెల రంగారెడ్డి, మాచిరాజు రామచంద్రరావు, ఉల్చి వాణీదేవి, మనోహర్ దత్ ఇంకా అనేకమంది నేటితరం చిత్రకారులు వివిధ మాధ్యమాలలో చిత్రరచన చేయడంలో తెలుగుదేశంలో అందెవేసిన చేయిగా చెప్పవచ్చు.

తెలుగునేలపై చిత్రకారులు నాటికీ, నేటికీ ఎన్నో విధాలా ఇబ్బందులు పడుతున్నారు. వారి వారి చిత్రాలను ప్రదర్శించడానికి సరియైన కళాకేంద్రం లేకపోవడం దురదృష్టకరం. ఇతర రాష్ట్రాల్లో ముఖ్యంగా మద్రాసు, కేరళ, మైసూరు, పశ్చిమ బెంగాల్, గుజరాత్ రాష్ట్రాల్లో చిత్రకళా నిలయాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్రదేశంలో కూడా ఆవిధంగా ప్రతేక చిత్రకళానిలయాన్ని ఏర్పాటు చేస్తే సముచితంగా వుంటుంది. దీనికి ప్రభుత్వం వారు సహకరిస్తే మంచిది. తెలుగు సంస్కృతికి నవోత్తేజం కలిగించే దిశగా చేపట్టే చర్యల్లో చిత్ర శిల్పకళలకు కూడా ప్రముఖ స్థానాన్ని కల్పించాల్సిన అవసరం ఉంది.





**డా॥ పి. జోగినాయుడు**
501/బి. విశాల్‌టవర్సు ఏ.ఎస్. రాజునగర్,
కూకట్‌పల్లి, హైదరాబాదు - 72
(R) : 23062105, Cell : 9490784666

# డాక్టరు పి.జోగినాయుడు

| | | |
|---|---|---|
| జననం | : | 1-7-1945, పెంట శ్రీరాంపురం<br>విజయనగరం జిల్లా |
| పి.జి.విద్య | : | ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నం<br>"డిప్లమో ఇన్ మ్యూజియాలజీ ఉస్మానియా యూనివర్సిటీ |
| పి.హెచ్.డి. | : | రాగ - రాగిణీ లఘు చిత్రాలు క్రీ॥శ॥ 18వ శతాబ్దం.<br>తెలుగువిశ్వ విద్యాలయం 2002 |
| ఉద్యోగం | : | రాష్ట్ర పురావస్తుశాఖ, డిప్యూటీ డైరెక్టర్<br>(పురావసు ప్రదర్శన శాలలు - పురావస్తు ఎపిగ్రఫీ) |
| పదవీ విరమణ | : | 30-06-2003: డిప్యూట్ డైరెక్టర్ మ్యూజియమ్స్‌గా |
| రచనలు | : | 1) ఈ జిప్షియన్‌మమ్మీ (తెలుగు 1983)<br>2) ఆంధ్రప్రదేశ్, స్టేట్ మ్యూజియం (మోనోగ్రాఫీ 2000 ఆంగ్లం)<br>3) గోల్డ్ కాయన్స్ ఆఫ్ కాకతీయులు 2001 (ఆంగ్లం)<br>4) మహబూబ్ జిల్లా 'శాసనాలు' వాల్యూమ్ I & II (ఆంగ్లం) 2003 |

ఆంధ్రుల చరిత్ర - సంస్కృతిపై ఆంగ్లం, తెలుగు, భాషల్లో 80 వ్యాసాలు వివిధ జర్నల్స్, దినపత్రికల్లో ప్రచురణలు అయ్యాయి. పి.ఆర్. రామచంద్రరావు (చరిత్రకారుడు) ఆంగ్లంలో తీసిన శ్రీశైలం, భద్రాచలం, సింహాచలం, అమరావతి, శ్రీకాళహస్తి, దేవాలయాలకు పురావస్తుశాఖ నిపుణుడుగా డాక్యుమెంటరీలకు పనిచేశారు. సుమారు 25 రేడియో ప్రసంగాలు వివిధ అంశాలపై చేశారు. 'భాగ్యనగర్ గాదలు' ఆంధ్రప్రదేశ్ జర్నల్లో ధారావాహిక ప్రచురణ అయ్యింది..

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమీషన్ రూపొందించిన ఆంధ్రుల చరిత్ర - సాంఘిక పరిస్థితులు' సివిల్స్, గ్రూపు I, II పోటీ విద్యార్థులకు గత 8 సంవత్సరాలు ఈనాడు, సాక్షి దిన పత్రికల్లో వ్యాసాలు ప్రచురితమయ్యాయి.

రాష్ట్రంలో వివిధ విశ్వవిద్యాలయాల్లో పర్యాటకశాఖ అంశాలపై విద్యార్థులకు బోధన చేయడం జరిగింది. మౌలానాకలామ్ ఉర్దూ విశ్వవిద్యాలయానికి 'మ్యూజియం - పరిపాలన' అనే అంశంపై ఆంగ్లంలో సెలబసు రూపొందించారు.

Blank Page

## ప్రపంచ తెలుగు మహాసభల ఆశయాలు

- తెలుగు జాతి భాషా సంస్కృతులపై నేటి యువతరానికి ఆసక్తి కలిగించేలా ప్రణాళికలు తయారు చేయడం.
- ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని ఒక వేదికపై చేర్చి భాషాసంస్కృతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు కనుగొనడం.
- తెలుగుభాష ప్రపంచ భాషలతో సరితూగేలా అంతర్జాలంలో ఉపయోగించడానికి చర్యల లు చేపట్టడం.
- తెలుగు పాలన, బోధన, ప్రసార మాధ్యమ భాషగా వినియోగించేందుకు చర్యలు తీసుకోవడం.
- తెలుగువారి జానపద, సంప్రదాయ కళారూపాల ప్రదర్శనలకు, ప్రచారానికి ప్రణాళిక రూపొందించడం.
- తెలుగు జాతి ప్రాచీనతలను, ప్రశస్తిని వెలుగులోకి తేవడం.
- తెలుగు జాతి చరిత్రపై, భాషపై గ్రంథాలు ప్రచురించి కొత్త పారిభాషిక పదాలు తయారుచేయడం.
- తెలుగు భాషను అభ్యసించే వారికి సరళమైన శైలిలో పాఠ్యగ్రంథాలు, బోధనోపకరణాలు తయారు చేసే ప్రణాళిక రూపొందించడం.
- తెలుగు నేలపై గల చారిత్రక, ఆధ్యాత్మిక స్థలాలకు, పర్యాటక కేంద్రాలకు ప్రాచుర్యం కల్పించడం.

**తెలుగు భాష వికాసం** **తెలుగు సంస్కృతి ప్రకాశం**

**దేశ భాషలందు తెలుగు లెస్స**